ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక




వెల 4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY


సంపుటము 42 సంచిక 18

డిశంబరు 28 1949


తెలుగు జిల్లాలలో మద్రాసు గవర్నరు పర్యటన



గవర్నరు భావనగర్ మహారాజా ఈనుమద్య కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠమును సందర్శించినప్పటి దృశ్యం. పీఠం ప్రధానాచార్యుడు క. వెం.[?]న్న. అప్పారావు, మాగంటి బాపినీడు, ప. గో. జి. కలెక్టరుగార్లుకూడ ఇందు కలరు.



గవర్నర్ భావనగర్ మహారాజాగారు ఇటీవల గుంటూరు వెళ్ళి, ఆ జిల్లా ఎంప్లాయిమెంటు ఆఫీసు సందర్శించినప్పటి దృశ్యం. పి. వి. కృష్ణయ్య చౌదరి, జిల్లాకలెక్టరు ఎం. కనకసుందరం, జి. ఎం. ఆఫీసరు కాప్టెన్ కె. వి. ఆర్. చౌదరి, గవర్నరు, డాక్టర్ వీరయ్యచౌదరి, సబ్ రీజియనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసరు పి. వీరాస్వామి, జిల్లాజడ్జి నాడార్, జి. పో. సూపరింటెండెంటు కల్యాణరావుగార్లు వరుసగా నిలబడిఉన్నారు.



శ్రీ మద్రాసుగవర్నరుగారు వారి సతీమణి శ్రీ భావనగర్ మహారాణీ సాహెబుగార్లు, ఏలూరులో సహకార తివాచీ ఉత్పత్తి విక్రయసంఘప్రదర్శనశాలను దర్శించిరి. పటము ముందు పై సంఘాధ్యక్షులు శ్రీ దామరాజు వెంకట్రావుగారు, వారి సతీమణి, తి. పి. అమ్మన్నరాజా ఎం. ఎల్. ఏ. గార్లు గలరు.

అమరావతి




…త్రిక ప్రదర్శనాలయములోనికి గవర్నర్ గారిని, చారిత్రికపరిశోధనశాఖ సూపరింటెండెంట్ డా. సుబ్రహ్మణ్యం తీసికొనిపోవుచున్నారు. ముందు: మహారాణిగారు, శ్రీమతి ప్రభాకరరావు.




అమరావతి చారిత్రక వస్తుప్రదర్శనాలయమువద్ద గవర్నర్ గారు.



అమరావతి స్తూపంవద్ద గవర్నరుసతీమణి.



డా. సుబ్రహ్మణ్యం, గవర్నర్, మహారాణి, మేజర్ సి. యస్. రెడ్డి



లాం పసువులశాలలో, మంచి బొమ్మలకై వేటాడుచున్న గవర్నర్ గారు



ప్రదర్శనాలయమునుంచి స్తూపక్షేత్రమునకు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక, అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42

సంచిక 18

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర పుష్య శుద్ధ నవమి బుధవారము



మదరాసులో గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు అఖిలభారత స్వదేశీ ప్రదర్శన ప్రారంభోత్సవం జరుపుతున్నప్పటి దృశ్యం.



ఆంధ్రపత్రిక

1949–వ సం॥ డిశంబరునెల 28–వ తేది బుధవారము

రాజధానీసమస్య: నాయకుల బాధ్యత

విభజనసంఘమునందలి ఆంధ్ర సభ్యులు ఆంధ్రరాష్ట్రరాజధానీస్థలమును ముందుగ నిర్ణయించి తెలిపిన గాని, ఏవిషయముపైనను సమాధానమునకు వచ్చుట సాధ్యముగాదని తమిళ ప్రతినిధులు పట్టుబట్టుటవలన విభజన సంఘకార్యకలాపమున్న ప్రతిష్టంభన మేర్పడినదను వార్త 1950 జనవరి 26 లోపున ఆంధ్రరాష్ట్రనిర్మాణము పూర్తి కాగలదా యనువిషయముననే గాక, రాజధానీస్థలనిర్ణయవిషయములో ఇంత అవ్యవధిగ నాయకులు చేయు తీర్మానము సర్వజనసమ్మతముగ నుండునా యను విషయమున కూడ సందేహములు కలుగుట సహజము. ఆ మధ్య ఆంధ్రపత్రికయందు ‘ఒక ఆంధ్రుడు’ వెల్లడించినట్లు నాయకులు ప్రస్తుత అవసరములనుబట్టి నిర్ణయించు రాజధానీ నగరము హైదరాబాద్ సమస్య పరిష్కార మగువరకు తాత్కాలికమే యగును. తమిళనాయకులు తిరిగి మాట తప్పకున్న, ఆంధ్రరాష్ట్ర శాశ్వత రాజధాని ఏర్పడి ప్రభుత్వకార్యాలయములు అచటికి మారువరకు వ్యవహారరాజధాని చెన్నపట్టణముగనే యుండును.

అట్లు గాక ఆంధ్రరాష్ట్రరాజధాని నిర్ణయమైనదిగనుక ఆంధ్రప్రభుత్వ కార్యస్థానములు అచటికి మారవలెనని వారు పట్టుబట్టిన అందుకు కూడ మన నాయకులు సమ్మతింపవలసిన “అవసరము” కలుగును. ఆంధ్రుల యవసరములను తమిళులు తమ లక్ష్యసిద్ధికి సాధనలుగ వినియోగించుకొనుచుండిరి. కనుక తమిళుల కోరికప్రకారము ఆంధ్రనాయకులు ‘తాత్కాలిక’ రాజధానీనగరమని ఏ పేరు సూచించుట జరిగినను, అవసర మేర్పడిన - ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన అట్టి అవసరము ఏర్పడుననియే తోచుచున్నది– ప్రభుత్వకార్యాలయములను అచ్చట ఏర్పరచుకొనుటకు గల యవకాశములనుసైతము విచారించి రాజధానీస్థల నిర్ణయమును చేయవలసియుండును.

ఇట్టి సందర్భమున యావదాంధ్ర భవిష్యత్తుకు సంబంధించిన ఇంతటి ప్రధానవిషయముపై ఏ కొందరో సమావేశమై నిర్ణయముచేయుట సబబు గాదు. వీరి తొందరపాటునిర్ణయఫలితమును తరతరాలవరకు అనుభవింపవలసియుండును. కనుక తాత్కాలిక రాజధానినైనను రాష్ట్రమంతటికిని కేంద్రముగ నుండుట యవసరము. విశ్వకళాపరిషత్తు విశాఖపట్నమునకు వెళ్లెనను కారణమున ఇంతకాలము ఆంధ్రవిశ్వవిద్యాలయములోచేర నిరాకరించిన వారు ఈనాడు ప్రభుత్వకేంద్రము తమ ప్రాంతమున నున్న ఇతరప్రాంతములు కూడ అట్టివైఖరిని అనుసరించవచ్చునని గ్రహింపవలసియుండును. విశ్వకళాపరిషత్తునుకూడ కేంద్రముగ నుండు స్థానమునకు మార్చుటకు ప్రయత్నించి యావదాంధ్రమునకు అన్ని సంస్థలు అందుబాటులో నుండునట్లు చూడవలసియున్నది. అట్లు గాక స్వీయ ప్రయోజనములకు ప్రాధాన్య మిచ్చి, రాష్ట్రమును శీఘ్రముగ పొందవలెనను ప్రజల ఆత్రమును అవకాశముగ తీసుకొని స్వకీయప్రయోజనముల సాధనకు కృషిచేసిన, ఈ నాయకత్వమునకు ప్రమాదకరము కాగల పరిస్థితులు ఏర్పడగలవు. నాయకులు ఈ విషయమును గ్రహింపవలసియుండును. నాయకులు నేడెట్టి నిర్ణయము చేసినను, అది ఉచితముగ నున్ననే, ప్రజల సమ్మతిని పొందగలదు. తొందరపాటునిర్ణయము వలన రాగల దుష్ఫలితములు, దారుణ ప్రమాదములు వీరు గ్రహించినట్లు కన్పింపదు. రాష్ట్రనిర్మాణమునకని, రాష్ట్రభవిష్యత్తునే బలి యిచ్చుట రాజనీతిజ్ఞత కాజాలదు.

తమిళనాయకులు దాదాపు ఒక మాసమురోజులుగ “ఆంధ్రప్రభుత్వస్థానము చెన్నపట్టణమునందొక్క క్షణమైనను ఉండరాదు,” అని ఆంధ్రనాయకులను హెచ్చరించుటే గాక కేంద్రప్రభుత్వమువద్దకు రాయబారము వెళ్లి ఇదేవిషయమును నివేదించియుండిరి. భారతప్రభుత్వహోంశాఖాకార్యదర్శి శ్రీ హెచ్. వి. ఆర్. అయ్యంగారు నవంబరు 25 వ తేదీ చెన్నరాష్ట్రప్రభుత్వమునకు వ్రాసిన లేఖయందీరాయబారవిజ్ఞాపనను ప్రస్తావించి, ఈ విషయమును ఆంధ్రనాయకులు విచారించియుందురని కూడ తెలిపెను. ఆంధ్రనాయకులు ఈ విషయమును తగినంత శ్రద్ధతో విచారింపలేదనీ, రాష్ట్రనిర్మాణఉత్తరువు జారీఅయిన ఉత్తరక్షణమున చెన్ననగరమును వదలిపోవలసిన పరిస్థితులు ఏర్పడగలవని ఆంధ్రనాయకు లూహింపలేదనీ ఈ వారపు సంఘటనలు స్పష్టము చేయుచున్నవి.

రాజధానీస్థలనిర్ణయమువిషయమున, రాష్ట్రసంపాదనకొరకు చెన్ననగరమును వదులుకొనకలిగిన, ఆంధ్రనాయకులు ఏకాభిప్రాయమునకు రాగలరనే విశ్వసింపవచ్చును. ఆ నిర్ణయమునకు వచ్చుటలో ఇందుకు సంబంధించినయావత్తువిషయములను ఉన్న వ్యవధిలోనే సావధానముగ, శ్రద్ధగ ఉద్రేకములకు తావివ్వక నిర్ణయింపవలెను. ఏమైనను, రాష్ట్రనిర్మాణము వాయిదాపడుటకు వీలుగాదు. పరిపాలనయందు అనిర్ణయస్థితి ఏర్పడుట ప్రమాదకరము. ఇప్పటికే అట్టిస్థితి ఏర్పడినసూచనలు కన్పించుచున్నవి. ఈ పరిస్థితులు స్థిరపడకుండ చూడవలసిన బాధ్యత చెన్నరాష్ట్రప్రభుత్వముపైనను, ఆంధ్రనాయకులపైనను సమముగ గలదు. ఉభయులు సమాధానమార్గమును అనుసరించి సత్వరరాష్ట్రనిర్మాణమునకు దోహదము చేయగల నిర్ణయములను చేయుట ద్వారానే ఉభయులు ఈ బాధ్యతను నిర్వహింపగలరు.

హైదరాబాద్ భవిష్యత్తు: గవర్నరు జనరల్ సూచన

భారత గవర్నరుజనరల్ శ్రీ రాజగోపాలాచారిగారు గతబుధవారము నైజాం ఇచ్చిన విందులో చేసిన ప్రసంగమున వెల్లడించిన భావములను బట్టి నైజాం “అమాయకుడ”ని, 1948 సెప్టెంబరు 18 వ తేదీకిపూర్వము సంస్థానమునందు జరిగిన సంఘటనలకు ఎంతమాత్రము బాధ్యుడు కాడని ఒక యభిప్రాయము కలుగుట సహజము. కేంద్రప్రభుత్వాభిప్రాయమునే గవర్నరు జనరల్ ఈ ప్రసంగమునందు వెల్లడించెనని ధృవపడిన, సంస్థానప్రజలకే గాక, సంశ్లిష్టభారతీయ రాష్ట్రములందున్న యావన్మందిప్రజలకుకూడ తీవ్రమైన అసంతృప్తి కలుగుట సహజము. లోగడ భారతప్రభుత్వమంత్రులు అందును ‘ముఖ్యముగ’ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ, ఉపప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడ సంస్థానభవిష్యత్తు ప్రజాభిప్రాయమననుసరించి నిర్ధారణ కాగలదని హామీ నిచ్చియుండిరి. ప్రజాభిప్రాయము హైదరాబాదు సంస్థానకాంగ్రెస్ ద్వారా ఇదివరకే వ్యక్తమైనది. హైదరాబాదుసంస్థానమును వివిధ భాషాభాగములుగ విభజించి సంశ్లిష్ట భాషారాష్ట్రములతో చేర్చివేయవలెనని ఇదివరకే సంస్థానకాంగ్రెస్ తీర్మానించియుండెను. సంస్థానరాజకీయములు పరిశీలించినను, ఇట్టి విభజన అత్యంతావశ్యకమని స్పష్టమగుచున్నది.

ఇట్టి పరిస్థితులలో గవర్నరుజనరలు రాజగోపాలాచారిగారు “మూడు శతాబ్దములనుండి తన ఐక్యతను, ప్రత్యేకతను నిలబెట్టుకొనిన హైదరాబాదు సంస్థానము ఇకముందు కూడ ఏకఖండముగ నుండి భారతరిపబ్లిక్‌లో సముచిత గౌరవస్థానమును సంపాదింపవలెనని సంస్థానప్రజలు సుఖులై ఉండవలెనని మాత్రమే నైజాం ఆశించుచుండిరి, దేశమంతయు అల్లకల్లోలముగ నున్న రోజులలో ఈ సంస్థానమును స్థాపించి నిలబెట్టిన వంశమునకు చెందిన నైజాం ఈకోరిక సహజము సహేతుకము” అని ప్రకటించుట ఆశ్చర్యముగ నున్నది. అంతేగాక ఇప్పటివరకు హైదరాబాదుసంస్థానము ఎట్టి స్వాతంత్ర్యమును అనుభవించియుండలేదని భారతప్రభుత్వము వాదించుచుండగ, గవర్నరుజనరల్ ఈ ప్రసంగముననే నైజాం స్వాతంత్ర్యమును అనుభవించుచుండినట్లు సూచించిరి. భారతప్రభుత్వవిధానము ఈ విధముగ ఇదివరకు నిర్ణయమై యున్నను, ఇకముందు వీరి యభిప్రాయములనుబట్టి ఈ విధముగ నిర్ణయమైనను సంస్థానమునందిప్పటికీ ప్రబలముగ నున్న అరాచకశక్తులు ఇంకను విజృంభించి గత 13 మాసములుగ సైనికప్రభుత్వము సాధించిన మహత్కార్యములన్నింటిని క్షణకాలములో విచ్ఛిన్నము చేయగలవు. ప్రజాబాహుళ్యమున ప్రభుత్వముపై అసంతృప్తిని కల్పించి తిరుగుబాటును ప్రోత్సహించుటకు సంస్థానమునందలి విచ్ఛిన్నశక్తులకు ఇందువలన మరొక అవకాశము లభించును. కనుక సంస్థాన ప్రజల క్షేమముదృష్ట్యానే గాక, సంశ్లిష్ట రాష్ట్రములందు శాంతి భద్రతల రక్షణదృష్ట్యాకూడ ప్రభుత్వము తన వైఖరిని స్పష్టము చేయుచు ఒక ప్రకటన చేయుట అవసరము.

ముఖచిత్రం

‘ జ్యోతి ’

ఛాయాచిత్రకారుడు:—

శ్రీ డి. అన్నాజీరావు, మద్రాసు.

మనరాష్ట్రం: మనదేశం:

★ ఉత్సవాల ముమ్మరం ★

★ ఆంధ్రరాష్ట్ర రాజధాని: రాద్ధాంతసిద్ధాంతాలు ★

చెన్నపట్నంలో కూపంవది ఉత్తరాన రాష్ట్ర విభజన తర్జనభర్జనలు, నదికి దక్షిణాన గాన సభల ముమ్మరం, కాంగ్రెస్ తిరకాలు. దేశంలో తుపాను తుడిచిపెట్టి పోగా మిగిలిన ధాన్య పు గింజలు నొల్లుకోవడం, కోట్లరూపాయిల ఆస్తి నష్టాలకి, వేలల్లో శిస్తు రిమిషన్ల తగువులాటలు. క్రైస్తవుల ఇళ్ళలో క్రిస్టమస్ చెట్లు, పిల్లలకు బహుమతులు పంచే తాతలు. అరవదేశంలో పుట్టి తెలుగున కీర్తనలు కట్టి కర్ణాటసంగీతసంప్రదాయానికి జీవంపోసిన నాదవిదులు శ్రీ త్యాగయ్య పట్ల భక్తిపూర్వకంగా గోదావరి మొదలు కన్యాకుమారిఅగ్రంవరకూ త్యాగరాజసంగీత సప్తాహాలు. ఇవీ ఈవారం విశేషాలు. పంటలు, ఉత్సవాల ముమ్మరంలో ప్రజలకి తీరుబడి తక్కువ.

చెన్నపట్నంలో రాష్ట్రనిర్మాణ కతంగంలో ఊపిరితిరక్కుండా ఉన్నా తమిళ నాయకులు ఉత్సవాల్లో అధికశ్రద్ధ వహిస్తున్నారు. ఆంధ్రరాష్ట్రరాజధానినిర్ణయసమస్య అకస్మాత్తుగా పరిపక్వానికొచ్చి కూచున్నందువల్ల తెలుగునాయకులికి నిజంగానే ఊపిరి తిరగడంలేదు.

ఆంధ్రరాష్ట్రవిభజనసంఘం 21 వ తేదీ బుధవారంనాడు తిరిగి సమావేశాలారంభించింది. ఆంధ్రరాష్ట్ర ఆర్థికస్థితినిగురించీ, ఆస్తి అప్పులు నగదుల పంపకాలనుగురించీ, ప్రభుత్వోద్యోగుల పంపకంగురించీ నివేదికల్ని సబ్ కమిటీలు తయారుచేసి సిద్ధంగా ఉంచాయి. వీనినీ, కేంద్రప్రభుత్వహోంశాఖా కార్యాలయంనుంచి వచ్చిన లేఖల్లోని అంశాలను చర్చిస్తున్నారు.

ఆర్థికస్థితిసందర్భంలో సబ్ కమిటీ అంచనాలప్రకారం సాలుకి కోటీ ఎనభై లక్షల రూపాయలకంటె లోటుండదు. ఇది కూడా పోయి మిగులుండే అవకాశంకూడా ఉంది. ఇంక కేంద్రప్రభుత్వం ఈవిషయమై సందేహించవలసిన అగత్యం ఉండదు. ఈనాడు భారతదేశంలో కొరతలేని రాష్ట్రమే లేదు. అన్ని రాష్ట్రాలకంటె ఆంధ్రరాష్ట్రమే మేలుగా ఉండవచ్చును.

ఈ వివరాల్ని విభజనసంఘం పూర్తిగా ఆమోదించింది. ఆస్తి, అప్పులు, నగదుల పంపకం విషయమై స్థూలంగా కొన్ని నియమాల్ని సబ్ కమిటీ సూచించి ఆప్రకారం లెక్కలు తయారుచేసింది. జనాభానిష్పత్తిని బట్టి మొత్తంలో నూరింట 38 వంతులు ఆంధ్ర రాష్ట్రానికీ, మిగతా మిగులురాష్ట్రానికీ, పంపకంపెట్టడానికి విభజనసంఘం ఆమోదించింది. దీనిప్రకారం మొత్తంరాష్ట్రంలో రాష్ట్రప్రభుత్వానికి చెందిన ఆస్తులవిలువ రు 45 కోట్లలో (రెవిన్యూ రిజర్వునిధితో సహా) ఆంధ్రరాష్ట్రానికి పదమూడు పదిహేనుకోట్ల రూపాయిలకిమధ్య రావచ్చును. మొత్తం ఋణాలు 31 కోట్లలో పదికోట్ల ఋణం ఆంధ్రరాష్ట్రంపైన పడవచ్చును. ఈసూచనలపైన. కూడా విభజనసంఘంలో ఎట్టి అభిప్రాయభేదాలూ రావడంలేదు. ఏవిధంగా నిర్ణయం చేసినా తెలుగుసభ్యులు అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారు కాబట్టి, అరవసభ్యులీవిషయమై అంతగా అంతరాయాలు కలిగించడంలేదు కాబట్టి, సులువుగా నిర్ధారణ జరిగిపోవచ్చును.

చెన్నపట్నంలో భవనాలు, ఆస్తులకు కూడా విలువకట్టి, అందులో నూరింట దాదాపు 40 వంతులు ఆంధ్రరాష్ట్రానికి పరిహారంగా ఇవ్వగలరని విభజనసంఘంలోని అరవసభ్యులు చెప్తున్నారు. అందుకుకూడా సబ్ కమిటీ లెక్కలు తయారుచేసి సిద్ధంగా ఉంచింది. అయితే ఈవిషయమై తెలుగుసభ్యులు ఇంకా ఒక అభిప్రాయానికి రాలేదు. తెలుగుసభ్యుల్లో ఒక వర్గం పరిహారంతీసుకోవడం మంచిదంటున్నారు. చెన్నపట్నంపైన ఆంధ్రు లెలాగూ హక్కు విడిచిపెట్టారుకాబట్టి, నగరం కాని నగరంలో ఏప్రాంతంకాని ఆంధ్రరాష్ట్రంలో చేరబోదుకాబట్టి, పరిహారం తీసుకోడానికిప్పుడంగీకరిస్తేనే మంచిదని వారి అభిప్రాయం. ఇప్పుడు నిరాకరిస్తే ముమ్ముందు చెన్నపట్నం గురించి ఎటువంటి నిర్ణయం జరిగినా (అనగా తమిళరాష్ట్రంలో చేర్చబడినా లేక కేంద్ర ప్రభుత్వం అధీనం చేసికున్నా లేక ప్రత్యేక రాష్ట్రంగా నిర్మించబడినా) అప్పుడు పరిహారం లభించడం సందేహమని వీరి వాదం. కాని ఒక తెలుగుసభ్యుని అభిప్రాయం భిన్నంగా ఉంది. ఆంధ్రరాష్ట్రం సరిహద్దులగురించి తుదినిర్ణయం ముమ్ముందు ఒక సరిహద్దునిర్ణాయకసంఘంవల్ల జరిగేటప్పుడే చెన్నపట్నంగురించి నిర్ణయం కావాలనీ, అప్పుడు తెలుగువారు తమ హక్కుల్ని గురించి వాదించుకోడానికి హక్కు వొదులుకోలేదనీ, ప్రస్తుతానికి మాత్రమే చెన్నపట్నాన్ని ఆంధ్రరాష్ట్రంలో చేర్చ నక్కరలేదని అంగీకరించిన మాత్రాన ఆ హక్కుపోదనీ, ఇప్పుడు పరిహారం తీసుకోడానికంగీకరిస్తే ఆహక్కుపోతుందనీ వారి అభిప్రాయం. ఇటువంటి హక్కు ఇంకా ఆంధ్రుల కున్నందువల్లనే, ఈహక్కును పోగొట్టడానికే అరవలు పరిహారమిస్తామంటున్నారు. అంతేకాక ఇంకేమైనా తెలుగువారి ఆందోళనకి బలం మిగులుతుందనే భయంతో ఆంధ్రరాష్ట్రప్రభుత్వకార్యాలయం రాష్ట్రవిభజన జరిగిననాటినుంచే చెన్నపట్నంలో ఉండకుండా లేచిపోవాలని అరవసభ్యులు వాదిస్తున్నారు. తెలుగుసభ్యుల్లో పైన సూచించిన అభిప్రాయభేదాలింకా పరిష్కారం కాలేదు.

సరిహద్దునిర్ణాయకసంఘంసందర్భంలో విభజనసంఘం చేసిన నిర్ణయం పట్టాభి - పటేల్ - నెహ్రూ కమిటీ నివేదికకూ, కేంద్రకాంగ్రెస్ కార్యవర్గతీర్మానానికీ అనుకూలంగా ఉంది. ఆంధ్రరాష్ట్రసరిహద్దుల్ని నిర్ణయించడానికిగాను, జస్టిస్ అగర్వాలాగారిని నియమించదలచినట్లు కేంద్రప్రభుత్వహోంశాఖా కార్యదర్శి సూచించి ఇది విభజనసంఘానికీ, మద్రాసు ప్రభుత్వానికీ అంగీకారమేనా అని ప్రశ్నించారు. విభజనసంఘం ఈవిషయాన్ని పట్టాభి - పటేల్ - నెహ్రూ కమిటీనివేదికదృష్ట్యా పరిశీలించి, నిర్వివాదంగా తెలుగువారివైన ప్రాంతాల్నిమాత్రమే చేర్చి ఇప్పుడాంధ్ర రాష్ట్రాన్ని నిర్మించడానికి సర్వపక్షాలవారూ అంగీకరించి ఉన్నందువల్ల, ఇప్పుడు సరిహద్దు నిర్ణాయక సంఘాన్ని కాని, జస్టిస్ అగర్వాలాగారిని కాని నియమించ నవసరంలేదని తీర్మానించింది.

విభజనసంఘం నిర్ధారణకువచ్చిన రెండు విషయాల్నీ, అనగా ఆంధ్రరాష్ట్రఆర్థిక స్వయంపోషకస్థితినీ, సరిహద్దుల నిర్ణయాని కిప్పుడు ఎవరినీ నియమించ నవసరంలేదనీ చేసిన తీర్మానాల్ని మద్రాసుమంత్రివర్గం చర్చించి, ఆమోదించింది. ఈ ఆమోదించబడిన తీర్మానాల్ని కేంద్రప్రభుత్వ ఆంతరంగికశాఖకు తెలియపరిచారు.

పోగా ఇంక విభజనసంఘం చర్చిస్తున్న విషయాలు, ఆస్తి, అప్పుల పంపకం, ఆంధ్రరాష్ట్ర రాజధాని. ఇవైనతరవాత చర్చించవలసిన విషయాలు బళ్లారిజిల్లాలోని ఆరు కన్నడ తాలూకాల భవితవ్యం, ప్రభుత్వోద్యోగుల పంపకం.

వీనిలో ప్రభుత్వోద్యోగుల పంపకం విషయమై పెద్దసమస్యేమీ లేదు. ఉన్నఉద్యోగుల్లో తెలుగువారు నూరింట పదిపదిహేనమందికంటె లేరు. ఏశాఖలో ఎంతమంది ఏప్రాంతాలవారున్నారో లెక్కలన్నిటినీ వివరంగా సబ్ కమిటీ తయారుచేసింది. సబ్ కమిటీపని పూర్తికావచ్చింది. త్వరలో వీరి వివరాల్నికూడా విభజనసంఘానికి సమర్పిస్తారు. బళ్లారిజిల్లాలోని కన్నడతాలూకాలవిషయమై ప్రజల అభిప్రాయం ఉద్యోగుల అభిప్రాయం తెలుసుకోడానికిగాను ఇద్దరు మంత్రులు భక్తవత్సలం, గోపాలరెడ్డిగార్లు త్వరలో బళ్లారిజిల్లా వెళ్లనున్నారు. వారు బళ్లారినుంచి తిరిగివచ్చినఅనంతరం ఈ విషయాన్ని విభజనసంఘం చర్చిస్తుంది. ఈలోగా బళ్లారిపట్టణమునిసిపల్ కౌన్సిల్ జిల్లాసంతటినీ ఆంధ్రరాష్ట్రంలోనే చేర్చాలని మద్రాసుప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం చేసింది. బళ్లారిజిల్లా ఆంధ్రకాంగ్రెస్ కూడా ఇదేరీతిగా తీర్మానించింది. కన్నడులలో కొందరు ఆంధ్రరాష్ట్రంలో చేరడానికి అభ్యంతరం చెప్తున్నారు. చేరకపోతే కన్నడిగలకే నష్టం కాని ఆంధ్రరాష్ట్రానికి కలాటి నష్టమూ లేదు. జిల్లాపరిపాలనకు ఇబ్బందులుకూడాకలుగుతాయి. ఈసాకుపెట్టి ఆంధ్రరాష్ట్రనిర్మాణాన్ని వాయిదా వేయించవలిచే వారి యత్నాలు విఫలం కాకతప్పదు.

ఆంధ్రరాష్ట్ర రాజధాని

ఆంధ్రు లిప్పుడే ఆంధ్రదేశంలో ఒక పట్టణాన్ని రాజధానిగా నిర్ణయించుకోవాలనీ, ఆంధ్ర రాష్ట్రం నిర్మాణం కాగానే రాష్ట్రప్రభుత్వం ఆ రాజధానికి తర్లిపోవాలనీ తమిళసభ్యులు పట్టుబట్టుతున్నారు. చెన్నపట్నంభవిష్యత్తును గురించి ఆంధ్రులు ప్రత్యక్షంలో ఒకమాట, పరోక్షంలో ఒకమాట మాట్లాడుతున్నందువలన ఈ రీతిగా తమిళులు పట్టుదల వహించవలసివచ్చిందని ఒక తమిళసభ్యు డన్నాడు. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వకార్యాలయానికి తగిన భవనాలు ఇప్పుడే తెలుగుపట్నంలోనూ లేవని వాదిస్తే, ఇప్పుడు లేనప్పుడు నాలుగు మాసాల్లో కాని సంవత్సరంలోగాని నిర్మించుకోడానికి ఎలాగూ సాధ్యపడదు కాబట్టి, అప్పుడు తర్లిపోయేబదులు ఇప్పుడు తర్లిపోయినా ఫరవాలేదని వారన్నారు.

కాని రాజధానిగురించి తేలేవరకూ విభజన సంఘం చర్చించవలసిన ఇతర విషయాల్ని జాప్యంచెయ్య యత్నించడం దుర్నీతి. ఈ చర్చల్లో జాప్యమయితే నష్టం కలిగేది ఆంధ్రులకే. రాష్ట్రనిర్మాణం వాయిదాపడిపోగలదు. ఈ అవకాశం తీసుకుని ఈ రీతిగా తెలుగుసభ్యులపైన ఒత్తిడి తేవడం అక్రమం. సర్వవిషయాల్నీ విభజనసంఘం చర్చించాలనీ, అంగీకారం కుదరని విషయాల్ని కేంద్రప్రభుత్వ పరిష్కారానికి విడిచిపెట్టాలనీ భారతప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం సమాధానం కుదరని ఆంధ్రరాష్ట్రరాజధాని సమస్యని కేంద్రప్రభుత్వ పరిష్కారానికి విడిచిపెట్టి మిగతా విషయాల్ని చర్చించి నిర్ణయాలు చెయ్యవలసిన బాధ్యత విభజనసంఘంపైన ఉంది. కాని రాజధానిగురించి తమ కనుకూలమైనట్లు ఆంధ్రులు అంగీకరించకపోతే ఇతర విషయాల్ని చర్చించడానికి నిరాకరించడం తమిళనాయకుల అవినీతికి నిదర్శనం. ఇటువంటి నిదర్శనాలకు కూడా కేంద్రనాయకులు కళ్ళు తెరవకపోవడం ఆంధ్రదేశానికి దురదృష్టం. దీనివల్ల కేంద్ర నాయకుల పట్ల ఆంధ్రదేశానికి విశ్వాసగౌరవాలు నశించగలవు. కమ్యూనిస్టుల ముప్పుకంటే ఇది పెద్ద ముప్పని కేంద్రనాయకులు గ్రహించడంలేదు.

"మీ రాజధానిగురించి మీరు నిర్ణయించుకున్న మర్నాడు మీకు రాష్ట్రం వస్తుంది. లేదా మీకు రాష్ట్రమే రాదు" అని తమిళకాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజనాడార్ అంటున్నాడు. "రాష్ట్రనిర్మాణానంతరం మీగవర్నరు, మీ మంత్రివర్గం, మీశాసనసభ ప్రభుత్వాదర్శప్రమాణం తీసుకోడానికి కూడా చెన్నపట్నంలో ఉండడానికి వీల్లేదు. మీదేశంలోనే ఏదో ఒక పట్నంలో మీ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రారంభించుకోవలసిందే" అని మంత్రి భక్తవత్సలంగారంటున్నారు. ఇటువంటి దుర్నీతిపరులతో సమాధానం చేసుకుని మీరాష్ట్రం తెచ్చుకోవలసిందని కేంద్రప్రభుత్వం అంటోంది. మనకి ఆంధ్రరాష్ట్రనిర్మాణం తమిళులచేతి భిక్షాదానం స్వీకరించడ మౌతోంది. పదవులకోసం పాకులాడుతూ ఇటువంటివారితో "సమాధానం" చేసుకోవాలని మొదటినుంచీ మన నాయకులు ప్రచ్ఛన్నప్రయత్నాలు చేసినదానికిదే ఫలితం. ఈసమాధానాని కర్థం దానభిక్ష అని చెప్పడంటే మంచిది. రాజధానివేరుసిద్ధాంతరాద్ధాంతారంభమైనాయి. ఈ సందర్భంలో తెలుగు నాయకుల్లో పదవుల ఆశలూ, ప్రాంతీయాభిమానాలూ ప్రబలంగా ఉన్నాయి కాని దేశక్షేమం, జాతీయావసరాలూ, దేశగౌరవం ప్రధానంగా పరిగణిస్తున్నట్లు కనిపించదు. శ్రీబాగ్ పాక్ట ప్రకారం మొదటి నిర్ణయం తమదేననీ, రాజధాని రాయలసీమలోనే ఉండాలనీ రాయలసీమ వాసులంటున్నారు. కొందరు అనంతపురం రాజధాని కావాలంటున్నారు. కొందరు ఏడుకొండలవెంకటేశ్వరుడి పాదసన్నిధిని ఆంధ్రరాష్ట్రగవర్నరు, మంత్రులు ప్రమాణం స్వీకరించా లంటున్నారు. వీరికి పదవులకోసం మొక్కుబళ్లు, ముడుపులూ ప్రధానం దేశక్షేమం, ప్రజాహితం ద్వితీయం.

హైదరాబాద్ సంస్థానం నేడు కాకపోతే రేపైనా భాషామండలాలుగా విభజన కాక తప్పదు. గవర్నర్ జనరల్ హోదాలో ఉన్న రాజగోపాలాచారిగారు కాని, రజాకార్ దళాలు ప్రజల్ని అమానుషంగా పీడిస్తుంటే హర్షిస్తూ ఊరుకున్న నిజాం నవాబు కాని చిరకాలం కుళ్లి కుతమారుతున్న "సంస్థాననిశిష్టత"ను కాపాడలేరు. హైదరాబాద్ భాషామండలాలుగా విభజించబడినప్పుడు, తెలంగాణా ఆంధ్ర రాష్ట్రంలో చేరి విశాలాంధ్రరాష్ట్రం ఏర్పడగలదు. అప్పుడు ఆంధ్రరాష్ట్రానికి హైదరాబాద్ నగరమే రాజధాని కావడం తథ్యం. ఇది రాయలసీమవాసులికీ, సర్కారు జిల్లాలవారికీ తెలంగాణావారికీకూడా సమ్మతమైనదే. అది జరిగేలోగా, ఆంధ్రరాష్ట్రానికి రాజధానిగా మూన్నాళ్లముచ్చటగా ఊరేగడానికే ఈ తాపత్రయమంతా. ఈ మూన్నాళ్ల ముచ్చటకోసం కూడా సర్వప్రాంతాలవారికీ అనుకూలమైన పట్టణం చూడాలనే ధోరణి నాయకుల్లో కనిపించడంలేదు. దేశక్షేమం, శాంతిభద్రతలు, కమ్యూనిస్టుల ముప్పునివారణ ప్రధానమని భారత ప్రభుత్వం ఎంచుకుంది. ఈదృష్టితో చూసినా, దేశానికి కేంద్రంగా ఉండి నలుమూలలకీ రైల్వే రవానాసౌకర్యాలివ్వగలిగిన విజయవాడ మన నాయకులికి కనిపించడంలేదు. ఓడరేవున్న విశాఖపట్నానికి అందుబాటులో ఉన్నది విజయవాడ. వాణిజ్యంలో ఆంధ్రదేశంలో కెల్ల విజయవాడ ప్రధానమైన నగరం. ఏదృష్టితో చూసినా హైదరాబాద్ తరవాత విజయవాడే ఆంధ్రదేశానికి రాజధానికాగలిగినపట్నం. విజయవాడ కేంద్రంగా 20 మైళ్ళలోఉన్న గుంటూరు, తెనాలి, గుడివాడ పట్నాల్లో ప్రభుత్వశాఖల్ని ఉంచితే గృహవసతిలోపం కార్యాలయాలకీ, ప్రభుత్వోద్యోగులికీ ఉండదు.

కాని ఇది మన నాయకులికి కనిపించడం లేదు. దీనికి కారణం రాయలసీమవారి అసంగతవాదమే. తమిళనాయకులవలెనే రాయలసీమనాయకులుకూడా అవకాశం చిక్కినంత మాత్రంచేత స్వలాభదృష్టితో తమకే రాజధాని ఉండాలని వాదించడం అనుచితం.

ఆంధ్రరాష్ట్రరాజధాని రాయలసీమలో ఉంటేనే రాయలసీమఆర్థికాభివృద్ధికి వీలవుతుందని వీరు భావిస్తే అది పొరపాటు. అందరిని చిక్కుపెట్టి రాజధాని తెచ్చుకుంటే ఇతరుల అసంతృప్తి ఊరికే పోదు. వారి ఆర్థికాభివృద్ధికే ఆటంకం కలుగుతుంది. అదికాక రవానా సౌకర్యాలు కాని ఆహారం కాని చాలినంతగా లేని అనంతపురంలోనో, తిరుపతిలోనో రాజధాని స్థాపిస్తే, అక్కడ పెట్టవలసిన ఖర్చులు తప్పకుండా రాయసీలమ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కాగలవు. కేవలం ప్రాంతీయాభిమానమే ప్రధా

(20 వ పేజీ చూడుడు)

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧౧

విజయదశమి వచ్చినది.

నవరాత్రోత్సవములు ముగిసినవి. శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల సమక్షమున వారి శిష్యులొక డా కార్యకలాప మంతయు దేవేంద్రవైభవముతో నిర్విఘ్నముగా జరిపించెను. దీక్షాంగోపవాసములచే రుద్రమదేవి ఇంచుక కృశించినను ఒక యపూర్వ తేజస్సుతో నలరారుచుండెను.

గణపతిదేవులకుగూడ నొక్కసారిగా ఆరోగ్యము వచ్చినట్లే కనబడెను. బహుకాలముగా మనస్సును బాధించుచున్న హృదయశల్యము ఉద్ధృత మగుటచే వృద్ధచక్రవర్తికి ముఖములో నూతనవికాస ముదయించెను. క్షీణించిన యాయన శరీరమున గూడ క్రొత్తశక్తి యంకురించెను. కూర్చుండు నోపిక వచ్చినది.

ఈనాడు జరుగనున్న యౌవరాజ్యపట్టాభిషేకమునకు కూడిన జనములతో ఓరుగల్లు నిండిపోయెను. సమస్తమండలములనుండియు మహామండలేశ్వరులు, మండలేశ్వరులు, సామంతులు, మంత్రులు, దండనాథులు సపరివారముగా వచ్చుటకై విచ్చేసిరి. చుట్టుపట్టుల నున్న పరిసరగ్రామములనుండియే గాక దూరస్థజనపదములనుండి కూడ ఆ మహోత్సవము తిలకింప జనులు తండోపతండములు గావచ్చిరి.

ఆ యుత్సవమునకై స్థపతులు విశాలోన్నత మగు నొక మనోజ్ఞమండపము సహస్రస్తంభవిరాజితముగా నిర్మించిరి. ఏకశిలానగరమున సహస్రాధికముగా గల చిత్రకారులు అందరును వివిధవర్ణములతోడను చిత్రములతోడను స్తంభములను అధోర్ధ్వభాగములను అలంకరించిరి. అందు ఎల్లరు జూచ నగునను ప్రదేశమున నున్నత మగు నభిషేకవేది యొందు కల్పించిరి.

అంతకుమున్న వేగురుల బంపి చతుస్సముద్రములనుండియు గంగాకృష్ణాగోదావరి తుంగభద్రాది పవిత్రనదులనుండియు సువర్ణకలశములలో జలములు తెప్పించి యుంచిరి. అవి వేరువేరుగా నలంకరించిన వేదికలపై నుంచిరి.

అభిషేకోత్సవము ప్రాతఃకాలముననె మంగళతూర్యపురస్సరముగా జయజయ ఘోషలు మిన్నుముట్టుచుండ ప్రారంభమయ్యెను.

అభిషేకవేదిపై సమున్నతాసనమున శ్రీవిశ్వేశ్వరశంభుదేశికు లాసీను లైరి. వారి సమీపముననే ఉన్నతాసనమున గణపతిదేవులును మరియొక భద్రాసనమున రుద్రమదేవియు నుపవిష్టు లైరి. ఆ వేదిసమీపముననే ఉత్తమబహువేదవిప్రులు అపరాగ్నిహోత్రులవలె సమావిష్టులై యుండిరి.

ముందుగా నా విప్రుల యనుజ్ఞ నొంది శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు శ్రీ మహాగణాధిపతిపూజయు స్వస్తిపుణ్యాహవాచనమును మంటపారాధనమును గావించిరి. సువర్ణకలశములలో సముద్రోదకములను గంగాదినదీతోయములను ఉంచి నవరత్నములు మంత్రపూర్వకముగా నందు నిక్షేపించి అభిషేకోచితమూలికాద్రిద్రవ్యము లంచి సామ్రాజ్యాధిదేవతాహ్వాన మొనర్చి పూజాదికము నిర్వర్తించెను.

రాజపురోహితు లంతకుమున్న పూజాసంస్కారములు చేసిన వరాహాలాంఛిత సువర్ణరత్నపట్ట మొకటి శ్రీగణపతిదేవచక్రవర్తులు స్వహస్తములతో శ్రీరుద్రమదేవిఫాలమున గట్టి యక్షత లామెశిరస్సున నుంచెను. ఆమెశిరస్సుపై సువర్ణచ్ఛత్ర మెత్తబడెను. వేదవిప్రులు స్వస్తివాచన మారంభించిరి. అభిషేకోదకము ఏడు కలశములలో వేర్వేరుగా నుంచబడెను.

అందు ప్రథమకలశము రాజగురువులయొద్దను రెండవది శ్రీగణపతిదేవులయొద్దను ఉంచిరి. మూడవదానియొద్దకు ఇందులూరి అన్నమంత్రిని అప్పటి కందుకొనిన కొలని రుద్రుని రమ్మని యాహ్వానించిరి. నాలవదానియొద్దకు వీరభల్లటదేశికుల బిలిచిరి. మరియొకదానియొద్ద వీరభద్రేశ్వరుని మహాదేవరాజును బాలప్రతాపరుద్రుని నిలిపిరి. ఇం కొక కలశపార్శ్వమున మేచయనాయకుని శ్రీమజ్జ గోవిందనాయకుని బయ్యనన్నాయకుని జన్నిగదేవుని గన్నారెడ్డిని నాగదేవుని ఉండ నియమించిరి. చివరదాని యొద్ద నిలువ పౌరజానపదులలో పెద్దలను శ్రేణీపతులను బిలిచిరి.

అట్లు ఆహూతులైనవారి కెల్లరకును చక్రవర్తి రత్నాంబరాభరణాదులు ముందు కట్టబెట్టించెను.

అంతట రాజగురువుల యనుమతితో వేదవిప్రులు 'సామ్రాజ్యమంత్రప'ఠనము నారంభించిరి. పూర్వనియమితు లందరు తమఎదుట నుంచిన సువర్ణకలశములనుండి పచ్చని యాకులతో శ్రీరుద్రమదేవి నభిషేకించిరి.

ఈ యభిషేకకలాపము రెండుగడియలసేపు సాగెను. శిరస్సునుండి ప్రవించుచున్న యా పవిత్రవారిధారలతో రుద్రమదేవి గంగాధరు డగు రుద్రునివలెనే భాసించెను. ఆ మండపమున గూడిన మహాజనము లానందముతో జయజయనినాదములు చేయుచుండెను. ఎవరి నిర్ణీతస్థానములలో వారు కదలక కూర్చుండి వేరు ప్రసంగములు మాని యా మహోత్సవమునే తిలకించుచుండిరి.

యౌవరాజ్యపట్టాభిషేకానంతరమున కులపెద్ద లందరకు సువర్ణాక్షతలు పంచిపెట్టిరి. పరంపరాగతముగా నిర్ణీతమై వచ్చుచున్న యాచారక్రమమున వరుసతప్పక వా రొక్కరొక్కరె శ్రీరుద్రమదేవిని సమీపించిరి. ఎవరి యధికారప్రకారము వా రామెశిరస్సునను పాదములను ఆ యక్షత లుంచిరి. అట్లు వచ్చినవారి కెల్ల గణపతిదేవులు సువర్ణరత్నాంబరాభరణాదులు విరివిగా కట్టబెట్టించుచుండెను. ఈ ఉత్సవము మధ్యాహ్నసమయమువరకు పట్టెను.

అప్పుడు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు ఏదో సెలవీయనున్నా రని సువర్ణదండములు ధరించిన చోపుదారులు కేకలు వేసిరి. ఆ మహాసభ యంతయు క్షణముననె నిశ్శబ్ద మయ్యెను.

"మీ యందర సమక్షమునను శ్రీగణపతిదేవచక్రవర్తులయు ఇందు కూడిన సమస్తమంత్రిసామంతమండలేశ్వరదండనాథపౌరజానపదుల యనుమతితో శ్రీరుద్రమదేవులకు యౌవరాజ్యపట్టాభిషేకము జయప్రదముగా తీర్చినాము. ఈ పవిత్రదీక్షాసమయమున రాజగురువులు నామకరణము చేయు నాచారము మీ కెరుగనిది కాదు. ఏతత్క్షణమునుండి ఈయువరాజులు శ్రీ రుద్రదేవమహారాజనామము ధరింతురు గాక! ఇతఃపరం శ్రీ రుద్రదేవమహారాజనామ్నా వర్ధస్వ!" యనుచు రాజగురువులు స్వహస్తముగా నా మెశిరస్సుపై సువర్ణరత్నాక్షత లుంచిరి.

వెంటనే జయజయ శ్రీరుద్రదేవమహారాజ! అను జయఘోషలు మండపమంతట నెలంగెను.

ఆసమయమున ప్రక్కన వంతఃపురజనము కూరుచున్న యవనికచాటుననుండి మంజుల మగు నొక కలకలము ప్రారంభించెను. అందుండి పలువురు బాలురు బాలికలు చిత్రవిచిత్రోజ్జ్వలవేషములు ధరించి రంగురంగుల పతాకలు గల గడలు పట్టుకొని శ్రీరుద్రమహారాజా నెదుట ప్రత్యక్షమై—

"జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!" అనుచు జయవాద మొనర్చిరి. శ్రావ్యములగు కంఠములతో నిరువురు బాలకులు ముందు చెప్పుచుండగా మిగిలినవారు వారివెంట నిట్లు పఠించిరి.

> ధర సింహాసనమై, నభంబు గొడుగై, తద్దేవతల్ భృత్యులై,
> పరమామ్నాయము లెల్ల వందిగణమై, బ్రహ్మాండ మాకారమై,
> సిరి భార్యామణియై, విరించి కొడుకై, శ్రీగంగ సత్పుత్రియై,
> వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై శరిల్లు నారాయణా!
> జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!

శ్రీ వారికరుణాకటాక్షవీక్షణాలంకారా! అరిజనకుముదచంద్రోదయా! ఆశ్రితవిద్వజ్జనాధారా! సత్యభాషాహరిశ్చంద్రా! సంగీతవిద్యానారదా! సాహిత్యవిద్యాచతుర్ముఖా! దానరాధేయా! సంగ్రామధనంజయా! ఒయ్యారికోలాహలా! కదనవిజయమార్తాండా! కలియుగరామా! కలియుగభీమా! మనుజమంధాతా!

> జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!
> శ్రీగణాధీశాయ శివకుమారాయ
> నాగముఖతుండాయ నాగభూషాయ
> లోకజనవంద్యాయ లోలనేత్రాయ
> శ్రీకంఠతనయాయ సృష్టికర్త్రాయ – మంగళమ్!
> బాగుగా విద్యలకు ప్రౌఢిగా దేవ
> నీ గరిమ జగములను నిలిపితివి ధళిర!
> కనకాద్రిధీరాయ గణనాయకాయ.– మంగళమ్!
> గణుతింతు మి మ్మెపుడు గణనాథదేవ!
> జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!
> సరస్వతి మతి మాకు చాలగా నిమ్మ
> పరమభక్తుల నెల్ల పాలించవమ్మ
> వల్లకీమృదుపాణి, వరనీలవేణి,
> పల్లవారుణపాణి, పరమకల్యాణి,
> సమ్మతిగ మము బ్రోవు సద్గుణకదంబ
> మమ్మ ధన్యుల జేయుమా శారదాంబ!
> జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!

ఆ యంధ్రబాలబాలికలు గావించిన విజయదశమీవిజయాశీర్వాదముతో సభ యంతయు నానందతన్మయ మయ్యెను. గణపతిదేవుల కానందబాష్పములే వచ్చెను. శ్రీరుద్రదేవమహారాజు దానిని తలయొగ్గి స్వీకరించెను. రాజాజ్ఞతో వా రందరికి నమూల్యము లగు బహుమానములు పంచిపెట్టబడెను.

అంతట దండికర్రలు ధరించిన చోపుదారు లిట్లు ప్రకటించిరి.

"మీ రందరును మిక్కిలి బడలి యున్నారు. శ్రీగణపతిదేవచక్రవర్తులవారు మీకై యేర్పరచి యుంచిన భోజనశాలలలో సుఖభోజనములు చేసి వారి నానందింపచేయ నాహ్వానించుచున్నారు. ఈ మండపముననే మూడుజాములవేళ పేరోలగము తీరియుందురు. మీ రందరును రావలసినది!"

అది యాలకించి చేరిన జనములు విచ్చిపోయి భోజనశాలలకు చేరిరి. అచ్చట వేలసంఖ్యలుగా సేవకులు వారి మజ్జనభోజనాదులకు సదుపాయములు చేసియుంచిరి. అవసరము లగున వన్నియు ఎవరి కులకక్ష్యాచారములకు అనువుగా సిద్ధపరచియున్నవి. వా రంద రందు పంచభక్ష్యపరమాన్నములతో ప్రద్రసోపేతముగ భుజించి తాంబూలములు సేవించి యించుక విశ్రమించి పేరోలగము దర్శింప సభామండపమునకు చేరికొనసాగిరి.

(19 వ పేజీ చూడుడు)

తెలంగాణంలో కమ్యూనిస్టు సమస్య

భారతసేనలు హైదరాబాదుసంస్థానంపై పోలీసుచర్య సాగించి, సంవత్సరం దాటి పోయినప్పటికీ, కమ్యూనిస్టుసమస్య, తెలంగాణ మండలి కొన్ని ప్రధానమైన ప్రాంతాలలో, ప్రభుత్వానికీ, ప్రజలకు, నేటికీ చికాకు కలిగిస్తూనే వుంది. ఇటీవల ఈసమస్య ఇంకా తీవ్ర స్వరూపం దాలుస్తున్న సూచనలు కానవస్తున్నవి. పైగా కమ్యూనిస్టుల ఈకల్లోలాలు, ఇప్పట్లో అణగిపోతాయన్న విశ్వాసం కూడా ప్రజల్లో సన్నగిల్లిపోతూవుంది.

దూరంగావుండేవాళ్లకు ఈసమస్యయొక్క తీవ్రత అంతగా కనుపించకపోవచ్చు. కమ్యూనిస్టుల కిరాతకకృత్యాలవల్ల ఈ ప్రాంతాలందు ప్రజల దైనందినజీవితంలో ఎంతటి ఘోరపరిణామాలు సంభవించినవో అర్థం కాకపోవచ్చు. అయితే స్థానికంగా కనుపిస్తూవున్న ఈసమస్య వెనక ఒక బ్రహ్మాండమైన కుట్రవున్నదనిమాత్రం అర్థంచేసుకోవాలి. ఈ కుట్రయొక్క సంబంధాలు ఇండియావరకేగాక, ఆసియా దేశాలన్నింటితోను వున్నదన్న యథార్థాన్ని మనం త్రోసిపుచ్చడానికి వీల్లేదు.

ఒకవంక అస్సాంపరిసరాలనుండి, మరొకవంక, సుదీర్ఘమైన హిమాలయపర్వతసంకులనుండి, ఇండియాకు సంభవించనున్న కమ్యూనిస్టు ప్రమాదాలనుగురించి లెక్కించుకుంటున్న ఈ తరుణంలో తెలంగాణంలోవున్న కమ్యూనిస్టు సమస్యయొక్క నిజస్వరూపాన్ని అర్థంచేసుకుని, దాన్ని ఎదుర్కోవడానికి సక్రమమైన మార్గాల్ని అవలంబించవలసిన అవసరం ఎంతైనా వుంది.

హైదరాబాదులో కమ్యూనిస్టులు

భారతదేశంలోని ఇతరప్రాంతాలకన్న తెలంగాణమండలి కమ్యూనిస్టుల బలానికి ఒక ప్రత్యేకత వుంది. సంస్థానంలో జమీందారీ, జాగీర్దారీ విధానాలు, నిజాం ప్రభుత్వం యొక్క నిరంకుశపరిపాలన, మొదలగునవిమాత్రమే, ఇక్కడ కమ్యూనిస్టులు ప్రబలడానికి కారణం అని భావించరాదు. మొదటినుండీ ఇక్కడి కాంగ్రెస్ నాయకత్వం సమర్థనీయమైనది కాకపోవడంకూడా, కమ్యూనిస్టుల ప్రభావానికి నికరమైన ఆస్కారాన్ని కల్పించింది. ఆ రోజుల్లో కాంగ్రెస్ ఆశయాలతో స్వాతంత్ర్యపోరాటానికై గట్టిగా ముందుకువచ్చిన చాలామంది యువకులు, సంస్థానంలోని మితవాదనాయకత్వాన్ని అనుసరించడం ఇష్టంలేక, అప్పటికి శరణ్యంగా తోచిన కమ్యూనిస్టుపార్టీలో చేరిపోయారు. యథార్థం చెప్పాలంటే, కమ్యూనిస్టులు తెలంగాణంలో నేటి తమ హింసాపూరితమైన కార్యక్రమాల్ని అవలంబించకుండా, కనీసంగానైనా జాతీయాభిమానాన్ని కలిగివుండివుంటే, బహుశః, నేటి హైదరాబాదులో సంస్థానకాంగ్రెస్‌కు బదులు కమ్యూనిస్టుపార్టీయే ప్రజాప్రాతినిధ్యం గల సంస్థగా పరిగణింపబడుతుండేది. అయితే ఇండియాలో కమ్యూనిస్టులకు స్థానం లేకపోవడమే తథ్యమైనప్పుడు, మరోవిధంగా ఎందుకు జరుగుతుంది?

ఇటీవలి హైదరాబాదు ప్రజాపోరాటం సాగిన 1947 ఆగస్టుకు ముందే, కమ్యూనిస్టులు నల్లగొండజిల్లాలోని సూర్యాపేట మొదలగు ప్రదేశాలందు సాయుధకల్లోలాలను లేవదీశారు. అయితే నాడది ఎక్కువగా జమీందారీ వ్యతిరేకపోరాటంగా కనుపించడంవల్లను, ముఖ్యంగా అప్పటికి నిజాంప్రభుత్వం ఇంకా కూలిపోకపోవడంవల్లను, సామాన్య ప్రజానీకం, కమ్యూనిస్టుల దేశభక్తిని, ప్రజాసేవను శంకించడానికి అంతగా అవకాశం లేకపోయింది. కాంగ్రెస్ వాదులు కమ్యూనిస్టుల ఈ హింసావాదాన్ని యెంత మాత్రమూ బలపరచకపోయినప్పటికీ, పని కల్పించుకొని వ్యతిరేక ప్రచారాన్ని సాగించవలసిన అవసరం కూడా వారంతగా గమనించలేదు.

నాటి హింసావిధానాలు సూర్యాపేట మొదలగు నల్లగొండజిల్లా ప్రదేశాలవరకే నిలిచివుండినై. అప్పటికి వరంగల్లు జిల్లాలో కమ్యూనిస్టులు ప్రచారాలద్వారా తప్ప, ఆయుధాలజోలికి పోలేదు. వరంగల్లు జిల్లాలో మధ్యతరగతి ప్రజానీకం ఎక్కువగా వుండడం వల్లను, ప్రజలు రాజకీయ చైతన్యవంతులు కావడంవల్లను, అప్పట్లో ఈ జిల్లా యందు సాయుధకార్యక్రమాలు సాగించడానికి కమ్యూనిస్టులకు సాధ్యం కాకపోయింది.

ప్రజాపోరాటంలో కమ్యూనిస్టులు

ఇంతలో 1947 ఆగస్టు 7 వ తేదీన సంస్థాన కాంగ్రెస్ ఆధ్వర్యాన హైదరాబాదు ప్రజాపోరాటం మొదలైంది. ఈ పోరాటంలో ప్రజలు అద్వితీయంగా త్యాగాలు చేశారన్నది మాత్రం నిర్వివాదాంశం. కాని, నాయకత్వపు లోపాలవల్ల, పోరాటం సత్ఫలితాలివ్వడానికి బదులు చాలావరకు దుష్ఫలితాలనే కలిగించిందని చెప్పవలసివస్తుంది. సంస్థానకాంగ్రెస్ పోరాటాన్ని ద్విముఖంగా సాగించిందని చెప్పబడుతూవుంది. దాన్ని 'ద్విముఖం'గా అనడం కన్న 'పరస్పర విరుద్ధవిధానాల'పై అనడం న్యాయంగా వుంటుంది. ఒకవంక అహింసావిధానానికి చిహ్నమైన సత్యాగ్రహసమరాన్ని సాగిస్తూ, మరొకవంక, ఆయుధాలను సేకరించి, హింసాయుతంగా పోరాడడం, పరస్పరవైరుధ్యం గాక మరేమవుతుంది? కనీసం హింసాయుత పోరాటంవల్లనైనా, సంస్థాన కాంగ్రెస్ స్వంతశక్తి నాధారంచేసుకుని, హైదరాబాదు ప్రజలకు విమోచనాన్ని కలిగించివుంటే, మనం ఆ విధానంలోని ప్రయోజనాన్ని కొంతవరకైనా అర్థం చేసుకోగలం. కాని అదీ జరగలేదు. ఇకపోతే, హింసావిధానం అవలంబించడం

"శ్రీ పురోహిత్"

మూలాన, నేడు మనముందు కనుపిస్తూవున్న ఈ కమ్యూనిస్టుసమస్యకు, నూరేండ్ల ఆయుష్షును పోయడం జరిగిందని చెప్పవలసివస్తుంది. నేడు కమ్యూనిస్టులు తమ హింసాకార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారంటే, అందుకు తగిన ఆయుధసంపత్తిని, కాంగ్రెస్‌వాదుల హింసాయుతపోరాటంసందర్భంగా సంపాదించివుంటారని విశ్వసించడానికి, చాలా నిదర్శనాలు కనుపిస్తున్నవి.

పోరాటం మొదలైన తొలిరోజుల్లో కాంగ్రెస్‌వాదులకు, కమ్యూనిస్టులకు సహజంగా వుండివున్న సంఘర్షణ అంతగా పైకి రాలేదు. కాంగ్రెస్ పోరాటవిధానాలను కమ్యూనిస్టులు విమర్శిస్తూవున్నప్పటికీ, ఆ దశ ప్రచారాలవరకే ఆగివుండింది. 1948 లో కలకత్తాలో కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెస్ జరిగిన తరువాత ఇండియా కమ్యూనిస్టుపార్టీ వైఖరిలో సంపూర్ణంగా మార్పు వచ్చింది. హింసావిధానాలతోనే, నెహ్రూప్రభుత్వాన్ని కూలగొట్టడం వారి ప్రధానకర్తవ్యంగా ఏర్పాటయింది. పార్టీయొక్క ఈ వైఖరి తెలంగాణాకమ్యూనిస్టుల్లోకూడా కానవచ్చింది. అప్పటి నిజాం ప్రభుత్వంతోపాటు, భారత జాతీయ ప్రభుత్వాన్నికూడా ఎదిరించడం ప్రారంభమైంది. కమ్యూనిస్టుల దాడికి కేవలం రజాకార్లు, నిజాం సైనికులే గాక తమకు ప్రధానవ్యతిరేకులుగా కనుపించిన కాంగ్రెస్‌వాదులు, ఇతరులుకూడా బలికావడం జరుగుతూవచ్చింది. ఇదే సందర్భంలో కమ్యూనిస్టులు, 8 పేజీల సుదీర్ఘమైన కరపత్రం తీశారు. ఈ కరపత్రంలో, భారత ప్రభుత్వం పెట్టుబడిదారీవిధానంతో పనిచేస్తున్నదన్న సాకుతో, హైదరాబాదుసంస్థానం ఇండియాలో చేరవలసిన అగత్యంలేదని చెబుతూ, మరొకవంక, బాధ్యతాయుత ప్రభుత్వమంటే, టాటా బిర్లాలకు హైదరాబాదులో పెట్టుబడిదారీవిధానాన్ని కొనసాగించుకోవడానికి సాధనమేనన్న వాదాన్ని ముందుపెడుతూ, తమ విప్లవవ్యతిరేక వైఖరిని స్పష్టంగా కనుపించారు. ఈ కరపత్రం, ప్రజల్లో కమ్యూనిస్టులపట్ల తీవ్రమైన అనాదరణను రేకెత్తించింది. స్వంతపార్టీ ప్రయోజనాలకోసం, కమ్యూనిస్టులు లక్షలాదిప్రజల ప్రాణాల్ని కూడా లెక్కచేయరన్న యథార్థాన్ని నాడు అంతా గుర్తించారు.

నిజాంప్రభుత్వానికి, కమ్యూనిస్టులకు మధ్య వస్తుతః మైత్రి లేకపోవచ్చు. కాని ఇద్దరికీ, భారత జాతీయప్రభుత్వం కూలిపోవడమే ప్రధానమైన లక్ష్యంగా మారడంతో ఆ యిద్దరిలో మైత్రి కలిసే అవకాశాలు వున్నవి. పైగా ఇరుపక్షాల వారికీ నీతినియమాలు, గడ్డిపోచలతో సమానాలు. అనుకున్నంతా జరిగింది. నిజాంప్రభుత్వం, కమ్యూనిస్టుల వైఖరిని వాడుకోవడానికి ఎంత మాత్రమూ వెనకంజ వేయలేదు. ఇండియన్ యూనియన్ పట్ల, కమ్యూనిస్టులు ప్రదర్శిస్తూ వచ్చిన వ్యతిరేకతను, రజాకార్ పత్రికలు' హైదరాబాదు రేడియో, చిలవలు పలవలు కల్పించి చిత్రించినై. అంతే కాదు; ఒకవంక కమ్యూనిస్టులపై ఇండియాప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న రోజుల్లో, లాయకలీప్రభుత్వం, సంస్థానంలో కమ్యూనిస్టుపార్టీపై వున్న ఆంక్షనిషేధాన్ని తొలగించివేసింది. అట్లా అని, లాయకలీప్రభుత్వం, ప్రజాస్వామ్యసూత్రాలకు కట్టుబడో, లేక కమ్యూనిస్టులపై తనకు వుండే ప్రత్యేకమైన అభిమానంవల్లనో, ఇది జరిగిందని భావించరాదు. ఇది కేవలం పరస్పర ప్రయోజనాలపై జరిగింది. హైదరాబాదు ఇండియా యూనియన్‌లో చేరడాన్ని వ్యతిరేకిస్తూ కరపత్రం తీసిన కమ్యూనిస్టులు, తత్ఫలితంగా పార్టీపై వున్న నిషేధాన్ని తొలగించడానికి పూనుకున్న లాయకలీప్రభుత్వమూ, కలిసి రహస్యంగా రాజకీయసంధి చేసుకున్నట్లు చెప్పబడుతూవుంది. నిజంగా అది సంధి కానేరదు. ఆ ఇరుపక్షాలవారు కలిసి, రాజకీయ వ్యభిచారం చేశారనడం యెంతైనా సమంజసం.

పోరాటంయొక్క అంతిమదశలో, ఆయుధాలు సేకరించడానికై కమ్యూనిస్టులకు చక్కని అవకాశాలు దొరికినవి. పార్టీపై నిషేధం తొలగినతరువాత, కమ్యూనిస్టులకూ, నిజాం సిబ్బందికీ మధ్య సంఘర్షణ పూర్తిగా తగ్గింది. పైగా నిజాంప్రభుత్వయంత్రం అప్పటికే పూర్తిగా పతనమైపోయింది. మరొకవంక, కాంగ్రెస్ వాలంటీర్లు కొంతవరకు సాయుధకార్యక్రమాలు సాగించినప్పటికీ, వారి కా విధానంలో అంత సామర్థ్యం లేదనే చెప్పాలి. ఇట్టి పరిస్థితులమూలంగా కమ్యూనిస్టులు, స్వేచ్ఛగా తిరిగి, విపరీతంగా ఆయుధాలు, తూటాలు మందుగుండుసామగ్రి సేకరించుకున్నారు. నిజాంపోలీసులు రజాకార్లనుండే గాక, కొన్ని ప్రదేశాలలో, కాంగ్రెస్ వాలంటీర్ల ఆయుధాలనుకూడా, దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు.

నాడు కమ్యూనిస్టులు ఆయుధాలు సేకరించారంటే, నిజాంప్రభుత్వాన్ని కూలద్రోయాలనే ఉద్దేశంతో కాదని మాత్రం భావించాలి. భారతసైన్యాలు హైదరాబాదుసంస్థానంలో ప్రవేశించి, నిజాంప్రభుత్వాన్ని అంతం చేస్తాయన్న యదార్థాన్ని వారు ఏనాడో గుర్తించారు. నిజాం ప్రభుత్వ పతనంతరువాతనే, తమ నిజమైన పోరాటం ప్రారంభమవుతుందని, కమ్యూనిస్టులు విధిగా అంచనా వేసుకుని, దూరాలోచనతో, అందుకు తగు సన్నాహాలు చేసుకున్నారు.

పోలీసుచర్యానంతరం

ఇంతలో సెప్టెంబరు 13, 1948 వ తేదీన భారతపోలీసుచర్య మొదలై నాల్గవనాటికల్లా దిగ్విజయంగా ముగిసింది. పోలీసుచర్యమూలంగా, ఆయుధాలు సేకరించడానికి కమ్యూనిస్టులకు మరొక చక్కని అవకాశం దొరికింది. వందలాది రజాకార్లు భారతసైన్యాలనుండి తప్పించుకుని పలాయనం చిత్తగిస్తూవున్న సందర్భంలో కమ్యూనిస్టులు, నయాన, భయాన, వారినుండి ఆయుధాలనులాక్కున్నారు. కొందరు రజాకార్లు, భారతసైన్యాలపైనను, ఇండియా ప్రభుత్వంపైనను వున్న గుడ్డిద్వేషంకొద్దీ, తమంతట తామే కమ్యూనిస్టులకు ఆయుధాలు అప్పగించి మాయమైనారు.

పోలీసుచర్య తరువాతనుండి, తెలంగాణంలో కమ్యూనిస్టుసమస్య నూతనస్వరూపం ధరించింది. పోలీసుచర్యసందర్భంగా, జైళ్ళనుండి రాజకీయఖైదీలు విచక్షణ లేకుండా వదిలిపెట్టబడటంలో, ప్రముఖకమ్యూనిస్టులు కూడా తప్పించుకుని బయటికి రాగలిగారు. ఈవిధంగా బయటికి రాగలిగిన కమ్యూనిస్టులు బహిరంగంగా తిరిగారని భావించరాదు. తెలంగాణమందు, ముఖ్యంగా, నల్లగొండ వరంగల్లు జిల్లాలలో, ఎక్కడివారక్కడ మాయమైనారు. అప్పటికి హైదరాబాదులో ఏర్పడిన మిలిటరీ ప్రభుత్వం, కమ్యూనిస్టుసమస్యయొక్క నిజస్వరూపాన్ని గుర్తించేలోగా, కమ్యూనిస్టులంతా *Under ground* వెళ్లిపోయారు. తమకు వ్యతిరేకులైన వారిని హత్యగావించడం, గ్రామాలను దోచుకోవడం మొదలైంది. ఈ సందర్భంగా హైదరాబాదు మిలిటరీప్రభుత్వం, కమ్యూనిస్టుపార్టీపై తిరిగి నిషేధాన్ని అమలుపరచి, నల్లగొండ, వరంగల్లు జిల్లాలలో సైనికబందోబస్తులను గావించింది.

పోలీసుచర్య జరిగిన దాదాపు మూడు మాసాలవరకు, కమ్యూనిస్టుల హింసాకార్యక్రమాలు, చాలా ఉధృతంగా సాగుతూవచ్చినవి. రజాకార్ల హయాములో, కాందిశీకులుగా యూనియన్ గ్రామాలకు వెళ్లినవారంతా, తిరిగి తమ స్వగ్రామాలకు చేరుకునే పరిస్థితి లేక పట్టణాలలో వుండిపోయారు. అంతేకాదు; కమ్యూనిస్టుల దౌర్జన్యాలకు తాళలేక, చాలామంది మధ్యతరగతిప్రజానీకంకూడా, గ్రామాలనుండి పట్టణాలకు చేరుకోవడం మొదలైంది. కమ్యూనిస్టులు, గ్రామాలలో హత్యలు లూటీలు సాగించడమేకాకుండా, మోటారుబస్సులను ధ్వంసం చేసి, ప్రయాణీకులను హింసించారు. రైలుపట్టాల నూడబెరకి, రైళ్ల రాకపోకలలో అంతరాయం కలిగించారు. వీలైనచోట్ల ప్రభుత్వ భవనాలనుకూడా కూలగొట్టారు.

ప్రభుత్వం తీవ్రచర్యలు తీసుకున్నది. కమ్యూనిస్టుల నిర్బంధించడానికి, అనుమానం వున్న గ్రామాలపైనను, వారి రహస్యస్థావరాలపైనను, రాత్రింబవళ్లు దాడులు సాగించి, చాలామంది కమ్యూనిస్టులను నిర్బంధించారు. ఈ కృషివల్ల కొంతవరకు కమ్యూనిస్టుల కల్లోలాలు శాంతించినట్లే కనుపించింది. కాని ఈ శాంతి యథార్థంలో 'శాంతి' కాదన్న విషయం, తరువాత అనుభవంలోగాని తెలిసిరాలేదు. తాత్కాలికంగా, చెదిరిపోయిన తమ బలాన్ని తిరిగి కేంద్రీకరించుకోవడానికై వ్యవధిని మాత్రమే తీసుకున్నారు. తరువాత తిరిగి కమ్యూనిస్టుల కల్లోలాలు చెలరేగడం, జరుగుతూవచ్చింది. ఇదే పరి

(18 వ పేజీ చూడుడు)

మా ఢిల్లీలేఖ:

ఎద్దులకు సాటిరాని మన ట్రాక్టర్లు

శ్రీ కృష్ణ

గతవారం యూనియన్ పార్లమెంటులో వ్యవసాయమంత్రివర్గం విమర్శకు లోనయింది. ట్రాక్టర్ల వినియోగం, నీటిపారుదల సౌకర్యాలలో ఈమంత్రివర్గం చేసిన పొరపాట్లను బహిరంగపరిచి లాలా దేశబంధు గుప్తాగారు, దేశానికీ, ఆహారోత్పత్తి వృద్ధికార్యక్రమానికీ ఎంతో సేవచేసినవారైనారు. ఇదివరలో ఈవిషయాలపై ప్రచురించబడిన సమాచారం మంత్రి దౌలత్ రాంగారివివరణవల్ల రూఢీ అయినాయి.

వ్యవసాయమంత్రివర్గం సెంట్రల్ ట్రాక్టర్ ఆర్గనైజేషన్ చరిత్రనుగురించి ఒక కరపత్రంలో ఈవిధంగా వ్రాసింది.

"యుద్ధకాలంలో మనదేశానికి వచ్చిన అమెరికన్ సైన్యాలు యంత్రసామగ్రిని అపారంగా తీసుకువచ్చి, యుద్ధానంతరం వానిని మనదేశంలో శాంతిసమయకార్యక్రమాలకోసం మనకు విడిచివెళ్లారు. వీనిలో పెద్దపెద్ద పంపులు అనేకం, అనేక యంత్రనిర్మాణపరికరాలు, ట్రాక్టర్లతో కలిపి నిర్మించబడిన బుల్‌డోజర్లు, స్క్రేపర్లు ఉన్నాయి."

మొదట ట్రాక్టర్లు అమెరికన్ సైనికులవద్ద ఉన్నాయి. ఈ ట్రాక్టర్ల తీసుకుని ప్రభుత్వం సెంట్రల్ ట్రాక్టర్ ఆర్గనైజేషన్ స్థాపించింది. ఈ సంస్థ 1949 మార్చి 31 వరకూ రు 1,44,63,806 ఖర్చుపెట్టింది. ఈ సందర్భంలో మన వ్యవసాయ మంత్రివర్గంవారి కరపత్రం ఈ క్రింది విధంగా వ్రాసింది.

"మనదేశంలో ప్రప్రథమంగా బీడుభూమిని సాగులోకి తీసుకురావడానికి పెద్ద ఎత్తున పెద్ద యంత్రాలను ప్రయోగిస్తున్నాం. ఈ పద్ధతి మనదేశంలో ఆచరణయోగ్యమయినదని రుజువయింది. మనదేశంలో పెద్ద ట్రాక్టర్లు ఉపయోగించడం కొత్తే అయినప్పటికీ మన మెకానిక్కులు, మన వ్యవసాయకూలీలు ఈ పనిలోకూడా తమ సమర్థతను నిరూపించుకున్నారు. ట్రాక్టర్లవల్ల బీడుభూమిని సాగులోకి తేవడంలో మనవారు నేర్పరులైనారు. భూమిసాగులో పశువుల్నీ యంత్రాల్నీ వినియోగించడంలో వైరుధ్యం లేకుండా సమయోచితంగా కార్యసానుకూలంనిమిత్తం సమన్వయపరిచి, మనదేశంలో వ్యవసాయవిధానాన్ని సంస్కరించడానికి వీలవుతుందనే ఆశ దీనివల్లనే కలుగుతోంది".

కాని ఈ ఆశ భగ్నమయింది. ఇదంతా అంధులకి అంధులే మార్గనిర్దేశకులైనట్లు కనిపిస్తోంది. సంయుక్తరాష్ట్రాలలోని గోవిందనగరంలో (గంగా ఖాదర్) మహావృక్షాల్ని పెకలించడానికి ఈ ట్రాక్టర్లు ఉపయోగపడినాయని వచ్చిన వార్తలేగాని ఆపైన ఏంజరిగిందో ఇప్పటికీ తెలియదు. పోగా ఈ ట్రాక్టర్లని భూమి సాగుకు వినియోగించిన అనేకప్రాంతాల్లో భూమిని పంటనిమిత్తం సాగుచేసేకార్యక్రమం విఫలమయిందని తెలుస్తోంది. భారీయంత్రాలవల్ల శుభ్రపరిచిన భూమి పచ్చికకుమాత్రం ఉపయోగపడుతోందట.

ట్రాక్టర్లతో సాగించిన కార్యక్రమాన్ని వ్యవసాయమంత్రివర్గం ఇప్పుడు వివరించినదాన్నిబట్టిచూస్తే పూర్తిగా వ్యర్థమయిందని తెలుస్తోంది. వ్యవసాయమంత్రివర్గం ఇప్పుడిచ్చిన సమాచారం విషాదగాథలా ఉంది. ట్రాక్టర్లు మధ్యలో పనిచెయ్యకుండా పాడైపోవడం, అవసరసమయానికి ట్రాక్టర్లు అందకపోవడం, వానికవసరమైన స్పేర్‌పార్ట్సు దొరక్కపోవడం అకాలవర్షాలు మొదలైన సాకుల్తో నిండివుంది. ఇది సరిగా ఆహారోత్పత్తి వృద్ధికార్యక్రమంపోలికనే ఉంది. ఈ కార్యక్రమం అమలుజరిగినతరవాత ఇప్పటికి అధికంగా పండినపంట 7,27,731 టన్నులని ఒక అంచనా. మరొక అంచనాప్రకారం వరిపంట నూరింట 8.7 వంతులు తగ్గిపోయింది. యవలపంట నూరింట 19 8. వంతులు, బజ్రా 18.7 వంతులు జొన్న 17.2 వంతులు రాగులు 6.8 వంతులు, బార్లీ 18 వంతులు చొప్పున తగ్గిపోయినాయి. ఇంక ఎటొచ్చీ గోధుమపంటమాత్రం నూరింట అరవంతు (½%) పప్పుధాన్యాలు నూరింట 1.3 వంతులు మాత్రం పెరిగినాయి.

ట్రాక్టర్ల పనికూడా ఇలాగే ఉంది. గతసంవత్సరం ట్రాక్టర్లతో దున్నిన భూమి 3,77,164 ఎకరాలు. అంటే అన్నిరాష్ట్రాల్లోనూ సంస్థానాల్లోనూ ఎంత భూమిని దున్నాలని తలపెట్టారో, అంతకి చాలా తక్కువన్నమాట. పార్లమెంటులో మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ వ్యవసాయమంత్రిగారు 1949-50లో ట్రాక్టర్లవల్ల దున్నినభూమి 5,17,957 ఎకరాలని చెప్పారు. మొదట దున్నతలచినది 3,78,100 ఎకరాలేనట. అన్ని ట్రాక్టర్లనీ పనిలోపెట్టినట్లయితే ఒక్కొక్క ట్రాక్టరు సంవత్సరంలో 249 ఎకరాలు దున్ని ఉండాలి. అంటే రోజుకి ఒక్క ఎకరంకంటె తక్కువన్నమాట. మామూలుగా ఎడ్లయితే ఇంతకంటె ఎక్కువే దున్నుతాయి. ట్రాక్టర్లతో భూమి దున్నినదానికి ఎకరానికి రు 75 ఖర్చు తేలింది. ఏకరానికి రు 75 ఖర్చుపెట్టి ట్రాక్టర్లతో దున్నించడం మనదేశంలో కిలవుతుందో కాదో వ్యవసాయమంత్రిత్వం ఆలోచించాలి.

కాంగ్రెస్‌హయాంలో ఇటువంటి పెద్దవిషయాల్లో జోక్యంచేసుకోడానికి ప్రజలకి వీల్లేదు. విమర్శలు వచ్చేసరికి ప్రభుత్వం పరువుకు ప్రాకులాడి విమర్శల్ని పెడచెవిని పెట్టడమో, లేక దురుద్దేశంతో విమర్శలు చేస్తున్నారని నిందించడమో జరుగుతోంది. విమర్శలు రావడంతో పట్టుదల అధికమై దేనికీ లక్ష్యపెట్టకుండా ఈ కార్యక్రమాల్ని తుచతప్పకుండా బలవంతాన సాగిస్తున్నారు. సెంట్రల్ ట్రాక్టర్ ఆర్గనైజేషన్‌వల్లగాని నీటిపారుదలవిషయంలోగాని ఇంత ధనం నీటిపాలౌతోందని నిరూపించిన దేశబంధుగుప్తాగారి విమర్శకి ఫలితం ఉంటుందో ఉండదో సందేహమే. ఎందుకంటే ప్రపంచం తలకిందులైనాసరే గాని 1951 మార్చిమాసానికి భారతదేశాన్ని ఆహారవిషయం స్వయంసమృద్ధం చేసితీరక తప్పదు.

కొత్తఉద్యోగాలు:

వ్యవసాయమంత్రివర్గం ప్రచురించిన సమాచారంలో ఈక్రిందివిషయాలు గుర్తించతగినవి.

"1949-50 బడ్జెట్‌లో ఈమంత్రిత్వం ఖర్చునిమిత్తం రు 29,19,900 గ్రాంట్ కోరింది. కాని పొదుపుకోసం విచారణసంఘంవారి సూచనలు రాకుండానే, పొదుపని చెప్పి ఇందులో రు 4,28,900 తరిగించి, రు 24,91,000 మాత్రమే గ్రాంట్ ఇవ్వడానికి ఆర్థికమంత్రివర్గం నిర్ణయించింది. ఇచ్చినంతల్లోనే సర్దుకుంటూ వ్యవసాయమంత్రివర్గం ఖర్చుపెట్టుకుంటూ వచ్చింది. కాని 1949 ఏప్రలు 1'వ తేదీఅనంతరం ఆహారోత్పత్తి వృద్ధికార్యక్రమంనిమిత్తమూ ఇతర అవసరాల నిమిత్తమూ, కొందరు కొత్త ఉద్యోగుల్ని నియమించవలసివచ్చింది. వీరుగాక దుంపనూనెల కంట్రోలర్‌నీ, వస్తురవానా శాఖలో ఒక డిప్యూటీడైరెక్టర్‌నీ నియమించవలసివచ్చింది. వీనివల్ల గ్రాంట్‌తో సరిపెట్టుకోడానికి వీలుపడలేదు.

"చివర చెప్పిన ఇద్దరు ఉద్యోగులకో సంకొత్తగా ఎందుకు చెప్పవలసివచ్చిందంటే, మొదట ఈ ఆఫీసర్ల నియామకంనిమిత్తం తయారుచెయ్యబడిన బడ్జెట్‌అంచనాలను ఆర్థికమంత్రికార్యాలయం సకాలంలో ఆమోదించినప్పటికీ, కొత్త ఖర్చుల అంచనాలజాబితాలో వీనిని చేర్చడానికి తగినసమయంలో జాబితా వ్యవసాయమంత్రికార్యాలయానికి చేరలేదు.

"తప్పుడు ఈ డిమాండులో కొత్తఅంచనాలను వేసినప్పుడు వ్యవసాయమంత్రికార్యాలయం తన ఖర్చుల్ని గ్రాంట్‌మొత్తం రు 24,91 000 లో సరిపెట్టుకోవడం అసాధ్యమని తేలింది. అందువల్ల ఉద్యోగుల జీతాల తగ్గింపు కొన్ని ఖర్చుల తగ్గింపువల్ల మిగిలే మొత్తాన్ని ఆర్థికమంత్రికార్యాలయానికి ఒప్పగించడానికి వీలుండదు".

వ్యవసాయ మంత్రి కార్యాలయం ఖర్చు 1948-49 లో రు 4,04,00,000 నూరింట పదివంతులు చొ॥ ఖర్చు తగ్గించే లెక్కనిచూస్తే 1950-51 లో ఇందులోనుంచి రు 40,40,000 తగ్గించాలి. కాని బడ్జెట్‌లో రు 67 లక్షలు పెంచాలని ఈ మంత్రిత్వం ప్రతిపాదించింది.

నూనె పరిశ్రమ:

గతవారం వనస్పతిపరిశ్రమనుగురించీ, నూనె ఉత్పత్తినిగురించీ వ్రాయబడింది. భారతదేశంలో పండే నూనెగింజలో పాతికవంతు వనస్పతిపరిశ్రమే తీసుకుంటోందని గతవారం పార్లమెంటులో వ్యవసాయమంత్రి తెలియచేశారు. భారతదేశంలో దాదాపు 600 నూనెమరలున్నాయనీ (ఆయిల్ ఎక్స్‌పెల్లర్లు) వానికి సాలుకి 27,73,000 టన్నులు నూనెగింజలు కావలసి ఉంటాయి. ఇదికాక గ్రామాల్లో గానుగలు సాలుకి 6,63,000 టన్నులు నూనెగింజలు ఉపయోగిస్తాయి.

కాని రమారమిగా నూనెమరలు పనిచెయ్యగలిగినదానిలో సగమే చెయ్యగలుగుతున్నాయి. గానుగలకి మూడింట రెండువంతులే లభిస్తోంది. అంటే మూడింట ఒకవంతు గానుగలు పనిలేకుండా పడిఉంటున్నాయని దీనివల్లనే తెలుస్తోంది. దీనివల్ల గ్రామీణార్థికవ్యవస్థలో ఎటువంటి మార్పు లొస్తున్నాయో ఇంకా తెలియపం లేదు.

నూనెగింజల ఉత్పత్తికూడా తగ్గిందని వ్యవసాయమంత్రిగారు తెలిపారు.

1947/48 లో 51,48,000 టన్నులు ఉత్పత్తి అయింది. 1948/49లో 47,02,000 టన్నులే ఉత్పత్తి అయింది. ధరల్లో చాలా పెరుగుదల వచ్చింది. వేరుసెనగ మణుగుధర 1946/47 లో రు 17-12-3 నుంచి 1948/49 లో రు 25-9-3 కి పెరిగింది. నువ్వులధర మణుగు రు 28-5-2 నుంచి రు 30-2-0 కి పెరిగింది. ఆవాలధర మణుగు రు 18-10-2 నుంచి రు 35, రు కి పెరిగింది. ఆముదపుగింజల ధరమాత్రం రు 18-1-10 నుంచి రు 17-2-9 కి తగ్గింది. ధర లీవిధంగా పెరిగినప్పటికి నూనెగింజలపంట దాదాపు నాలుగున్నర లక్షలు తగ్గిపోయింది.

వ్యవసాయదార్లకి వారి బాగోగులు వారికే తెలుసుననేది అందరూ అంగీకరించిన విషయమే. ధరలుపెరిగినందువల్ల వ్యవసాయదార్లు నూనెగింజల పంట హెచ్చిస్తారని భావించాలి. కాని విషయాల్ని చూస్తే ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ధరలు పెరిగినా ఎక్కడో మరొకచోట నష్టం లేకపోతే ఇటువంటి హెచ్చు ధరల అవకాశాన్ని వ్యవసాయదారులు ఊరికే జారవిడుచుకుంటూ రనుకోకూడదు.

1948/49 లో డాలర్ మొదలైనప్రాంతాలకు 9300 టన్నుల నూని, 9100 టన్నుల నూనిగింజలు, స్టర్లింగు మొదలైన ప్రాంతాలకు 5,57,000 టన్నుల నూని, 9,53,000 టన్నుల నూనిగింజలు భారతదేశంనుంచి ఎగుమతైనాయని వ్యవసాయమంత్రి ప్రకటించారు. 1949/50 లో డాలర్ ప్రాంతాలకు 1700 టన్నుల నూని, 1,61,000 టన్నులనూనిగింజలు, స్టెర్లింగ్ ప్రాంతాలకు 1.66,000 టన్నుల నూని, 67000టన్నుల నూనిగింజలు ఎగుమతి చెయ్యాలని నిశ్చయించుకున్నారు. దీనివల్ల నూనిపరిశ్రమవల్ల గ్రామాల ఆర్థికవ్యవస్థే కాకుండా, విదేశాలలో వర్తకమూ, విదేశద్రవ్యాల మారకపుస్థితీకూడా మారతాయని తెలుస్తోంది.

మన ప్రధానమంత్రి ఒక ప్లానింగ్‌కమిషన్ నియమిస్తున్నారు. ఈ కమిషన్‌వారు వనస్పతి పరిశ్రమసంగతి సందర్భంలో గ్రామాల ఆర్థిక వ్యవస్థనుగురించీ విదేశాలతో వర్తకంగురించీ కూడా విచారిస్తారో లేదో గమనించాలి.

సప్లిమెంటరీ బడ్జెట్:

యూనియన్‌పార్లమెంటు ఈవారం రు 88,24,05,000 సప్లిమెంటరీ గ్రాంటుల్ని ఆమోదించింది. గ్రాంటులు ఈ క్రింద వివరించినట్లు ఇవ్వబడినాయి:

రవానా సుంకం(కస్టమ్స్)రు 2, 56, 85,000.

సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీలు రు 39,50,000.

రాజ్యాంగపరిషత్తు రు 1, 16, 30, 000.

పార్లమెంటరీశాఖ రు 50, 000.

విదేశాంగశాఖవారి తపాలా తంతిఖర్చులు రు 2,12 000.

ప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తి, గనులశాఖ—రు 84, 000.

ఆడిట్ రు 29, 76,000.

శాస్త్రాశ్రయాలు వగైరా—రు 7,00,000.

కొండప్రాంతాలు, ఆటవికప్రాంతాలు—రు 4,36,000.

విదేశాంగశాఖోద్యోగులకు ఖర్చు రు 40,83, 000.

సివిల్‌వర్క్సు రు 29,55,000.

మిశ్రమఖర్చులు రు 1000.

శరణార్థులనిమిత్తం ఖర్చు రు 3,25,00,000.

అండమాన్, నికోబార్‌దీవులకు రు 1, 53,000.

సంస్థానాల నిమిత్తం రు 16,26,000.

వీనిమొత్తం రు 8,70,41,000.

పెట్టుబడి ఖర్చులు:

కరెన్సీనోట్లనిమిత్తం పెట్టుబడి రు 79,12, 53, 000.

ఢిల్లీకి రు 41,13,000.

ఇందులో పైకి కనిపించేదిమాత్రం కాక కథ ఇంకా ఉంది వివిధకార్యక్రమాల ఖర్చులు నూరింట పదివంతుల చొ॥ ఉద్యోగుల జీతాలపైన నూరింట అయిదువంతులు చొ॥ తగ్గించినందువల్ల మిగిలేధనం సరిపోతే సరి. లేదా దేశరక్షణశాఖ ఖర్చుఅంచనాకు మించి రు 25 కోట్లు అయింది. రూపాయిమారకపువిలువ తగ్గింపుసందర్భంలో ఆర్థికమంత్రిగారు పొదుపుకోసం వివరించిన పద్ధతుల్నిబట్టి ఈసంవత్సరపు బడ్జెట్‌లో రు 40 కోట్లు ఖర్చు తగ్గుతుందని చెప్పారు.

ఈపొదుపే లేకపోయినట్లయితే సప్లిమెంటరీ బడ్జెట్‌లో ఖర్చు రు 128 కోట్లు అయ్యేదేకి ఇంతే కాదు. ఇంకా ఇంది. కిందటి మార్చి నెలలో ఆర్థికమంత్రిగారు రు 49 కోట్లు మిగులుతుందని అంచనా వేశారుకూడా.

రూపాయి మారకపువిలువతగ్గింపుకాని దిగుమతివ్యాపారవిధానంలో మార్పువల్ల రవానాసుంకాలవల్ల రాబడి తగ్గుదలగాని లేవని ఎంచుకుంటే, ఈసప్లిమెంటరీగ్రాంటువల్ల ఖర్చులు ఆదాయానికి రు 88 కోట్లయినా మించి ఉంటాయి.

వీనివల్ల భారతదేశం దుబారాగా ఖర్చులు చేస్తోందని చెప్పకతప్పడంలేదు. ప్రతిమాసం ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఈఖర్చులవల్ల మన నిలవలు మహావస్తే 1951 మార్చి 31 వరకూ సరిపోతాయి. ఇంక ఆతరవాత ఏమవుతుందో ఈశ్వరుడి కెరుక. 1951 సంవత్సరంలో కొత్త శాసనసభ రావచ్చుననుకుంటున్నారు. అప్పుడు కూడా కాంగ్రెసే అధికారంలోకి వస్తుందనేది కూడా రూఢిగా కనిపిస్తోంది. ఈ శాసనసభ తమ వారసులికి ఖాళీఖజానా ఒప్పగించడం వివేకమేనా?

నేటిప్రపంచం:

★ ఇండో-పాకిస్తాన్ వ్యవహారాలు ★
★ కాశ్మీర్ సమస్యపై కమిషన్ నివేదిక ★

నిస్సహాయులైన హిందూకుటుంబాలు, శరణార్థుల స్థిరచరాస్తులు గుప్పిట పట్టి రాజకీయసమరం సాగిస్తున్న పాకిస్తాన్, రూపాయిమారకపువిలువ తగ్గింపుతో ఆర్థికరంగంలో కూడా భారతదేశంపైన ప్రచ్ఛన్నయుద్ధం ప్రారంభించింది.

కాశ్మీర్ వివాదం కాని శరణార్థుల ఆస్తులు, పంజాబ్ పంటకాలువల నీటి తగాదాలు కాని మొన్న మొన్నటివరకూ భారతదేశం పాకిస్తాన్ల మధ్య వర్తకానికి అంతగా అంతరాయాలు కలిగించలేదు. కాని 1949 సంవత్సరారంభంనుంచి పాకిస్తాన్ వాణిజ్యరంగంలో కూడా జోక్యం కలగచేసుకుంటూ, ఇండో-పాకిస్తాన్ వాణిజ్య సంధిని నిరాదరిస్తూవస్తోంది. ఆర్థికంగా తనకంటె కొద్దిగా నీరసస్థితిలో ఉన్న భారతదేశాన్ని ఆర్థికంగా దెబ్బతియ్యాలని పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. భారతదేశం ఇంతవరకూ ప్రతీకారం చెయ్యకుండా ఊరుకున్నందువల్ల తామేది చేసినా చెల్లుతుందనే ధోరణిలో పాకిస్తాన్ వ్యవహరిస్తూవచ్చింది.

దేశవిభజనఅనంతరం ఇంతవరకూ పాకిస్తాన్ భారతదేశాల మధ్య మూడు పర్యాయాలు వర్తకపు ఒడంబడికలు జరిగాయి. సమాలోచనల కాలంలో పాకిస్తాన్ పూర్తి సహకారసౌజన్యాలు ప్రకటిస్తూవచ్చినందువల్ల అంత చిక్కు లేకుండా భారతదేశం ఒడంబడికలు చేసుకోడానికి వీలయింది. కాని ఎప్పటికప్పుడే ఒడంబడికల్ని గాలికి విడిచిపెట్టి పాకిస్తాన్ చిత్తంవచ్చినట్లు సంధినియమాల నతిక్రమిస్తూవచ్చింది. భారతప్రభుత్వం ఎన్ని పర్యాయాలు ఈవిషయమై హెచ్చరించినా పాకిస్తాన్ మాట తప్పిస్తూవచ్చింది. భారతదేశంనుంచి రవానా అవుతున్న వస్త్రంపైనా ఇతరసరుకులపైనా పక్షపాతబుద్ధితో అంతులు ఆటంకాలు విధిస్తోంది. సమయానికి ఈవస్తువుల్ని అమ్మకానికి విడిచిపెట్టకుండానూ, భారతదేశవస్తువుల్ని నిషేధించాలని పరోక్షంగా ప్రచారంచేస్తూ పాకిస్తాన్ నియమాల నతిక్రమించింది.

అనేకశతాబ్దాలుగా స్థిరపడిన సహజవాణిజ్యగతిని గతి తప్పించడానికి పాకిస్తాన్ శతవిధాల యత్నిస్తోంది. భారతదేశంతో వాణిజ్యబంధాలను త్రెంచి ఇతరదేశాలతో పెంపొందించుకోవడం తమ ప్రధానలక్ష్యమని పాకిస్తాన్ నాయకులు అనేక పర్యాయాలు ప్రకటించారు. రవానాసుంకాలు వాణిజ్యవిషయాలలో సమగ్రమైన సంధిచేసుకుని సరిహద్దుఅవరోధాలను తొలగించి, వాణిజ్యరీత్యా భారతదేశం పాకిస్తాన్లను ఏకఖండంగా చెయ్యడానికి అంగీకరించవలసిందని భారతదేశం పాకిస్తాన్ను కోరింది. కాని పాకిస్తాన్ నిష్కర్షగా నిరాకరించింది. ఈపరిస్థితులవల్ల ఉభయరాజ్యాలకూ నష్టమేనన్న విషయం ప్రపంచానికి విదితమే. కాని ద్విజాతిసిద్ధాంతాన్ని రుజువు చేసుకోడానికీ, భరతఖండం నైసర్గికంగా గాని, పరిపాలనరీత్యాగాని ఏకఖండం కాదని నిరూపించడానికీ పాకిస్తాన్ వ్యర్థప్రయత్నాలు చేస్తోంది. ఈప్రయత్నాలకు ఫలితంగా భరతఖండంలో శాంతి శాశ్వతంగా భగ్నం కాక తప్పదు.

రూపాయిమారకపు విలువ తగ్గింపుతో ప్రచ్ఛన్నసంఘర్షణ తీవ్రతరమయింది. పాకిస్తాన్ తన ఆర్థికప్రాబల్యాన్ని నిరూపించుకుని, తద్వారా భారత ప్రభుత్వాన్ని లొంగదీసి, విభజనకాలంలో నెరవేరని తమ కోర్కెల్ని నెరవేర్చుకోవాలని తలపెట్టింది. తన రూపాయికి అంతర్జాతీయద్రవ్యాలతో మారకపువిలువను తగ్గించలేదు. భారతదేశం తగ్గించింది కాబట్టి తమ ద్రవ్యాధిక్యతను నిలబెట్టుకోడానికి పాకిస్తాన్ పట్టుదల పట్టింది. ప్రభుత్వాజ్ఞలచేత ద్రవ్యాధిక్యతను నిలబెట్టుకోవడం ఆట్టే కాలం సాధ్యపడదు.

ఆరాజ్యానికి ఆర్థికబలం వాస్తవంగా ఉంటే అదే నిలబడుతుంది. కాని పాకిస్తాన్ భారతదేశాలు ఆర్థికంగా పరస్పరం ఆధారపడి ఉన్నాయి. అందువల్ల భారతదేశం తగ్గించింది కాబట్టి పాకిస్తాన్ కూడా ఎప్పుడో తగ్గించక తప్పదు. తగ్గించకపోతే దేశంలో ఆర్థికపరిణామమే తగ్గింపు తెచ్చిపెట్టగలదు. ఈరీతిగానైనా తగ్గకుండా ఆధిక్యతను నిలబెట్టుకోడానికి పాకిస్తాన్ ప్రభుత్వం వాణిజ్యరంగంలో ఆజ్ఞలిస్తోంది. పాకిస్తాన్ అవలంబిస్తున్న ఈపద్ధతికి మద్దతుగా మతరాజకీయోన్మత్తులు, భారతదేశంపట్ల అకారణవిరోధం వహించినవారూ ప్రజల్లో చాలామందే ఉన్నారు. కాని ఈపద్ధతిఫలితంగా ఆర్థికకల్లోలం సంభవిస్తే నిలవగలవారెందరో ఇంకా తెలియదు.

ప్రభుత్వాజ్ఞప్రకారం ఆధిక్యత నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో పాకిస్తాన్ కొత్తమారకపురేట్లు ప్రకటించింది. 144 భారతదేశపు రూపాయిలకు నూరు పాకిస్తాన్ రూపాయిలు మారకంరేటు విధించింది. భారతప్రభుత్వం ఈరేటు కంగీకరించలేదు. వాణిజ్యగతే సహజమూల్యాలను నిర్ణయించగలదని భారతప్రభుత్వం చెప్పింది. సహజమూల్యం ఏరీతిగా తేలినప్పటికీ అంగీకరించగలదని కూడా భారత ప్రభుత్వం తెలిపింది. ఆప్రకారమే మార్కెట్ పరిస్థితుల్నిబట్టి ఏ రేటుకైనా సరే పాకిస్తాన్ రూపాయిల్ని కొనుక్కోవచ్చునని భారతదేశంలోని బాంకుల్ని భారతప్రభుత్వం అనుమతించింది. పాకిస్తాన్ నిర్ణయించిన రేటుని తుదినిర్ణయంగా అంగీకరించబోవడంలేదని ప్రకటించింది.

ఈసంఘర్షణఫలితంగా వాణిజ్యరంగంలో అస్థిరపరిస్థితు లేర్పడినాయి. భారతదేశంతో అన్యోన్యంగా ఉంటూవచ్చిన పాకిస్తాన్ వాణిజ్యాన్ని ఒక్కసారిగా మైత్రిబంధంనుంచి త్రెంచాలని పాకిస్తాన్ చేసిన యత్నంవల్ల, పాకిస్తాన్ ఆర్థికవ్యవస్థపునాది చలించిపోయింది. మార్కెట్లో నూరు పాకిస్తాన్ రూపాయలకు 102 మొదలు 114 వరకు భారతదేశపురూపాయిలు కొనుబడికి దొరికాయి. పాకిస్తాన్ ఈ కొనుబడిని నిషేధిస్తూ ఉత్తరువిచ్చింది. పాకిస్తాన్లోని బాంకులు భారతదేశపు రూపాయలను నూటికి 144 రేటునమాత్రమే కొనాలి కాని తక్కువరేటుకి కొనకూడదని నిర్బంధం విధించింది. దీనివల్ల పాకిస్తాన్ బాంకులూ వర్తకులూ భారతదేశపు రూపాయల్ని బహిరంగంగా కొనడం మానివేశారు. చాటుగా కొనడంవల్ల భారతదేశపు రూపాయిల ఖరీదు (పాకిస్తాన్ రూపాయిలలో) మరింత హెచ్చింది. బహిరంగంగా కొనుబడి నిలిచిపోయింది. భారతదేశపు బాంకులుమాత్రం వచ్చిన రేటుకి పాకిస్తాన్ రూపాయిల్ని కొంటున్నాయి. దీనివల్ల పాకిస్తాన్కి నష్టం సంభవించింది.

ఈ పరిస్థితిని సహించలేక, సక్రమమార్గాలలో భారతదేశంతో పోటీపడలేక, పాకిస్తాన్ అక్రమమార్గాలకు తిరిగింది. రూపాయిమారకపు విలువ తగ్గింపుకిపూర్వం కంట్రాక్టులపైన కొన్న ముడి నారబేళ్ళని భారతదేశానికి రవానా కాకుండా పాకిస్తాన్ అటకాయించింది. మొత్తం 12 లక్షల బేళ్ల కొనుబడికి భారతదేశపు జూట్ మిల్లుల ఏజంట్లు పాకిస్తాన్లో అమ్మకపు ఏజంట్లకు డబ్బుకట్టారు. ఇందులో ఏడులక్షల బేళ్లు మాత్రమే భారతదేశానికి చేరాయి. మిగతా అయిదులక్షల బేళ్లనీ రవానాచేసేసమయంలో పాకిస్తాన్ ప్రభుత్వం అటకాయించి ఏవో సాకులపైన రవానా కాకుండా నిలిపివేసింది. ఇదికాక పాకిస్తాన్ మీదుగా అస్సాంనుండి కలకత్తాకు రవానా అవుతున్న లక్ష బేళ్ల నారను పాకిస్తాన్ మధ్యలో నిలిపివేసింది.

మూడోపర్యాయం అనగా 1949 జూన్లో భారతదేశం పాకిస్తాన్ల మధ్య జరిగిన వాణిజ్య సంధిప్రకారం భారతదేశానికి 40 లక్షలబేళ్ళ నారను పాకిస్తాన్ అమ్మడానికి అంగీకరించింది. ఈసంధి 1950 జూన్ వరకూ అమలులో ఉంటుంది. కాని ఇప్పుడు పాకిస్తాన్ ఈసంధి నియమాలను అతిక్రమించింది. సంధిప్రకారం ఇది కాక నాలుగన్నర లక్షలబేళ్ల సింధీపొడుగు పింజపత్తి కూడా అమ్మడానికి అంగీకరించింది. కాని రూపాయి మారకపువిలువ తగ్గింపుఅనంతరం భారతదేశానికి పత్తి అమ్మకాన్ని నిలిపివేసింది. సంధిప్రకారం భారతదేశం పాకిస్తాన్కు 20 లక్షల టన్నుల బొగ్గు, 80 వేల టన్నుల ఉక్కు, లక్షన్నరబేళ్ల వస్త్రం అమ్మడానికి అంగీకరించింది. వాస్తవానికి భారతదేశం ఉక్కును అమ్మగలిగే పరిస్థితిలో లేదు. అత్యవసరకార్యాలకు విదేశాలనుంచి కొంటున్న ఉక్కుకూడా చాలడంలేదు. ఈపరిస్థితుల్లో 80 వేల టన్నుల ఉక్కును పాకిస్తాన్కు అమ్మడానికి భారతప్రభుత్వం ఎలా అంగీకరించిందో తెలియదు. డాలర్లు ఖర్చుపెట్టి కొని విదేశాలనుంచి తెచ్చుకుంటున్న ఉక్కును పాకిస్తాన్కు పాకిస్తాన్ రూపాయిలకు అమ్మడానికి భారతప్రభుత్వం అంగీకరించిందంటే కేవలం పూర్వపు బ్రిటిష్ఇండియాలో నడుస్తున్న వాణిజ్యగతిని దేశవిభజనానంతరం భగ్నపరచకూడదనే ఆశతోనే అంగీకరించింది. 1949 సంధిప్రకారం పాకిస్తాన్కు చేరవలసిన ఉక్కులో చాలభాగం చేరిపోయింది. ఇంక బొగ్గురవానా మాసవారీగా నడుస్తోంది.

ఇప్పుడు ఇంతకాలానికి పాకిస్తాన్ అక్రమాలకు భారతప్రభుత్వం ప్రతీకారచర్య తీసుకోవడం పార్లమెంటు సభ్యులకీ, ప్రజలకీ సంతృప్తి కలిగించింది. ఈచర్యను ప్రతీకారచర్య అనడం కూడా పొరపాటే. పాకిస్తాన్ ఎప్పుడో భగ్నపరిచిన వాణిజ్యసంధి భగ్నమైందని ఈనాటికి భారతప్రభుత్వం ఒప్పుకొని తత్ప్రకారం ఇప్పుడు ప్రవర్తిస్తోందని చెప్పాలి. భారతదేశంనుంచి బొగ్గు రవానా కాకపోతే ఇటు తూర్పు బెంగాల్లోనూ, అటు పశ్చిమపంజాబ్, సరిహద్దు రాష్ట్రాల్లోనూ రైళ్లు నిలిచిపోక తప్పదు. పాకిస్తాన్ పరిశ్రమలు దెబ్బతింటాయి. ఈ దెబ్బకి తట్టుకోగలిగినట్లయితే పాకిస్తాన్ భారతదేశంతో ఆర్థికబంధాలను తెంచివెయ్యగలిగినట్లే.

కాని ఇది అసంభవం. పాకిస్తాన్ ఓటమి నంగీకరించడంకంటె భారతదేశస్థుల్ని పాకిస్తానీలనీ హింసిస్తున్న దక్షిణాఫ్రికా ప్రభుత్వంతో బేరాలకు దిగవచ్చును. లేదా ఏవో సాకులు చెప్పి తిరిగి భారతదేశంతో సంధికి రావచ్చును. పాకిస్తాన్ భారతదేశాలమధ్య ఆర్థికసమస్యలు సానుకూలపడితేగాని పాకిస్తాన్లో మిగిలిన హిందువుల జీవితందుర్భరం కాకమానదు. భారతదేశంలో మహమ్మదీయులపట్ల, పాకిస్తాన్ ప్రభుత్వం పాకిస్తాన్ హిందువులపట్ల వర్తిస్తున్నరీతిని, భారతప్రభుత్వం వర్తించడం అసంభవం. పాకిస్తాన్ ఆరీతిగా ప్రవర్తిస్తున్నదంటే హిందువుల్లో కొద్దిమందిని తప్ప అత్యధికసంఖ్యాకుల్ని పశ్చిమపాకిస్తాన్నుంచి వెళ్లగొట్టింది. మిగిలిన హిందువులపట్ల ప్రభుత్వం ప్రజలు ఎంత అక్రమంగా ప్రవర్తించినా, హిందువులు నిస్సహాయస్థితిలో ఉన్నారు. భారతదేశంలోనూ తూర్పుపాకిస్తాన్లోనూ పరిస్థితి వేరు. భారతదేశంలో మహమ్మదీయులు అనేక లక్షలమంది ఉన్నారు. వారి అసంతృప్తివల్ల దేశంలో శాంతికి భంగంకలగడానికి అవకాశం ఉంది. అదీకాక మతప్రాధాన్యరహితమైన పరిపాలనావ్యవస్థలో ప్రజాప్రభుత్వం ప్రజల్లోని ఒక వర్గానికి అక్రమం చెయ్యలేదు. హిందువులపట్ల పాకిస్తాన్లో పాలకుల కున్న ద్వేషం భారతదేశంలో మహమ్మదీయులపట్ల ఎవరికీ లేదు. తూర్పుపాకిస్తాన్లో హిందువులు చాలామంది ఉన్నారు. అందువల్ల అక్కడ పాకిస్తాన్ ప్రభుత్వవిధానంవల్ల ఇప్పుడు కాకపోతే ముందైనా అశాంతి రాక తప్పదు.

కాశ్మీర్ కమిషన్:

కాశ్మీర్ సమస్యలో తను మధ్యవర్తిత్వం విఫలమయిందని కాశ్మీర్ కమిషన్ భద్రతామండలికి నివేదించింది. పాకిస్తాన్ భారతప్రభుత్వాలు రెండూ సమ్మతించిన 1948 ఆగస్టు తీర్మానం కాశ్మీర్ సమస్యాపరిష్కారానికి మూడు ప్రధానసూచనలు చేసింది. 1. ముందుగా యుద్ధం విరమించాలి. 2. ఎవరిసైన్యాలే సరిహద్దుల్లో నిలవరించాలో నిర్ణయించి, ఎవరిసైన్యాల నేరీతిగా కాశ్మీరంనుంచి ఉపసంహరించుకోవాలో తీర్మానంలో చేసిన స్థూలనిర్ణయాలు ప్రాతిపదికగా శాశ్వతశాంతిసంధి చేసుకోవాలి. 3. సైన్యాల ఉపసంహారణఅనంతరం కాశ్మీర్ సంస్థానంలో శాంతి ఏర్పడినప్పుడు జనవాక్యనిర్ధారణద్వారా సంస్థానం పాకిస్తాన్లో చేరుతుందో భారతదేశంలో చేరుతుందో నిర్ణయించాలి.

ఈమూడు ఒకదాని తరవాత ఒకటి ఆచరణలో పెట్టవలసినవి. 1949 జూన్ 1 తో యుద్ధం నిలిపివేయబడింది. తరవాత కాశ్మీర్ కమిషన్ సహాయంతో ఎవరెవరిసైన్యా లెక్కడ నిలవరించాలో ఒప్పందం కుదిరింది.

ఇంక ఆజాద్ సైన్యాలను నిరాయుధం చేసేవిషయంలోనూ, పాకిస్తాన్ భారత సైన్యాల ఉపసంహారణవిషయంలోనూ, ఉత్తరాన పర్వతమయప్రాంత పరిపాలనవిషయంలోనూ సమాధానం కుదరలేదు. మధ్యవర్తిత్వం వహించిన కమిషన్ తమ ప్రయత్నాలు వ్యర్థమైనవని తలిచి పరిష్కర్తద్వారా పరిష్కరించుకోవాలని ప్రతిపాదించింది. దీనికి భారత ప్రభుత్వం సమ్మతించలేదు. అదీకాక పరిష్కర్తనియామకం కమిషన్కు సంబంధించిన విషయం కాదు. భద్రతామండలితీర్మానం ప్రకారం అటువంటి సూచన చెయ్యడానికి కమిషన్కు అధికారం లేదు.

కమిషన్ తమ వ్యర్థయత్నాలను భద్రతామండలికి నివేదిస్తూ, పై మూడుసమస్యలనూ పరిష్కరించడానికి ఒక వ్యక్తిని మధ్యవర్తిగా నియమించి, ఆ మధ్యవర్తికి తుదినిర్ణయాలు చెయ్యగల అధికారమివ్వాలని (అనగా పరిష్కర్తకు ఇవ్వబడే అధికారాలు) నివేదికలో సూచించింది.

ఇదంతా చూస్తే మొదటినుంచీ కమిషన్ తప్పుదోవలోనే ఉన్నట్లు స్పష్టపడుతోంది. మధ్యవర్తిని నియమించాలని చెప్తూ, వానికి పరిష్కారాధికారాలు ఇవ్వాలని సూచించడం విపరీతం. ఇది కేవలం అటు పాకిస్తాన్నూ, ఇటు భారతప్రభుత్వాన్నీ తృప్తిపరచడానికి. పదాలతో ఇంద్రజాలం చేస్తున్నట్లుంది. కాని ఈ రీతిగా ఉభయులికీ తృప్తికాని సూచనలు చేస్తే ఎన్నటికీ సమస్య పరిష్కారం కాదు. ఇదివరలో కూడా కమిషన్ మధ్యవర్తిత్వవ్యవహారాలలో ఈరీతిగా ప్రవర్తించినందువల్లనే కమిషన్ మధ్యవర్తిత్వం విఫలమయింది. ఆజాద్ సైన్యాలను గురించీ, సైన్యాల ఉపసంహారణగురించీ, ఉత్తరప్రాంతాల పరిపాలనగురించీ ఉభయుల్నీ తృప్తిపరచాలనే ఉద్దేశంతో ఎవరికి అనుకూలమైనట్లు వారికి చెప్తూవచ్చినందువల్లనే ఈసమస్యలు పరిష్కారం కాలేదు. 1948 ఆగస్టుతీర్మానంలో ఆజాద్ సైన్యాలను

(21 వ పేజీ చూడుడు)

సోవియట్ విజ్ఞానము - ఆసియా విజ్ఞానమా?

శ్రీ టి. దేవరాజసుధీమణి

చాలామంది పాశ్చాత్యరచయితలు సోవియట్ విజ్ఞానము ఆసియా విజ్ఞానమేనని చెప్తుతారు. కాని ఇది పూర్తిగా పొరపాటు. సోవియట్ విజ్ఞానము ఐరోపా రాజకీయ విజ్ఞాన, అనుభవాలవల్ల వచ్చినదే. ఎంత మాత్రమూ ఆసియాదని చెప్పటానికి ఆధారాలు లేవు.

ఇక్కడ ప్రధానవిషయమేమిటంటే మార్క్సిజం సంపూర్ణంగా యూరపులో పుట్టింది. రష్యాకమ్యూనిజంకూడా మార్క్సిస్టు దృక్పథంతో కూడిందికాబట్టి పూర్తిగా యూరపియను అయితే మనకు ఇక్కడ రెండు సందేహాలు లేకెత్తుతయి. మార్క్సిజం యూరపియనా? రష్యనుకమ్యూనిజం సర్వసంపూర్ణంగా మార్క్సిజమా?

మార్క్సు యూరపుదేశీయుడు. అందులో సందేహమేమీ లేదు. పైపెచ్చు ఇంకా ఇతర దేశస్థులచేతగూడా మార్క్సు సహాయంచేయబడ్డాడనటానికి ఆస్కారం లేదు. మార్క్సు భావనను ఒకదృష్టిలో చూస్తే మార్క్సు పౌరయ్యోడని చెప్పక తప్పదు.

మార్క్సు, తరువాత మార్క్సిస్టులుగూడా రెండు వైరుధ్యసిద్ధాంతాలను ప్రచారంచేస్తున్నట్టు తెలిసికోవడం చాల ప్రధానం. అంతే లాక్ వాళ్లు, లిబరల్స్‌నుండి, జాకోబిన్సునుండి, ఫిలసాఫికల్ రాడికల్స్‌నుంచి దిగివచ్చినవాళ్లు. అంటే పైవారి శిష్యగణము. స్వేచ్ఛ, సమానత్వం, మానవహక్కులు కావాలని చాటుతారు. పైపెచ్చు వాటిని ఆర్థికవిషయాలలో ముడిపెట్టి రాజ్యాంగం వికేంద్రీకరణ కావాలంటారు. వీరి అనుచరులు రాజును, మతగురువును రాజ్యాంగాన్నుండి తొలగించారు. ఆ నిరంకుశుని చంపటం మూలంగా సర్వమానవస్వేచ్ఛను సముపార్జించటం పూర్తిఅయిపోయింది. మానవుడే అన్ని విషయాలకు అధినేతగా వున్నాడు. మానవీలువలు ఉత్తమోత్తమం. ఇక స్వాభావికంగా వూహించే దేమిటంటే అనభ్యనకవేద్యమైన స్వాతంత్ర్యము.

మార్క్సిస్టులు చెప్పే సిద్ధాంతంలో మానవునికి ప్రముఖస్థానం లేదు. ఏమాత్రం ప్రాధాన్యతను మానవునకివ్వ లేదు. భౌతికపరమాణువులు మూలంగాగల పరిణామసిద్ధాంతానికి ప్రాధాన్యత నిచ్చారు. ఇక్కడకూడా మానవుడు పరమాణువుల ఫలితమే. మానవుడు అంతర్లీనమైయుంటున్నాడు. అతని విధి పనిని నిమిత్తమాత్రుడుగా నిర్వహించటం విలువను పనిలో గుర్తిస్తున్నారు కాని మానవునిలో గుర్తించటం లేదు.

మార్క్సు చెప్పిన రెండు సిద్ధాంతాలకు ప్రధానవిషయాల్లోనే భేదాలున్నవి. మొదటిది అనాదినుంచీ, అంటే గ్రీకుల కాలంనుండీ యూరపుయొక్క విజ్ఞానంగానే పరిగణించబడుతుంది. మానవుని ప్రత్యేకవిశిష్టతయే ఆ సిద్ధాంతాల మూలాధారము. మానవుడు ప్రకృతినుంచి వుద్భవించినవాడయ్యు గూడా ప్రకృతి కతీతుడు. అతడు శాసించబడడు, అతడు శాసిస్తాడు. అతడు స్వతంత్రుడు. ప్రకృతిని తన అవసరాలకు వినియోగించుకోగలడు. అతడు ఒక ఆశయానికి పాటుపడే పనిలో నిమిత్తమాత్రుడు కాడు. అందులో అతనికి భాగముంది. ఈరకమైన అభిప్రాయాలకు ప్రధానసూత్రం అన్నిటికీ మానవుడే మూలం. రెండవ సిద్ధాంతం అణువాదం. ఈ వాదం మానవుని కట్టి ప్రత్యేకవిశిష్టతనూ కూర్చదు. ప్రత్యేకవిలువ నివ్వదు. అతని స్వతంత్రతను గుర్తించదు. ఈ విపరీతభావన నెగ్గటానికి వీల్లేదు.

ఈ రెండో సిద్ధాంతంగూడా ఐరోపాకు సంబంధించిందే. ఈ భావన హెగెల్‌నుంచి మార్క్సులోకి వచ్చింది. లాక్, బెంథమ్‌లకంటె గూడా యిది హిందూవిజ్ఞానాన్ని పోలి కనపడుతుంది. మార్క్సుయొక్క యీ భావనను యూరపియను కాదనటానికి వీల్లేదు. కాని యూరపియనుమాత్రం తన విజ్ఞానానికి ప్రధానమైనది అని అనుకోనేదానికంటె చాలా భిన్నంగా వుంది ఇది ఏదో 'విదేశీయము' అనుకొంటాడు.

రష్యావిప్లవంనాటివరకూ మార్క్సిస్టులు మార్క్సు ప్రచారంచేసిన ఈ రెండు వైరుధ్యసిద్ధాంతాలనూ అంగీకరిస్తూ స్వేచ్ఛాభావనను ప్రత్యేకంగా గుర్తిస్తుండేవారు. విప్లవం జరిగిపోయినతరువాత కథ అడ్డంతిరిగింది. మార్క్సిజంలోని స్వేచ్ఛాభావన అదృశ్యం చేయబడింది. అణుసిద్ధాంతాన్ని సరైనదానిగా అంగీకరించారు. కాబట్టి స్పష్టంగా రష్యనుకమ్యూనిజం అణుదృష్టితో చూస్తుందని తేలిపోయింది. పాశ్చాత్యులు దీనిని విదేశీయంగా అంటే ఆసియాకు సంబధించినదానిగా భావిస్తారు. కాని అలా భావించడంలో వారికి చారిత్రకబలం లేదు.

రష్యనుకమ్యూనిజం మార్క్సిజంమాత్రమేనా? అణుదృష్టిలోమాత్రం తప్పకుండా యిది మార్క్సిస్టుసిద్ధాంతమే. ఈవిషయంలోగూడా రష్యనులు తమ స్వవ్యాఖ్యానాన్ని జోడించారని నమ్మే మార్క్సిస్టులుగూడా చాలామంది వున్నారు. రష్యాయొక్క యీ నూతనపంథా సిద్ధాంతరీత్యా కొద్దిభేదంగా కనపడినా తత్త్వరీత్యా గొప్ప భేదాన్ని రూపిస్తుంది. పాశ్చాత్యులు దీన్ని ఇంకా విదేశీయ మనుకొంటారు.

బర్డియావ్ తనదేశీయులయొక్క సిద్ధాంతదృష్టి యీ విషయంలో పాశ్చాత్యుల దృష్టికి వేరవుతుందనీ తాము సిద్ధాంతాన్ని పరిశీలనచూస్తామనీ చెపుతాడు. పాశ్చాత్యులు సామాన్యంగా చూస్తారు. వాటితోటే సర్వానికి ముడిపెడతారు. కాని సందేహాలు వస్తూనేవుంటయి. "ఇది సిద్ధాంతంమాత్రమే" ఇది ఏనాడో ఒకరోజు భగ్నమై పనికిరానిదైపోతూందని దాట్లువేసికొనిపోతూంటారు. రష్యనులు సిద్ధాంతాన్ని నమ్మికూర్చుంటారు. పశ్చిమదేశాల్లోని శాస్త్రీయవిజయం రష్యాలో ఒక క్రొత్తమతమై కూర్చుంటుంది.

మార్క్సుకు లెనిన్‌కు తేడా స్పష్టంగా కన్పిస్తుంది. మార్క్సు డైలెక్టికల్ మెటీరియలిస్టు కాస్మాలజీని చూపెట్టాడు. అందుకు గర్వపడేవాడు కూడాను. కొన్నికొన్ని సమయాల్లో మార్క్సుకు తన సిద్ధాంతంపై అనుమానం కూడా కలుగుతూండేది. శాస్త్రీయంగా యోచించేవాడు. లెనిన్ దాన్ని ఒక మతంగా చేశాడు. అదే రష్యనుకమ్యూనిస్టుపంథా.

బర్డియావ్ రష్యకు మనస్తత్వంయొక్క ఇంకో ప్రత్యేకతనుగూడా చెప్పాడు ప్రపంచాన్ని ఖాతాజెట్టి గెలవాలని చూస్తారని. ఈవిధమైనటువంటి ఆశ అసాధారణమైనది కాకపోయినప్పటికీ ఇతరులకుకంటె యీవిషయంలో రష్యనులకే యెక్కువ అని బర్డియావ్ తలపోసాడు. రష్యాలోవలె మార్క్సిస్టువిప్లవం యే యూరపుదేశంలోనైనా వచ్చియుండినట్లయితే, ఆ దేశం రష్యావలె కోమిన్‌టరన్ సంస్థాపించిగాని, లేక తనచుట్టుప్రక్కల నున్న దేశాలు ఆయిష్టతను చూపుతున్నా బలవంతంగా పోషలిస్టు ఫలితాలను వాటికేసి రుద్దిగాని వుండటం అనుమానాస్పదం.

ఈ పద్ధతి యితరదేశాల్లో చూస్తున్న నిరంకుశత్వంకంటె ఇంకేదో భేదంగా కనపడుతుంది. యూరపియనులు దీనిని నిశ్చితంగా విదేశీయమని భావిస్తారు.

జర్మనుసోషలిస్టు యఫ్. బోర్క్‌నవ్ (ఇంతకుముందు కమ్యూనిస్టు) చేసిన ప్రయత్నం గూడా రష్యనుదృక్పథానికి యూరపుదృక్పథానికి భేదముందని ఋజువుచేస్తుంది. సంస్కృతులు ఎప్పుడూ మారుతూంటయి. కాని ఇక్కడ యూరపువిజ్ఞానంలోకి దిగుమతి జరిగింది.

కస్తూరిరంగని పదములు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

లక్షణకవి కస్తూరిరంగకవి లక్షణచూడామణియనబరగు ఆనందరంగచ్ఛందమును, సాంబనిఘంటువును, కృష్ణార్జునసంవాదమును రచించుటమాత్రమే గాక కొంత పదరచనమును చేసినాడు. పదునెనిమిదవ శతాబ్దారంభమున పుదుచ్చేరిలో ఫ్రెంచిరాజప్రతినిధిగా నుండిన డూప్లే దొరగారి విజయములనుగూర్చియు, పయి డూప్లేదొరగారి యాస్థానిలో 'దుబాసి'గా నుండిన ఆనందరంగని విజయములనుగూర్చియు నితడు గేయముల రచించినట్లు తెలియుచున్నది. డూప్లేదొరగారి యాస్థానిలో ప్రసిద్ధగాయకు లాగేయములను బాడుచుండిరట! ఈవిషయము 'ఆనందరంగపిళ్లడైరీ' యందు పేర్కొనబడినట్లు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము డిస్క్రిప్టివు కేటలాగులో నిట్లు పేర్కొనబడినది.

'ఆనందరంగని విజయములగూర్చియు, డూప్లే విజయములనుగూర్చియు వ్రాసిన గేయములు (ఫ్రెంచిరాజప్రతినిధిగా బుదుచ్చేరిలో వసించిన) పై డూప్లే దొరగారి యాస్థానిలో ప్రసిద్ధగాయకులచే బాడబడెనని 'ఆనందరంగపిళ్లడైరీ' అను గ్రంథమునుండి తెలియవచ్చుచున్నది.'

కస్తూరిరంగకవి వాఙ్మయశాఖలయందన్నిటను దనకు సముచితస్థానము సంపాదించుకొనుతలపున గాబోలు కృష్ణార్జునసంవాదమనెడి ప్రబంధమును, లక్షణచూడామణి యను లక్షణగ్రంథమును, సాంబనిఘంటువును రచించినట్లు తెలియుచున్నది. పదరచనము గూడ గావించి యితడు పదరచయితలయందును ప్రఖ్యాతి వడసినాడు.

ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములో 'కస్తూరిరంగని పదములు' అనుపేర నీ శృంగార పదములు కొనవచ్చుచున్నవి. ఇవి పవరని భాషతో చక్కని రచనముతో ముద్దులొలుకుచున్నది.

ఎరుకల కాంభోజి

అలుకలే కాని వేడుకలు చెల్లకపోయె
నాసించినందు కొకసారి
కలికిరో నాపాలి కస్తూరిరంగపతి
గడిదేరనే మేర మీరె- ఓచెలియ॥
ఎన్నటికి నా ప్రాణనాథు డితడే యనుచు
నెంచినందుకు ఫలము వచ్చె
వన్నె కానికి మేలుబడినందుకిపుడు నా
వలపు నన్నింటికి దెచ్చె
కొన్ని దినములకైన గుణము కల్గునో యనిన
గోప మంతింతకును హెచ్చె - వాని
యెన్నికలు నూచి మన కెల నని యుండితే
నిల్లిల్లు తా దిరుగజొచ్చె-ఓచెలియ. అ॥
నెల కొక్కసారి యేమరియైన నిటు వచ్చి
చెలిమి చేసేది లేదాయె - ఆ
యెలనాగభోగములచే నేర్చుకున్నాడె
యెచ్చటను లేని మటుమాయ - నా
వలపు లంగడి బెట్టివచ్చె నింతేకాని
వాని కేమది నెనరుసేయ
తెలిసి తెలియని జాడ నుండి మన కెల నని
మెలగుచున్నాడె యీ చాయ-ఓచెలియ.
ఇందటిలో మేటియైయున్న నాబోటికా
యిటువంటి కొదువ ఓచానా!
యిందుబింబాననకు నా వెతలు జూచితే
మది నెఱుక లేదాయె యింతైన
అందతికి వారివా రక్కఱలె గాని మీ
దయ్యేది తెలియ దింకన
నన్నింత దనసినట్టి కస్తూరిరంగేశు.....!
డి క్లేచి కెనోకరి నన నాన - ఓచెలియ.

సురటి - త్రిపుట

ఇందాక వచ్చితిరా యులదానిల్లు
ఈవీధి గాదు పోపోరా
సుందరగిరిధరుడైన యీ కస్తూరిరంగ
సుందరదనను మదిగోరి యిందు వచ్చితివో॥ఇ॥
ఎన్నైన వెన్నెలలో నిల్లు ఎఱుగక నీవు
మచ్చికంటివి దగిలి మైమఱచితివో
ముచ్చికతోడుత మనసు చల్లగ జేసి
గ్రుచ్చి కౌగిలించిన కోమలి నే గాన. 1
నడిరేయి జాము వేళ వాలి నీవును గూడి
నడచుకొన్న చిన్నెలు తెలిసెరా జాణ!
వడివడిగా వీథిలో వగలుసేయుచు రవిక
ముడి విడువవచ్చేవు ముచ్చువానివలెనె 2
మదనలాహిరి మించి మదహస్తివలె జా-
చెదవు కస్తూరిరంగ! చెయి బట్టకురా
మదనకేళిని గూడి మమత రెట్టించెదవు
ఈ దయమానాను వేఱయు విచె దురుజూచిని

ముఖారిరాగము

ఆవల వాడొక తను వాపించెనంటెనె
వాని బిలుతునవె ||ప||
కావలసితె వచ్చిని కస్తూరిరంగడు ||అ||
మాటపట్టు మీఱినంట మనవిగా వేడుకొంట
నేటివరకు మాయింట నెనరుతోడను
నీటుగా దుండలేదా నీ మనసున లేదో
పోటి జేసి నే డింత కోటిధన మొసంగిన 1
వారి వారి మాట విని వాడిందు రానని
ఓరచేసుక యుంటె సారెసారెకు
చేరి నే బిలువబోతే సిగ్గు లేదా దక్కనే
యూరొల్ల నెఱిగియున్న నన్ను కాదను 2
గడియసేపు చాల పోరి కస్తూరిరంగ డీసారి
దుడుకున నను గూడి దొరకితివోను
బడలితి విక చాలు విడిదికి జొమ్మని
అడుగుబాసినవెనుక నక్కఱ దీరెనంటె 3

కాంభోజి

వల పంటేనే సామాన్యమా-కస్తూరిరంగ
కలిమి కలిగుండవలె-నిండుజాణైన
చెలికాడొక్కడుండవలె-ఇంటివారిచే
నలి తిండి లేకుండ నుండవలె-మన యిద్దఱి
తలపు చేకూడుండవలె-ఓ చెలియరో 1
ఈ రొక్కమై యుండవలె-అదియు గాక
తీ రొక్కమై యుండవలె-తలవాకిలి
సారె కెదురై యుండవలె-సరివారిలోను
ఆరు దూరు లేకుండ-కస్తూరిరంగ 2
అంతరంగమై యుండవలె-మనవశాస్త్ర
మంతయు నేర్చియుండవలె-మనసు లేకమై
సంతోసాన నుండవలె-శేషశాయికృపను
కంతుకేళి కూడుండవలె-ఏపనికైన
పంతమాడిన ట్లుండవలె-కస్తూరిరంగ 3

డూప్లేదొరగారి విజయములనుగూర్చియు, నానందరంగని విజయములనుగూర్చియు నీతడు రచించిన గేయములు దొరకవలసియున్నవి. లక్షణకవులు, ప్రబంధకవులు, నీ పదరచనము నాదరించుచుండిరనుటకు లక్షణకవికస్తూరిరంగకవి, విరచితములగు నీ పదములే సాక్ష్యము పలుకుచున్నవి. వినోదముతోబాటు విజ్ఞానమును గలిగించుచు ప్రజాసామాన్యమునకు సాహిత్యాభిరుచిని, కళాభిజ్ఞతను బెంపొందించు నీ పదకవిత్వమునకు, పదకవులకు నేటిదనుక సాహిత్యములో సముచితస్థానము లభింపకుండుట శోచనీయము.

ఆంధ్రసాహిత్యములో పదరచనమునకు పేదతనము లేదు. సుప్రసిద్ధములగు తాళ్లపాకవారి పదములు, క్షేత్రయపదములు, సారంగపాణిపదములే కాక ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములో కచ్చియురంగనిపదములు, శివరామపురమయ్యవారి పదములు, శోభనగిరివారి పదములు, తిరుమలపురివారిపదములు, కువ్వముసామిపదములు వృద్ధకాశివారి పదములు, విజయరంగ చొక్కనాథుని పదములు, మన్నారురంగని పదములు, పాలెమురంగని పదములు, మద్దురంగని పదము, నారసింహుని పదము, ఆరణి తిరువెంగళప్పయ్య పదము, ఉదయాద్రివారిపదములు, సౌంధరేశ్వరుని పదములు, గోపాలునిపదములు, మధురపాక ముద్దుచెన్నకౌరి పదములు, వీరరాఘవుని పదములు,

కథానిక:

మొదటి నెల జీతం

"జాస్మిన్"

ఆశ్చర్యం! ఈరోజుల్లో ప్రతి చిన్న పిల్లడూ స్కూల్ ఫైనల్ పాసవుతున్నాడు. పన్నెండో యేటే ఇంటర్మీడియట్ చదువుతున్నవాళ్లున్నారు. పూర్వం పన్నెండేళ్ళ కొడుకులున్న పెద్దమనుష్యులు ఇంకా మెట్రిక్ లేకపోయేవారు. మొగవాళ్లేకాదు చిన్న చిన్న ఆడపిల్లలు కూడా పెద్దపెద్ద చదువులు చదువుతున్నారు. అధమం మెట్రిక్యులేషనైనా పాసవని పెళ్లికూతురు కనిపించ దెక్కడా. గొప్పవాళ్లలో ఆ మాత్రం చదువులేని ఆడపిల్లకి పెళ్ళి కానేకాదు.

ఇలాగ అతిసులభంగా అందరూ విద్యాపారంగతులవడం చూసి, జాతిలో తెలివితేటలు అభివృద్ధి చెందుతున్నాయని కొందరంటున్నారు. చాలామంది ఒప్పుకుంటున్నారు. కాని రామయ్యని చూస్తే మనుష్యజాతియొక్క మేధాశక్తి నిజంగా పురోభివృద్ధి చెందుతూందని ఎవరూ అనుకోరు. రామయ్యకున్న తెలివితేటలే ఆధారంగా తీసికుంటే మానవజాతి శిలాయుగందాటి ఏ రెండడుగులో, మహా అయితే మూడు తప్పటడుగులో వేసి ఉంటుందనే అభిప్రాయం కలుగుతుంది.

రామయ్యకి చదువుచెప్పిన మాస్టర్లంతా, అతనికి 'తెలివి' అనే విలువైన వస్తువ భగవంతుడు ఏమరుపాటున ఇవ్వడం మర్చిపోయేడంటారు. అయితే జరిగినటువంటి ఈ పొరపాటుకి భగవంతుణ్ణి నిందించడానికి బదులు రామయ్యని చిన్నప్పట్నుంచీ ఇంట్లో పెద్దలూ, బడిలో పెద్దలూ అంతా నిందించడంతోచినప్పుడు తన్నడం కూడా జరిగించేవారు. ఈ నిందలూ, తన్నులూ భరించలేనప్పుడు తనని పుట్టించిన భగవంతుణ్ణి రామయ్య మాత్రం తిడుతూఉండేవాడు. అసాధారణ మేధాశక్తి ప్రసాదించనందుకు రామయ్య నిందించినప్పటికీ భగవంతు డతణ్ణి కఠినపరీక్ష చేసి మెట్రిక్యులేషన్ పాస్ చేయించాడు. దేముడిలా కఠినంగా పరీక్షించడంచేత రామయ్య మూడు సంవత్సరాలు స్కూలుఫైనల్ పరీక్షకి కూర్చొని మూడుసార్లూ తప్పేక మరి మూడు పర్యాయాలు మెట్రిక్యులేషన్ పరీక్షకి వెళ్లి ఆఖరిసంవత్సరం కాని కృతకృత్యుడు కాలేకపోయేడు. తెలివితేట లివ్వడం మర్చిపోయిన విధాత రామయ్యకి ఓర్పు పట్టుదలా కొంచెం హెచ్చుగానే వేసి ఇచ్చేడు. "మొండిముండాకొడుకు కెలాగయితేనేం, సాధించేడయ్యా" అని అందరిచేతా మెప్పుపొందేడు రామయ్య.

గజనీమహమ్మదు భారతదేశంపైకి చాలాసార్లు దండెత్తేడట. రామయ్య కూడా ఏదో ఓరకంగా దండయాత్రలు చెయ్యడంచేత అతణ్ణి గజనీతో పరిపోల్చుతారు కొంతమంది సరిపోల్చడం సమంజసంగానే ఉంది. కాని ప్రతి దండయాత్రకీ రామయ్య పడ్డంత శ్రమపడవలసి వుంటే ఏ రెండుమూడుసార్లకన్న గజనీమహమ్మదు భరతవర్షాన్ని బాధించి ఉండకపోవచ్చును. ఎన్నిశ్రమలకైనా ఓర్చి పరీక్ష నెగ్గిన రామయ్య ఈ విషయంలో గజనీకన్న గట్టివాడనే చెప్పాలి.

పోలిక లున్నప్పటికీ, దండయాత్రల ఫలితాల్లో గజనీమహమ్మదు విషయంలోనూ, రామయ్యవిషయంలోనూ గొప్ప తేడా ఒకటున్నాది. సమరయాత్ర సాగించి గజనీమహమ్మదు కోట్లకొద్దీ ధనం కొల్లగొట్టుకుపోయేవాడు. రామయ్యకేసులో దండయాత్రలకయేది ఖర్చే కాని వచ్చేఫలితం ఏమీ లేదు. ఒక్కొక్క యాత్ర చేసి గొప్పవాడయేడు మహమ్మద్ గజనీ; దండయాత్ర ఒక్కొక్కటీ చేసి బీదవాడయేడు రామయ్య.

అసలు డబ్బువిషయంలో రామయ్య ఎప్పుడూ గొప్పవాడు కాడు. ఎప్పుడూ బీదవాడయిన రామయ్యని దూరదూరంగా వున్న దరిద్రదేవత మెట్రిక్యులేషన్ పాసయేసరికి అమాంతంగా దగ్గరకొచ్చి కౌగలించుకుంది. ధనలక్ష్మి గాజుల గలగలారవమైనా ఎక్కడా వినిపించలేదు.

పరీక్ష పాసయేసరికి రామయ్య వయస్సు ప్రపంచంలో అందరితోపాటు ముదిరింది. అయితే సర్వీస్ కమిషన్ పరీక్షకి కూర్చోడానికి ఇంకా టైముంది కూర్చోమని కొంతమంది సలహా ఇచ్చేరు. పరీక్ష కూర్చుంటే మరింక పైకి ఎన్నటికీ వేలడని రామయ్యని బాగా ఎరిగినవాళ్లంతా తేల్చేరు.

"అయితే గుండె దిట్టంచేసుకుని మిలిట్రీలో చేర్రా అబ్బాయీ, అన్నివిధాలా బావుంటుంది" అని ఒహత నన్నాడు.

అవి యుద్ధపురోజులు. రామయ్యలాంటివాళ్లకి కూడా సైన్యంలో ప్రవేశంఉండే రోజులవి. "ఈసమయంలోనే వీడికి నాలుగురాళ్లు సంపాదించడాని కవకాశం" అనుకున్నాడు రామయ్యతండ్రి. ఇంట్లో పెద్దలంతా సరేనంటే సరేనన్నారు. రామయ్య పెద్దల ఆశీర్వచనాలతో మిలిటరీజీవితానికి ప్రయాణంకట్టేడు.

ఇంట్లో ఉన్న పెద్దలంతా ఏడుగురు. 1. తల్లి. 2. తండ్రి 3 నాయనమ్మ. 4 పూర్వం సువాసనతో ఉండే అక్క. 5. ప్రస్తుతం సువాసన గలిగిన అక్క. 6. పెద్దన్న. 7. చిన్నన్న. రామయ్య భారతసేనాబలానికి తన బలం చేర్చడానికి వెళ్లిన మర్నాడు రాత్రి భోజనాలయేక, వాకట్లో, వెన్నెల్లో, కుక్కిమంచాలు వేసుకూర్చుని, పడుక్కుని, చేర్లబడి రామయ్యభావి ధనలాభంగురించి మాట్లాడుకుంటున్నారు. ధనలాభంగురించి మాట్లాడేటప్పుడుండే సహజమైన ఉత్సాహం ప్రస్తుతపు సంభాషణలో హెచ్చుగా ఉన్నాది.

"తిండీ బట్టా పోను నెలకీ అరవైరూపాయి లిస్తారండీ వీడికి. డంగ్ సొమ్ము! అందులోనూ మన రామయ్య తెలివితేటలు చూసి. భగవంతుడి దయవల్ల ఏదో నాలుగురాళ్లు సంపాదించుకుని బైటపడితే, ఆ మీదట మళ్ళీ ఉద్యోగం గవర్నమెంటు వాళ్లే వెదికి ఇప్పిస్తారట" అన్నాడు తండ్రి.

"అయితే జీతం అందగానే ఏమైనా ఇంటికి పమ్మించమని చెప్పేవా?" అనడిగిందినాయనమ్మ.

"చెప్పనూ. మొదటి నెలజీతం ఎలాగైనా పంపాలని గట్టిగా చెప్పేను. అటు తరవాత నెలల్లో కావాల్సొస్తే వాడి కవుసరం అయేదుంచుకుని మిగతాది పంపొచ్చునని కూడా అన్నాను. వాడికిమాత్రం తెలియదా ఏమిటి, ఇక్కడ బోలెడు ఖర్చులున్నాయని"

పాపం చదువులో అంటే అట్టే అదృష్టం లేకపోయింది కాని మిగతావిషయాలన్నీ వాడికి తెలుసునమ్మా" అన్నాది తల్లి కొడుకు సుగుణాలు స్మరణకి తెచ్చుకుని.

"అయితే వచ్చే నెల అరవై రూపాయలందుతాయన్న మాట మనకి" అంది పునిస్త్రీ అక్క.

"అందుతే సొమ్ముకి తగ్గ ఖర్చు లేదూ? అరవై రూపాయలన్న మాటేమిటి. అరవై వేల రూపాయల ఖర్చుందనుకో" అన్నాడు తండ్రి, కూతురికేమీ అందులో భాగం అందదన్న భావం స్ఫురించేలాగ.

"ఎల్లుండి దీపావళికి మీ అల్లుడు కూడా వస్తారు కాబోలు. అన్ని ఖర్చుల్లోనూ ఇదో ఖర్చు" అన్నాది పునిస్త్రీ అక్క గడుసుగా.

ఇంతసేపూ పరధ్యానంగా ఉన్న చిన్నన్న హఠాత్తుగా అన్నాడు: "అయ్యో బావనిరమ్మని రాసిన ఉత్తరం పోస్టుచెయ్యడం మర్చిపోయెను. రేపు వేస్తే టైముకి అందుతుందో అందదో"

పునిస్త్రీ అక్క దీపావళినాడు పొందవలసిన దాంపత్యానుభవాలు దూరంగా పోయేయని బాధపడ్డాది మనసులో.

"టైము కందుతే పండుక్కి బావొస్తారని భయపడ్డావు కాబోలు" అన్నాది కోపంతో.

"బావ రాకపోయినా పంచెలచాపు కొని పంపిస్తాంలే" అన్నాడు పెద్దన్న.

"నువ్వు మహా కొనీసేవు, ఆయన కట్టుకున్నారు. నాకో చీరగుడ్డైనా కొనివ్వలేకపోయేవు నువ్వింతవరకూ. ఏమైనా ఇస్తే ఆ రామిగాడే ఇంకా ఇవ్వాలి"

"ఈనెల రామిగాడిజీతంలో ఏమీ కొనడానికి వీలుండద"న్నాడు తండ్రి. ఈ వాక్యంతో సంభాషణలో కొంత వేడి తగ్గినట్టయింది. అణా అరువుపెట్టి తెచ్చిన చుట్టల్లో ఒకటితీసి అంటించేడు తండ్రి.

"ఏం కొన్నా కొనకపోయినా వాడిది తాకట్టుపెట్టిన వెండిగిన్నె విడిపించకపోతే వీల్లేదండీ" అన్నాది తల్లి.

"చూద్దాం" అన్నాడు తండ్రి.

"అన్నట్టు కరణందగ్గర వేళ రూపాయి బదులు తెచ్చేను. ఇంకా ఇవ్వలేదే" అన్నాది పూర్వసువాసిని.

...య్యనలేదుగాని, నే నవేళ తెస్తే పాలమనిషి కిచ్చేవు"

"ఏ పాలమనిషి?"

"మన పాలమనిషి"

"నాకు జ్ఞాపకం లేదుస్మా"

"నువ్వు మర్చిపోతే కరణం మర్చిపోతాట్టే"

"కరణం అంటే జ్ఞాపకం ఒచ్చింది. వాడి తల్లి మొన్న కాశీ వెళ్ళొచ్చిందిరా" అన్నాది నాయనమ్మ.

"డబ్బుంటే ఏగంగలో కలవడానికైనా వెళ్ళొచ్చు" నన్నాడు పెద్దన్న.

"రామిగాడు సొమ్ము పంపిస్తే సింహాచలమైనా వెళ్ళిరావా" లన్నాది నాయనమ్మ.

"అక్కడంతా మిలిటరీవాళ్లున్నారు. ఇప్పుడు వెళ్ళడం మంచిది కాదు".

"ముసలిముండని నన్నేం చేస్తార్రా వాళ్లూ".

"నువ్వొక్కత్తెవే వెళ్తావా ఏమిటి, నేను మాత్రం రానూ" అన్నాది భర్తృవియోగిని.

"అన్నట్టు సింహాచలంలో చంటివాడికి పుట్టుజుత్తులు తీయించాలి" అన్నాది పునిస్త్రీ అక్క.

"ఏడాది నిండలేదుకదూ వాడికి. ఇంకా చాలా టైముంది. తీయించడానికి" అన్నారొకరు.

"పుట్టుజుత్తులు పోతే పోయిరి. నాకో గుడ్డముక్కైనా కొనివ్వవుట్రా" అని నాయనమ్మ మనుమడితండ్రి నడిగింది.

పూర్వసువాసిని అందుకుంది. "రెండేళ్ళ క్రిందట కామోసు నాకీ సైనుపంచ కొన్నారు. ఎలా పేలిక లయిపోతోందో చూడు."

"మీ కేం కట్టుకున్నా ఎవడూ అడిగేవాడుండడు. నా చీరెలా ఉందో చూడండి అలుగుడ్డలాగ" అంటూ వెన్నెల వెలుగులో చీరని సభాసదులకి చూపించింది పునిస్త్రీ అక్క.

"నీ కేమే నెల కోచీర కొంటూనే ఉంటాడు నీమొగుడు చక్కా. నా కెవడిస్తాడు. ఆ రామిగాడేమైనా కొంటే కట్టుకోవాలి. లేకపోతే ఇహ నిలా ఉండవలసిందే" అని భర్తృవిహీనురాలు ముందుకి వస్త్రవిహీనురాలుగాకూడా ఉండవలసివస్తుందని వాపోయింది.

"ఫస్టుతారీకు రానీయండి. అన్నీ చూసుకుందాం" అన్నాడు తండ్రి కళ్లుమూసుకు పడుక్కుంటూ.

ఫస్టుతారీకు రాకుండానే విశాఖపట్నం నుంచి రామయ్య ఉత్తరం రాసేడు.

"ఇక్కడ మెడికల్ పరీక్ష చేసి నేను మిలిటరీకి పనికిరానన్నారు. అందుచేత ఈ వూళ్లోనే వేరే ఏమైనా చూసుకోవాలి. ప్రస్తుతం నాదగ్గిర దమ్మిడీ లేదు. ఈ ఉత్తరమే టెలిగ్రాంగా భావించి నాకు వెంటనే అధమం పాతిక రూపాయిలైనా పంపగోరుతున్నాను".


ఆవేళ పొరుగింటివాళ్ళతో నాయనమ్మ చెప్పింది.


"మా మనవడికి అక్కడేదో పరీక్ష చేసేరటమ్మా. అదేం కర్మమో. పరీక్షల్లో ఎప్పుడూ వాడు తప్పడమే. నష్టజాతకానికిమన వేంచేస్తాం"




స్థానికసంస్థల మంత్రి గా॥ కల్లూరి చంద్రమౌళిగారిని తెనాలి పురపాలకసంఘం సన్మానించినప్పటి దృశ్యం. మంత్రిగారికి కుడివైపున చైర్మన్ నన్నపనేని వెంకటరావు, ఎడమవైపున తెనాలిడిప్యూటి కలెక్టరు జి. రామమూర్తి పంతులుగార్లు గలరు.

బసవశంకరుని పదములు, తిరుక్కోవులూరిపదములు, చంద్రశేఖరునిపదములు, శోభనగిరివారిపదము (అచ్చవెల్లివారిపదము, వరహానిపదము, తిరుక్కణమంగవారిపదము, ఉమామహేశ్వరుని పదము, కల్యాణవరదునిపదము, అరియపురి కోదండరాముని పదము. కరిగిరివరదుని పదము, తొరయూరిమదనగోపాలపదము, సహదేవపురివారిపదము, ఏకామ్రపతిపదము, ప్రసన్నగుడియాతిపు చెన్నుని పదము, దామెర ముద్దువెంకటభూపాలుని పదములు కలవు. ప్రాచీనకాలమున ప్రజాసామాన్యము పదరచనములకు బ్రహ్మరథము పట్టుచుండి రనుటను ఈ పదరచనములు ధ్రువపఱచుచున్నవి. పురాతన పదరచయితలచే రచియింపబడి చెదరులు చెదరులుగా నున్న యీ పదరచనము లెల్ల నొక సంపుటముగా ముద్రింపదగినవి. ఈపదరచనములు ప్రజాసామాన్యమునకు విద్యావినోదముతో సాహిత్యాభిరుచిని, కళాభిజ్ఞతను గలిగించుచు ననితరానందసంపాదకములయి నిత్యనవీనములయి నెగడుచున్నవి.
















దనపల్లె సమీపముననున్న అంకిశెట్టిపల్లె గ్రామమున, కస్తూరిబాగాంధి ట్రస్టు యాజమాన్యమున జరుపబడు బేసిక్ పాఠశాల నూతన గృహప్రవేశ సందర్భపు ఛాయాచిత్రము.


వా
చిత్ర









మద్రాసులోని వివిధవిద్యా కేంద్రాలలో బేసిక్ విద్యా శిక్షణ



ఇండియా-అమెరికా మహాసభలో పాల్గొంటానికిగాను యీ నెల 11న ఢిల్లీకివచ్చిన 25 మంది అమెరికా ప్రతినిధులు రాజఘాటు దర్శించి మహాత్మగాంధీకి జోహారు లర్పించారు.



లేడీ ఇర్విన్ కళాశాలలో జరిగిన ఉభయప్రతినిధుల సమావేశములో భారతప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ఉపన్యసిస్తున్న దృశ్యం.



భారత రిపబ్లిక్ అధ్యక్షుని ప్రత్యేక కేతనం



"అనగా అనగా ఒక రాజు"

మూలం : రవీంద్రనాధ్ ఠాకూర్

అనువాదం: శ్రీ శేషగిరి

ఏడేండ్ల వయసుపైబడ్డ పిల్లలకు కథలు వినడం ఎక్కువ సరదా. అంచేత వాళ్ళు యింట్లో వున్న ఏఅమ్మమ్మనో, లేక ఏ తాతనో కథ చెప్పమనటం, వాళ్లు "అనగా అనగా ఒక రాజు" అని కథ ప్రారంభించటం మనం తరుచు వింటూన్నాం. మనం చిన్న పిల్లలుగా వున్నపుడు ఆరాజెవడో, అతడే వూర్లో వుంటూవుండేవాడో అనే ప్రసంగం మనల్ని బాధించేది కాదు. మన అంతరంగాలు ఆనందసాగరాల్లో తేలి, అమర గానాలు వింటున్నట్టుంటాయి. మన హృదయాలు నిజం తెల్సుకోవాలని నిలిచుంటాయిగాని అనవసరప్రసంగానికి అంగీకరించవు. వాటికి సత్యాపాద ఎచ్చట గలదో, అదెలా సంగ్రహించటమో, తెల్సు. అంచేత అవి కథాదే విని కౌగలించుకుంటాయి.

కాని నేటి ఆధునికయుగచదువరులు, పైవిధంగా ప్రారంభించటం వింటే, వారు విమర్శనాభావంతోనో,



అనుమానాస్పదంగానో కథకుని నొప్పిద్దామని చూస్తూవుంటారు. వారు పేజీ ఆకొలది కథ పెంచుదామన్నా, చివరకు "ఒకరాజు కల" నన్నమాట సత్యం.

కథ మొదలిడినరోజు నాకు బాగా జ్ఞాపకం. పగలంతా వర్షం పడుతూ వుంది. ఆకాశమంతా ధారాధరాలతో నిండివుంది. మిన్నూ, మన్నూ ఏకమైనట్లు వర్షం పడుతూవుంది. కలకత్తా నగరంలో పాదం మునిగేవర్షం పడింది. నేను వరండాలో ఒకబల్లమీద కూర్చుని వర్షాగమం పరికిస్తూన్నాను. నా హృదయకుహరంలో ఆలోచనలు వాయువేగంతో ప్రసరిస్తూన్నాయి. వర్షాగమం వర్ధిలుతున్నకొలది, నేను నాశక్తికొలది "ఓ దేవా! ఏడున్నరగంటల కాలంవరకు ఈవర్షం కురిపింపుము" అని ప్రార్థిస్తూవున్నా. ఏడున్నర దాటితే మా గురువుగారు, నాకు పాఠం చెప్పడానికి రారని నా ఆలోచన.

తా నొకటి తలిస్తే దేవు డొకటి తలుస్తా డన్నసామెత నాకు అనువైంది. ఒక ఘడియకల్లా వర్షంపడటం ఆగిపోయింది. మఱియొక నిముషానికల్లా మా వీధివంపులో నా గురువుగారి గొడుగు చూచాను. నా అంతరంగంలోని ఆలోచనలల్లా ఒక్కసారి భగ్గుమన్నాయి. జన్మాంతరంలో నేను గురువుగారినై, 'మా గురువుగారు నావలె విద్యార్థయితే, వారికి తగిన శిక్ష యిస్తా' ననిపించింది నాకు.

నా గురువుగారి గొడుగును చూచిన వెంటనే, నేను మా అమ్మదగ్గిరకి పరుగెత్తిపోయాను. అప్పుడు మా అమ్మ, అమ్మమ్మ పేకాటలో నిమగ్నులైయున్నారు. మా అమ్మదగ్గరనే వున్న ఒక్కపరుపుపై పడుకుని మాఅమ్మతో "అమ్మా తల నొప్పిగా వుంది. నా గురువుగా రొచ్చేరు. నేను ఈరోజు పాఠానికి వెళ్ళలే" నన్నాను. పేకాటఆలోచనలో వున్న మా అమ్మ అంతగా ఆలోచింపక అలాగే అని ఒప్పుకుని ఒక దాసీని చూచి "గురువుగారిని యీరోజున యింటికి వెళ్ళమను" అంది. నా అన్నతఫలం లభించిందని సంతోషంతో నా తల తలగడాక్రింద దాచి, నా నోరార నవ్వాను. కాని దొంగితలనొప్పి ఎంత కాలం దాచుకోగలను. కొంతకాలానికి లేచా. మా అమ్మమ్మదరికి చేరా. వెంటనే కథచెప్పమని ఆమెను బలవంత పెట్టసాగాను. మా అమ్మ ఎంత చెప్పినా వినక, మళ్ళామళ్ళా కథ చెప్పమని అడగసాగాను. మా అమ్మ విసిగి పేక క్రింద విసరి, మా అమ్మమ్మతో నాయిష్టప్రకారం చేయమని పల్కి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళినవెంటనే మా అమ్మమ్మను మంచంమీదకు తీసుకుపోయి కథ చెప్పమని కోరాను. మా అమ్మమ్మ చెపుతూవుంది.

"ఆ రాజుకు ఒక రాణి" అంది. అది వినగానే నా మానసంలో ఒకమారు క్రొత్తభావనలు రేకెత్తేయి. మనం కాశీమజిలీకథల్లో రాజులకు యిద్దరు రాణు లుండం, అందులో ఒక యువతి అసౌఖ్యంగా వుండటం వింటూవున్నాం. కాని మా అమ్మమ్మకథలో అటువంటి విఘాతం ఏం లేదు.

"ఆరాజులకు పుత్రసంతానం లేదు" అని వినగానే అది నన్నే అంత కలత పెట్టలేదు ఏమంటే "ఎద్దుకేం తెల్సును అటుకుల రుచి."

ఆరాజు పుత్రసంతానం పొందటం కోసం అడవికిపోయేడు. అపు డతనికి ఒక కుమార్తె వుంది. ఆరాజు ఆడవిలో తపస్సుచేస్తూ, పన్నిండేళ్లు గడిపేడు. తనకు కుమార్తె గలదన్నమాటే మర్చిపోయాడు. ఈలోగా, ఈ రాకుమారికి యుక్తవయస్సు వచ్చింది. వివాహకాలంకూడ అతిక్రమించింది. పాపం! రాణి ఏం చెయ్యగలదు.

ఏలా అయితేనేం ఒకనాడు రాజుకు, ఒక రాత్రికి యింటికి దయచేయ మని ప్రార్థిస్తూ, వర్తమానం పంపింది. రా జందు కంగీకరించేడు.

అతిజాగరూకతతో, స్వయంగా రాణి శాకపాకాలని తయారుచేసింది. రాజుకు చందనంపీట వేసి, బంగారపు పాత్రలో భోజనం పెట్టింది. రాకుమారి నెమలిపురితో తయారైన వింజామర గైకొని రాజు కొరకు ఎరురుచూస్తున్నారు. కొంతసేపటికి రాజు యింటిని ప్రవేశించేసరికి, తన అందంచే యిల్లంతా కాంతివంతంగా చేసే రాకుమారిని చూచాడు. భోజనముందు కూర్చున్నాడు. రాకుమారి వింజామరతో పిల్లవాయువుల్ని ప్రసరింపచేస్తూ వుంది. రాజు తన కుమార్తెముఖావలోకనం గావించి, తినడం మరచేడు. ఎట్టెటో మనసు మరల్చుకొని "నాకమ్మగేంద్రులమీద కయ్యమునకు కాలు సాచే యీయువతి ఎవ" రని భార్య నడిగేడు. ఆమె ఆక్రోశించుతూ "నాథా! యీమె మీ కుమార్తె. మరచిపోతిరా" అని పాదాక్రాంతు రాలయింది. రాజు కొంతసేపు భూతకాల పరిణామంలో బుద్ధి నిల్పే సరికి తన కుమార్తె జ్ఞప్తి కొచ్చింది. ఆమెకు యుక్తవయస్సు మీరి, తన ఎదుట దివ్యజ్యోతివలె కనిపిస్తూవుంది. వెంటనే భార్యతో "ఈమెకు వివాహం ఎంచేత చేయలే" దని అడిగాడు. రాణి నాథా! మీరు గహనాంతరవాసులైతిరి, నేను తగినవరుని ఎట్లా కన్నుగోగల నని బదులు పల్కింది. అంత రాజు సరే అని ఈవిధంగా ప్రతిజ్ఞ చేశాడు. "రేపటి వుదయం, నేను కోట దాటి వెళ్లిపోవునపుడు మొదట ఎవరినైతే చూస్తానో వాడే ఈమెభర్త" ఇలా అని భోజనంతినడం చాలించాడు.

తరువాత వుదయాన్నే రాజు లేచాడు. కోటదాటి వెళ్లుతూ ఒక ఏడేండ్ల బ్రాహ్మణకుమారుని, కోట ద్వారంవద్ద వున్న అడవిలో పుల్లలు ఏఱడం చూచాడు. అతడే తన అల్లుడని నిశ్చయించాడు.

"యథా రాజా తథా ప్రజా" రాజుమాట జవదాటేవా రెవరు? ఆబాలుని వప్పించి, వివాహ మాలికలు మార్చించేరు.

ఇట్లు మా అమ్మమ్మ చెప్పేసరికి నేను ఆమెదగ్గిరగా చేరుకుని "తరువాత?" అని ప్రశ్నించాను.

నా అంతరంగవీధుల్లో ఆశావిత్తులు అకురించాయి. ఆ ఏడేళ్ల అదృష్టమూర్తి నెనేనా అనిపించింది. వర్షం పడడంవల్ల రాత్రి ప్రతిధ్వనిస్తూ వుంది. మా గదిలో వున్న గోడదీపం తగ్గిపోతూవుంది. మా అమ్మమ్మ గొంతుక కథచెప్పుటలో, హీనస్వరం దాల్చింది. ఇవన్నీ నా హృదయసీమలో ప్రతిబింబిస్తూ, ఒకనాటి ఉదయాన పుల్లల ఏరుతూ వుండడం, అకారణంగా ఒక్కమారు ఒక అందాలరాణితో దండలు మార్చుతూవున్నట్లు నాకుఒక నమ్మకం కలిగించినాయి.

మా అమ్మమ్మే గాని ఒక రచయిత అయితే ఆమె అనేకసంజాయిషీలు చెప్ప వలసివచ్చును. మా అమ్మమ్మ విమర్శకాళినోటి కబళమనటానికి జంకేమి? మాఅమ్మమ్మ కథలో చెప్పిన శాఖాంతరవివాహం చేయడం ఎక్కడా జరగదు. అందుచే ఆమె చదువరులు వెంటనే, యీ రచయిత మన సభ్యతావిధులకు సహకారి కాదని, దుష్టమార్గదర్శకురా లని, పత్రికలకు వ్రాయుదురు.

పొంగిపోయే మానసంతో, "తరువాత?" అని మా అమ్మమ్మ నడిగాను. అమ్మమ్మ ప్రారంభించింది. ఆ రాజకుమారి తన బాలభర్తను తీసుకొని దేశాంతరం వెళ్ళిపోయింది. ఒక వూరు చేరుకొని అక్కడ ఏడంతస్థుల భవనం కట్టించి అందులో భర్తను పూజిస్తూ, కాలం గడుపుతూవుంది. నేను సంతోషంతో గెంతాను. "తరువాత?" అని మాఅమ్మమ్మను తొందరచేశాను.

"ఆ బాలుడు బడికి పోతూవుండేవాడు. ఆ బాలునికి యుక్తవయస్సులోనికి వచ్చేసరికి తోడిబాలురంతా "ఎవ్వరా మీమేడలోని అందాలరాణీ" అని ప్రశ్నించారు. ఒకనాడు తాను పుల్లలు ఏరుతూ వుండగా జరిగిన ఒక

పెద్దగోలమాత్రం అతనికి లీలగా అతని గుర్తుకు తగులుతున్నాది.

ఇలా 5 ఏండ్లు గడిచినాయి. అతని తోడివారు మరలమరల "ఎవరా మీామేడలోని యువతి" అని అడగసాగేరు. ఒకనాడు బడినుండి రాగానే ఆ బ్రాహ్మణ బాలుడు నీ వెవరవో చెప్పమని అడిగాడు. "ఈరోజు కాదు మరియొక నాడు చెప్తాను" అని ఆమె కాలం వెళ్ళబుచ్చుతూవుంది. ఇట్లు నాలుగేండ్లు గడిచేయి.

చివరకు బ్రాహ్మణ బాలుడు ఓర్చలేకపోయాడు. "ఓ అందాలరాణీ యీరోజున నీ వెవరవో చెప్పనిచో నేను యీభవనం వీడిపోతా" అన్నాడు. రాణి రేపు తప్పక చెప్పెదనని తన భర్తను సమాధానపర్చింది. మరునాడు బాలుడు వచ్చి ఆమె ఎవరో చెప్పమని అడుగ, రాత్రికి తాము నిద్రించునపుడు తప్పక చెపుతానని ప్రతిజ్ఞ చేసింది. బ్రాహ్మణబాలుడు సరేఅని ఒప్పుకున్నాడు. ఘడియలను లెక్కపెట్టడం మొదలుపెట్టేడు. పాపం! దురాశ్చర్యపుకాలం తన యిష్టం వచ్చినట్లా ప్రవర్తిస్తుంది. కాలం వెనక్కు నడుస్తూవున్నట్లనిపించింది ఆ బ్రాహ్మణ బాలుడికి. రాణి, కనకపుమంచముపై, అతిమృదువగు పరుపులను పర్చింది. మల్లెపూలమీద పర్చింది. బంగారపు లాంతరులో నూనె పోసి, నిగుల అందంగా అలంకరించుకొని రాత్రికొరకు లెక్కగుణిస్తూ వుంది. ఆరాత్రి ఆ బ్రాహ్మణ బాలుడు అతిసంతోషసంగతుడై రాత్రి భోజనము చేసి, పడకగదిలోనికి ప్రవేశించి ఇట్లు తలపోసెను "నేను ఈ రాత్రి యీ అందాలరాణి ఎవరో తెల్సుకుంటాను."

రాకుమారి భర్త భుజింపగా మిగిలిన పదార్థములు సేకరించి, నెమ్మదిగా గదిలో ప్రవేశించింది. ఆమె మంచం సమీపించేసర్కి, ఒక పాము పువ్వుల లోనుంచి ప్రాకివచ్చి బ్రాహ్మణబాలుని కరచింది. బాలకునిమోము కళావిహీనమైంది. అతడు స్వర్గస్థు డయ్యాడు.

ఇట్లు వినేసర్కి నా హృదయంలో ఒక్కమారు మెఱుపు మెరసినట్లయి, కన్నీరు గ్రక్క "తరువాత" అంటిని. ఇంకేముంది. జీవనమే జీర్ణించిపోతే, అమ్మమ్మ, అమ్మమ్మయిన ఇక కథ చెప్పలేదు. కాని బాలకుల విశ్వాసం అపజయం అంగీకరించదు. అది మైబడబోయే మృత్యువునుగూడా దాటగలదు. కాన ఇటువంటి దుఃఖాంతమైన కథ చెప్పటంవల్ల, విశ్వాసపూరితులగు బాలకహృదయాలు ఆందోళనాతరంగాలలో అల్లాడుతాయి. అందుచే మాఅమ్మమ్మ సమాప్తి చేయడానికి తగ్గుదల చేసింది. ఆ కంకాళమును ఒక బనానాఆకుపై తేల్చి మంత్రావధోరణ చేస్తూ, నదిలో వదిలివేసింది. ఆ వర్షరాత్రిలో, ఆతగ్గుగల వెలుతురులో, చాపు అనేమాట, బాలకుల ఆలోచనలలో, తన ఛాయస్వరూపం, గోల్పోయి, ఒక నిద్రాదేవిరూపంగా మారిపోతుంది. ఈవిధంగా మనం నిశ్చలమైన కాలవార్ధిలో తేలి, నిద్రాదేవిపీపుపై తాండవమాడేపిల్లలను నిద్రపుచ్చుతాం. ఉదయాన మనం కొన్ని మంత్రాలను జపించి, వారిని చిరకాలజీవులుగను, తేజోవంతులుగను చేస్తున్నాం.

బ్రహ్మరాక్షసి

శ్రీ దిట్టకవి లక్ష్మీనరసింహాచార్య

అనగాఅనగా నాలుగువందలసంవత్సరముల క్రిందట ఒకగ్రామంలో ఒక జమీాందారు ఉండెను. అతడు చాలా భాగ్యశాలి. అతనికి లక్షలకొలది ఎక



రాల పొల ముండెను. కాని ఆయన పిసినిగొట్టులకు సర్దార్. అతడు తన సేవకులకు పొట్టనిండా అన్నముగూడ పెట్టకుండెను. ఇటువంటి పిసినిగొట్టువద్ద ఎవరూ పని చేయుటలేదు. కాని ఎవరన్నా తెలివితక్కువవాడు వచ్చాడా అంటే పదిరోజుల్లోనే వెళ్లగొట్టేవాడు. జమీాందారుయొక్క వేలకొలదిఎకరాలు పని లేక బీళ్లుపడిపోయినై. ఆ పొలాల్లో గొడ్లు ఆ బీళ్లలో హాయిగా కడుపునిండా మేయసాగెను.

ఇలా ఉండగా ఒకరోజు ఒకసాధువు ఆ జమీాందారింటికి వెళ్లెను. జమీాందారు ఆ సాధువుతో తన దురవస్థ విలపించెను. అతనిపైన సాధువుకు దయగల్గి ఒక మంత్ర ముపదేశించెను. సాధువు వెళ్లినతదుపరి జమీాందారు ఒక ఆసనమువేసికొని మంత్రము జపింపసాగెను. అతని జపము ఫలించి ఒక రాక్షసి ప్రత్యక్షమాయెను.

జమీాందారును ఆ రాక్షసి "నీ కేమి కావాలో కోరుకో" అనెను. జమీాందారు ఆ రాక్షసిఆకారమును గంభీర ఘోషణమును చూచి మొదట భయపడెను. తర్వాత ధైర్యముతెచ్చుకొని "ఆఁ! నే నొక చిన్న పని చెబుతాను. అది కాస్త...చేసిపెట్టాలి" అనెను. ఆ రాక్షసి "తప్పకుండాచేస్తా" అనెను.

జమీాందారు "అదీ చిన్న పనే అని మొదటనే చెప్పితినిగదా!" అనెను.

ఆ రాక్షసి "ఏమీ! పరవాలేదు" అని చెప్పెను.

జమీాందారులో లోపల సంతసించుచుండెను. ఎందుకంటే తన అదృష్టం పండినదని. జమీాందారు ఆ రాక్షసితో "వెంటనే నాలక్షలకొలది వున్న బీళ్లను బాగా దున్నిరమ్మ" ని ఆజ్ఞాపించెను. ఈ ఆర్డరిచ్చి అన్నము తినుటకు వెళ్లెను. ఇంతలో రాక్షసి వచ్చి "పొలము దున్నితి" నని చెప్పెను. ఏమిటీ? అన్ని పొలాలూ దున్ని వచ్చావా, నేలకు వేలు బీళ్లు? అని ప్రశ్నించెను.

ఆ రాక్షసి "అవును! అంత పొలమూ దున్నేవచ్చా" నని చెప్పెను. జమీాందారు తనలో భయముపొందెను. ఆభయాన్ని కప్పిపుచ్చి కోపం తెచ్చుకొని "నీవు యింత ఆలస్యముగా ఎందుకు వచ్చావు?" అనెను.

"క్షమించండి! ఇంకెప్పుడూ ఆలస్యము చేయను!" అని రాక్షసి అనెను.

"మంచిది! చేనుకు వెళ్లి, నీరుతో చేనును పూర్ణముగా తడిపిరావలసింది" అని చెప్పెను.

జమీాందారు ఆజ్ఞాపించి అన్నము తినుటకు కూర్చుండెను. రాక్షసి మళ్లా వచ్చి "పొలము తడుపుట- నీరు పెట్టుట అయిపోయింది. యింకేమయినా పని ఉంటే చెప్పండి! తక్షణం చేస్తా!" అనెను.

రాక్షసితో "ఒక్కమారు కలుపు తీయు కొంచెంకూడా లేకుండా! నల్లమట్టిలో తెల్ల పీచుగూడా ఉండగూడదు!" జమీాందారు చెప్పెను.

మరల జమీాందారుఅన్నం పూర్తిగాకముందే వచ్చి "కలుపు తీశానండి!" అని రాక్షసి పల్కెను. జమీాందారు భయంతో—"వెళ్లు! పొలమంతా విత్తులు చల్లిరా! నేను ఇప్పుడే వచ్చి నిజముగా పని చేస్తున్నావో! మాట్లం పనేనో తెలుస్తుందిగా!" అన్నాడు.

జమీాందారు అన్నం తిని కుళ్లాయి చుట్టుకొని తాంబూలం వేసుకోపోతుంటే ఇంతలోకే రాక్షసి వచ్చి "విత్తులు చల్లానండి! యింకా ఏమి చేయమంటారు" అనెను. "నిజంగా విత్తులు చల్లి వచ్చావా? సరే! వెళ్లు నీవెంటవస్తున్నా!" అని చేనుకు బయలుదేరెను. చేనంతా విత్తులు చల్లబడియుండెను. జమీాందారుగుండె చల్లబడి కాళ్లూ, చేతులూ వణకసాగెను. ఇటువంటి నౌకరుకు ఎటువంటి పని చెప్పాలా?, అని తలకాయ గోక్కుంటూ "సరే! చూడు పొలమంతా ఒక్క ఒక్క చేలో క్రొత్త క్రొత్త బీళ్లు చెట్లు సృష్టించి యింటికి వచ్చెయ్యి!" అని పరుగెత్తి—పరుగెత్తి వంటింట్లోకి వచ్చి భార్యతో "ఒకసంవత్సరం వందమంది చేసే పని ఒక రాక్షసి ఒక గంటలో చేసింది. ఏమి పని చెప్తే అన్నీ పన్లూ చేస్తున్నది. ఇక చెప్పటానికే పనీ లేదు" అని వణకుచుండెను.

ఆతని భార్య "మీారేమీా దిగులు పడవద్దు. ఆ రాక్షసును రాగానే ఒక మాటు నావద్దకు పంపండి!" భయము లేకుండా అన్నది.

ఐదునిమిషాలలో రాక్షసి వచ్చింది. జమీాందారు రాక్షసిని తన భార్యవద్దకు పంపెను. జమీాందారుభార్య మొదట వంటయింటిపన్లన్నీ చేయించి ఒక ఉంగరములుగా మెలికలుతిరిగిన వెంట్రుకను పీకి యిచ్చి "యీా వెంట్రుకను వంకర లేకుండా కడ్డీలాగా నిలబడేట్లు చేసుకు రమ్మ" నెను.

రాక్షసి ఆ వెంట్రుక తీసికొని మెల్లిగా చేయుటకొరకు పూదోటలోకి వెళ్లెను. దినములు, వారములు, నెలలు గడచెను. కాని ఆ వెంట్రుక తిన్నగా రాలేదు.

ఆ వెంట్రుక తిన్నగా వచ్చు ఉపాయాన్ని వెదుకుతూనేవున్నది. ఒకరోజు ఒక కమ్మరి ఇనుపవస్తువును కాల్చి వంపుతీయుచుండెను. ఇంకేం కావాలి? వెంటనే ఒక కుంపటివద్దకు వెళ్లి, వెంట్రుక నిప్పులో వేసెను. వెంట్రుక కాలి మాడిపోయెను. ఆ రాక్షసి వెంట్రుకతోనే వెళ్లిపోయెను.

మనిషిపుఱ్ఱె

శ్రీ మహీధర నళినీమోహన్‌రావు

పూర్వకాలంలో ధారానగరాన్ని "భోజుడు" అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆ రాజులో లేని సుగుణం అంటూ లేదు. విద్యావంతుడు. గొప్ప దాత. గొప్ప కవి కూడాను. ఆ రాజు అనేకమంది కవులను, పండితులను పోషించేవాడు. ఆ రాజుదగ్గర "కాళిదాసు" అనే గొప్పపండితు డొక డుండేవాడు. కాళిదాసు చాలా తెలివైనవాడు.



యుక్తిపరుడు. వాదంలోనూ, కవిత్వంలోనూ పాండిత్యంలోనూ కూడా మిగిలిన పండితులనందరినీ ఓడించి, అన్ని బహుమానాలూ తనే పొందేవాడు.

ఒకరోజున భోజరాజు మామూలుగానే కొలువుతీర్చి ఉన్నాడు. కవులూ, పండితులూ అందరూ కలసి కవిత్వాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు. ఇంతట్లోకే ఆ రాజుగారి సింహాసనానికి ఎదురుగా ఉన్న గోడ బద్దలయిపోయి, అందులోనుంచి పెద్ద పెద్ద మంటలూ, పొగలూ బయలుదేరేయి. ఎక్కడే అంటుకుందేమో నని అందరూ గాభరాగా అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. ఆ పొగలో ద్వారం ఎక్కడ ఉందో తెలియక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాసేపట్లో ఆ పొగలూ, మంటలూ తగ్గిపోయాయి. ఒక పెద్ద రాక్షసుడుమాత్రం ద్వారంఅవతల నిలువబడిఉన్నాడు.

ఇంచుమించుగా నాలుగయిదు తాడిచెట్లపొడుగున్నాడు. కళ్లు ఎఱ్ఱగా చింత నిప్పులులాగ ఉన్నాయి. నోరు పెద్ద గుహలాగకనబడుతోంది. ఇంకెందుకూ వాడి చిటికెనవేలే మఱ్ఱిచెట్టంతలావుగా ఉందంటే ఇంక ఆ రాక్షుడు ఎంతల్లాగ ఉన్నాడో ఆలోచించుకోండి. వాడి చేతిలో ఒక మనిషిపుఱ్ఱె ఉంది. అందరూ ఆ రాక్షసుణ్ణి చూసి గజగజ లాడిపోతున్నారు. ముచ్చెమటలు పోసేసేయి. ఎంతమంది ఉంటేమాత్రం ఏం లాభం? వాళ్ళందర్నీ కలిపి సిక్కబుగ్గకిందికి తోసి పిప్పరిబింటిబిళ్లంలాగ చప్పరించేస్తే ఏం ఉంది?

అప్పుడా రాక్షసుడు వాళ్ళందర్నీ చూసి, వెక్కిలిగా నవ్వుతూ, ఇల్లాగ అన్నాడు: "ఏమట్రోయ్! మనుషులూ! మీ రప్పుడే ఇంత భయపడవలసిన అవసరం లేదు. ఇదిగో! ఈ మనిషిపుఱ్ఱెను చూసేరా? ఈ పుఱ్ఱెగల మనిషి తెలివైనవాడో, తెలివితక్కువవాడో చెప్పండి. మేమంతా చాలా తెలివైనవాళ్లమని విఱ్ఱవీగుతున్నారు కదూ? దీనితో తెలిసిపోతుంది మీ పస. నా ప్రశ్నకి జవాబు చెప్పడానికి ఒక గంట గడువిస్తున్నాను. ఆ గంటలోనూ చెప్పలేకపోతే మిమ్మల్నీ ఈ రాజ్యంలో ఉన్న ప్రజల్నీ ఫలహారంచేసేస్తాను. నరమాంసం తిని చాలా రోజులైందికూడాను. నోరూరుతోంది. మీలో ఎవరేనా సరే నా ప్రశ్నకి జవాబు చెప్తే నేను బ్రతికి ఉన్నంతకాలం మీ దేశానికి సేవకుడిగా ఉంటాను. ఆలోచించుకోండి" అని.

రాక్షసుడు మాట్లాడినంత సేపూ పెద్దపెద్ద పిడుగులు పడినంత చప్పుడైంది. "ఈ పుఱ్ఱెగల మనిషి చచ్చి ఏనాడైందో. ఇప్పుడా మనిషి తెలివైనవాడో తెలివితక్కువవాడో ఎల్లా చెప్తాం? బ్రతికి ఉన్న మనిషి అయితే ఎల్లాగో చెప్పవచ్చు. ఇవాళ మనఅందరిపని సరి" అనుకుని హడలిపోతున్నారు అందరూ.

ఇంతట్లోకి కాళిదాసు లేచి రాజుతో "రాజా! మీ రేమీ భయపడకండి. ఈ ప్రశ్నకి జవాబు నిమిషంలో చెప్తాను. సన్నని, పొడుగుపాటి, ఏమాత్రం వంకరలేని ఇనపఊచ ఒకటి తెప్పించండి" అన్నాడు. వెంటనే రాజు అల్లాటి ఇనపఊచ ఒకటి తెప్పించాడు. కాళిదాసు రాక్షసుడి చేతిలోని పుఱ్ఱెనీ, ఇనుపఊచనీ పుచ్చుకుని, ఆ పుఱ్ఱెకి ఉన్న చెవిచిల్లులో ఆ ఇనుపఊచని దూర్చేడు, వెంటనే సులభంగా ఏ అడ్డూ లేకుండా రెండవచెవిచిల్లులోనుంచి బయటికి వచ్చేసింది. అప్పుడు కాళిదాసు రాక్షసుడితో "ఏమయ్యోయ్! ఈ పుఱ్ఱెగల మనిషి వట్టి తెలివితక్కువదద్దమ్మ" అన్నాడు.

అప్పుడు రాక్షసుడు మొహం అదోలా పెట్టి "ఓహో! ఏదోఒక జవాబు చెప్పి తప్పించుకుపోదామనిచూస్తున్నావు. ఇది అల్లా వదిలే ఘటం కాదు. నువ్వు చెప్పినదానికి కారణం చెప్పి, ఋజువు చేస్తేనేకాని నేను నమ్మను" అన్నాడు.

అప్పుడు కాళిదాసు ధైర్యంగా రాక్షసుడితో ఇల్లా అన్నాడు. "మరి చెప్తున్నాను విను. మనుష్యులలో 'వేగచిఱులు', 'చిఱచిఱులు', 'చిఱవేగులు', 'వేగవేగులు' అని నాలుగు రకాలు ఉన్నాయి. ఏదేనా ఒకసంగతిని వేగంగా అర్థంచేసుకుని, చాలా కాలం జ్ఞాపకంఉంచుకోగలవారిని 'వేగచిఱులు' అంటారు. చాలా కష్టంమీద అర్థం చేసుకుని, చాలకాలం జ్ఞాపకం ఉంచుకోగలవారిని 'చిఱచిఱులు' అంటారు. ఈ రెండురకాల మనుష్యులూ కూడా తెలివైవవాళ్లల్లోకి జేరుతారు. ఇంక ఏసంగతినైనా చాలా కష్టంమీద అర్థం చేసుకుని, వెంటనే మరిచిపోయే వారిని 'చిఱవేగులు' అంటారు. ఒక చెవిలో నుంచి వింటూ వెంటనే రెండవ చెవిలోనుంచి వదలిపెట్టేసేవాళ్లని 'వేగవేగులు' అంటారు. ఈ పుఱ్ఱెగలమనిషి వేగవేగులజాతిలోకి చేరతాడు. ఎందు చేతనంటే ఈ ఇనుపఊచని ఈ చెవిలో పెట్టి తొయ్యగానే రెండో చెవిలో నుంచి ఏ అడ్డూ లేకుండా సునాయాసంగా వచ్చేసింది. అంటే ఈ మనిషికి ఏ విషయం అయినా సరే ఈ చెవిలో నుంచి వెళ్లి రెండవచెవిలోనుంచి సునాయాసంగా బయటికి వచ్చేస్తుంది. అందుకనే ఈమనిషితలకాయ వట్టి కల్తీలేని రాగిడీమట్టితో చేయబడిందని చెప్పేను." అని.

ఆ మాటలు వినగా ఆ రాక్షసుడు కాళిదాసువైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఇన్నాళ్ల వరకూ దీని జవాబు ఎవ్వరూ చెప్పలేకపోయారు. ఇప్పటివరకూ ఈ ఉపాయంచేత ఎంతోమందిని చంపుకునితినేసేను. ఈవేళకి నీ చేతిలో పడ్డాను. ఈ రహస్యం ఎల్లా తెలిసిందా అని మహాశ్చర్యంగా ఉంది అని చెప్పి అప్పటినుంచి ఆ రాజుకు సేవకుడుగా ఉండిపోయాడు. కాళిదాసుతెలివికి మెచ్చి రాజు మంచి బహుమానం ఇచ్చేడు.

వింత మొక్కలు

మూలం: "గ్రిమ్స్‌ఫేరీటేల్స్"

అనువాదం: శ్రీ కృ. తి. నారాయణ

కేవలము మంత్రగాండ్రు వింతయైన పనులు చేయడమే గాక, కొన్ని మొక్కలసహాయమునగూడ పలు విధములైన వింతలు జరుపబడుచున్నవి. నిదర్శనమున కీ క్రింది కథను చదువుడు.

పూర్వ మొకప్పుడు ఒక వేటకాడుండెను. వా డొకనాడు వేటకై పోవుచుండగా, దారిలో నొక మంత్రకత్తె కనుపించి, వానితో, "నేను చాల ఆకలిగొని యున్నాను. ఏదైన ఆహారమివ్వ" మని యడిగెను. వా డామెపై దయగొని, ఆమెకు కొంచెము తన ఆహారములో తీసి యిచ్చెను. ఆమెయు సంతసించి, "నాయనా! నీవు చాల మంచివాడవు. నీకు మేలు చేయగోరినాను. నే నొకటి చెప్పెదను. కొంత దూర మీదారిలోనే పోయిన, ఒక చెట్టుమీద తొమ్మిది పక్షు లున్నవి. వానిమధ్యన నీ బాణముతో నొకదానిని కొట్టిన, ఒక వల క్రిందికి పడును. ఒక పక్షి చనిపోయి అదియు క్రిందికి పడును. ఆ వల తీసికొనుము. పిదప ఆ పక్షిలోని గుండెను దీసికొని మ్రింగుము. ఆ వలలో నీ వెచ్చటికి పోవలెనన్న నచ్చటికి పోగలవు. ఆ పక్షి గుండెకాయను మ్రింగినందువలన, రోజున కొకతూరి, నీ పరుపుదిండుక్రింద బంగారుమొహరి అగుపడును."

ఆ వేటకా డామెతో సెలవుగైకొని ఆమె చెప్పినట్లే చేసెను. ఆ మరునటి యుదయమే వాని కొక బంగారు మొహరీ అగుపడెను. వా డట్లు కొన్ని నెలలలోనే విస్తారముగా ధనమును గడించినవా డయ్యెను. అతడు ప్రపంచములో సుఖమును ననుభవింప బయలుదేరెను. అట్లాతడు చాల దూరము నడిచి పోగా, వానికి, ఒక చక్కని యిల్లు, దానిలో నొక సౌందర్యమైన స్త్రీ కనపడెను. అత డానాటికి అచ్చటనే యుండదలచి, ఆ యింటిలో ప్రవేశించెను. కాని ఆ యిల్లు ఒక క్రూరమంత్రకత్తెది. ఆమె యిదివఱకే వీనిని చూచి, తన బిడ్డతో, వానిని నెట్లైనను మోసగించి, ఆ వలను, గుండెకాయను, సంపాదించవలెనని చెప్పెను. వాడా యిల్లు ప్రవేశింపగనే, ఆ మంత్రగత్తె వానిని బహువిధముల సత్కరించి, వానికి, మత్తుపదార్థముతో కలిసిన ఆహారము పెట్టెను. వాడు ఆకలిగొన్నవా డగుటచే తొందరగా భుజించెను. తోడనే మైకముతో క్రిందికి పడుటయే గాక, వాని కడుపులోవున్న గుండె బయటికి పడెను. దానిని మంత్రగత్తె, కుమార్తె (స్త్రీ) త్వరగా మ్రింగివేసెను. మరల కొంతసేపటికి వానికి తెలివి వచ్చి చూడగా, ఆ మంత్రగత్తె వ్యసనముతో, కిటికీవద్ద కూర్చునియుండెను. ఆ వేటకా డామెను "ఏల విచారముతో నున్నావు?" అని యడిగెను. ఆమె, "ఆ దూరములో నున్న పర్వతములను చూచుచున్నాను. అచ్చట విశేషముగా రత్నరాసులు కలవు. వానిని దెచ్చునుపాయము తెలియకున్నది" అప్పుడా వేటకాడు "నీ వేమి చింతచేయవలదు. ఇటు రండి. ఈ వలలో నీ బిడ్డ, నీవు, నేను కూర్చుండి అచ్చటికి సులభముగా పోగలము." అనెను. వా రట్లే దానిలో కూర్చుని, త్వరలోనే అచ్చటికి చేరిరి. విలువగల్గిన రత్నములను వారు సేకరించిరి. కాని, మంత్రగత్తె, తన మంత్రసహాయమున, వానిని మైకముతో క్రిందికి పడునట్లు చేసెను. పిదప తాను ఆ వలను తీసికొని

(17 వ పేజీ చూడుడు)

సావిత్రి లేఖలు

శ్రీ పి. గణపతి శాస్త్రి

౧

సీతా! నేను ఎంతెంత పెద్దఉత్తరాలు రాసినా నువ్వు ఊరికే నాలుగు ముక్కలు బరికిపారేస్తూండడము నాకేమీ బాగాలేదు. కాస్త మరి నాలుగు మాటలు రాస్తే అరిగిపోతావా? అస్తమానము, ఇంటిపనో! ఇంటిపనో! అంటావేమిటి? ఇంటిల్లపాదికీపని చెయ్యడం తప్ప బతుకులో మరి ఒక గొడవేమీ లేదా?

అన్నట్టు మీకృష్ణుడు ఆడుకుంటున్నాడా? బండవెధవ! ఇప్పుడు కొంచెం తప్పటడుగులు వేస్తున్నాడా! వాణ్ణి చూసి అప్పుడే ఏడాది అయింది. పులిగోరుపతకం మెళ్ళోవేస్తే ఎంచక్కంటాడు. అన్నట్టు అది చేయించావా? లేదా?...మళ్లీ ఏమన్నా కొంచెం అనుమానంగా ఉందా?

నా ఆరోగ్యంసంగతి రాయమంటావు? ఏమని వ్రాయను? మనస్సులో సరిగ్గా లేక పోయాక ఇంక ఆరోగ్యం ఏమిటి చెప్పు!

ఈ మధ్యన మా ఆయనసంగతి ఏమీ బాగా లేదు. నేనేమైనా రాస్తే ప్రేమించి పెళ్లిచేసుకున్నారని డప్పివాడుస్తానేమోకూడాను! పోనీలే! ఉన్నసంగతిఅంతా రాస్తాను. నా దగ్గిర తప్పుంటే నువ్వేమన్నాఅను! పడతాను!

అసలు పెళ్లయిన ఏడాదినించీ మా ఆయన గొడవే మారిపోయిందిలే! ఆరోజుల్లో ఎంత అప్యాయంగా ఉండేవారని! కావాలన్న కొత్త చీరల్లా కొనిపెట్టడమే! సినీమాలు! షికార్లు! ఒకటేమిటి? ఏటికి ఏడాది ఒక్క చిటికలో వెళ్లిపోయింది. ఇప్పుడవన్నీ తలుచుకుంటే మనస్సులో ఏదో బెంగగా ఉంటుందే! అన్నం తింటున్నానన్నమాటేగాని, ఏమీ వంటబట్టడం లేదు! ఏమయిపోతూందో! మరి!

వారం రోజుల క్రిందట,-ఆయనతో కాలేజీలో చదువుకుండెట!-ఓఅమ్మాయి వచ్చింది! వారిద్దరూ ఏమేమో మాట్లాడుకున్నారు! ఆ అమ్మాయితో మాట్లాడుతూన్నంతసేపు ఆయన చేరెడేసి కళ్లు చేసుకుని కలకల్లాడుతూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు!...... ఆ అమ్మాయి మరీను! మనిషికి కొంచెమైనా వొంచాడింపు ఉండక్కరలేదూ?...పోనీ! అందులో ఆయనతప్పేమీ లేదనుకో...ఏం! నాతో అల్లాగ మాట్లాడకూడదా! ఈమధ్యన నాతో ఒక్కసారయినా తమ రల్లాగ మాట్లాడారా?...నా మనస్సులో ఉండబట్టలేక ఆ మాట ఆయనతో అనేశాను! దానిమీద ఆయన "బాగానే ఉంది! వరస! నీతో ఏమని మాట్లాడమన్నావు!" అని కసురుకున్నారు! ఆ వేళ ఆ అమ్మాయిని ఎంత మర్యాద చేశారనుకున్నావు! అడుగులకి మడుగు లొత్తారంటే నమ్ము!

ఎప్పుడైనా "బీచికి షికారు వెడదామా!" అంటే-"ఇప్పుడే ఆఫీసునించి వచ్చాను! కాళ్లు లాక్కొస్తున్నాయి!" అంటారు. మొన్న ఆ అమ్మాయి "షికారుకి వెడదామా!" అని అడిగేసరికి ఎగిరి గంతేసి వెళ్లారు! పాపం! తప్పనిసరిగా నన్ను కూడా రమ్మన్నారులే! సరే! ఈ తమాషా ఏమిటో చూదామనీ నేనూ వెళ్లాను! ముందు తమిద్దరూ చరచరా నడిచి పోవడము, వెనక్కితిరిగిచూసి నాకోసం నిలబడడమూను! మేమెప్పుడైనా షికారుకి వెడితే, చక్కగా కబుర్లు చెప్పుగుంటూ వెళ్లడం ఎప్పుడైనా ఉందా! ఆయన గబగబా ముందునడిచి పోతూండడము, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నేను వెనకాలే నడవడమూను! ఏమండీ ఒక్క అడుగు ఆగండీ! అంటే నామాట వినిపించుకోవడంఅంటూ ఏమైనా ఉంటేనా?

నువు మొన్నటి ఉత్తరంలో "అనుమానం ప్రాణసంకటం! అస్తమానం ఏమో తవ్విపోసుకుంటున్నా"వని రాశావు!

ఈమధ్యన మళ్లీ ఒకపెద్ద గొడవ జరిగింది. అప్పటినించీ నాకు మరీ బెంగపట్టుకుంది! అసలే అన్నం తినడం లేదనుకో! ఆయనా ఆఫీసుకు వెళ్లగానే, ఓమూల కూర్చుని నాలో నేనే కుమిలికుమిలి ఏడుస్తున్నాను. ఎంచేతనో గాని నాకు పట్టలేనంత ఉడుకుబోతుతనంగా ఉంటుంది సీతా!

ఈమధ్యన నేను మా పొరుగింటి చెల్లాయమ్మగారు కలిసి బజారుకు వెళ్లాము! ఆయన నా కప్పుడు హఠాత్తుగా ఒక బస్సులో కనిపించారు! ఆయనపక్కని ఆ కాలేజీలో చదువుకున్న అమ్మాయి కూర్చుంది! ఇద్దరూ ఏమేమో ఆప్యాయంగా మాట్లాడుకుంటున్నారు! నేను ఆయన్ని గుర్తుపట్టానో లేదో! అప్పుడే క్షణంలో బస్సు వెళ్లిపోయింది! తరవాత నేనాయన్ని ఇంటికి వచ్చాక నిలవదీసి అడిగాను! ఆ కాలేజీలో కలిసి చదువుకున్న అమ్మాయిపేరు చంద్రకాంతంట! ఇద్దరూ కాలేజీలో ఇంటరు చదివారట! ఇప్పుడు ఆ అమ్మాయి మా ఆయనఆఫీసులోనే టైపు ఉద్యోగం చేస్తూందిట! ఆ అమ్మాయికి వేరే చోటు లేకపోవడంమూలాన్ని తమ పక్కని కూర్చుందిట! అంతకంటె తమ కేమీ తెలియదంటా రాయన!

అప్పటినించీ నాకు మరింత బాధగా ఉంది సీతా! కళ్లు మూసుకున్నా నిద్రపట్టదు! అస్తమానము, ఆయన చంద్రకాంతమూ, ఆఫీసులో కలకల్లాడుతూ మాట్లాడుకున్నట్లు కనిపిస్తుంది! ఆయన సాయంత్రం ఇంటికి రావడం ఒక్క నిమిషం ఆలస్యమయితే నా కదో గాభరాగా ఉంటుంది. ఆరోజుకారోజు అంతకంతకి నీరసపడిపోతున్నాను. నువ్వన్నట్టు ఇది మేమిద్దరము ప్రేమించి చేసుకున్న పెళ్లే! నా కెన్ని సంబంధాలు వచ్చినా నచ్చడం లేదని, మా నాన్నగారు ఈ సంబంధం తీసుకురావడము, నేను ఒప్పుకోవడము నువ్వెరుగుదువు కదా! అల్లాగే మాఆయనకి కూడా ఇంతకు పూర్వం ఎన్ని సంబంధాలు వచ్చినా నచ్చలేదట. కొంచెం కట్నం తక్కువయినా నన్నే పెళ్లి చేసుకుంటానని పట్టుపట్టారట! ఆ రోజులే వేరులే! ఊరికే అనుకోవడమే గాని, మళ్లీ అల్లాంటి రోజులు వస్తాయా!

అసలే పొద్దస్తమానము ఆయనకి చదువుతోనే సరిపోయేది. ఈమధ్యన మే మిద్దరమూ మాటమాట అనుకున్నాక ఆయన మరీ చదువులో పడిపోయారు! పొద్దున్న తొమ్మిదింటికి ఆఫీసుకు బయలుదేరడము, రాత్రి తొమ్మిదింటికి ఇంటికి జేరుకోవడమూను! ఏమన్నా అంటే "నేనేమైనా పనిఅంటూ చూసుకోవాలావద్దా! అస్తమానము ఇంట్లోనే కూర్చుంటే పను లెలాగసాగుతాయి!" అంటారు. ఆపైన రాగానే రెండు మెతుకులు నోట్లో వేసుకోవడము, సిగరెట్టు వెలిగించి పుస్తకం చేత్తో పుచ్చుకొని కూర్చోవడమూను! ఏమన్నా అంటే కస్సుమంటారు." కాస్త ఇంటరుదాకా చదువుకున్నావా! ఏదైన కాస్త చదవడం అలవాటుచేసుకో! ఎన్ని పుస్తకాలు తెచ్చినా ఒక్కటీ పూర్తి చెయ్యడం అంటూ లేదు! నాకంతకోషే గాని అసలు నీకు చదువెందుకులే!" అంటారు.

మనస్సు సరిగా ఉంటేగదా! చదవడానికి! నువ్వేమన్నాఅను! నా కీ అనుమానం వదలకుండా ఉంది! నువ్వు అస్తమానము నన్నంటావుగాని, ఇల్లాంటిదేదైనా వస్తే ఆయనకి మాత్రం అనుమానం ఉండదంటావా? అయితే మగవాళ్లకి ఆ అనుమానం చెల్లుతుంది! మనకా అనుమానం చెల్లదు! అంతేతేడా! ఈమధ్యన మా మేనత్త కొడుకు వచ్చాడు. వాడూ నేను చిన్నప్పుడు కలిసి ఆడుకునేవాళ్లము! నాకంటె వాడు కొంచెం చిన్న. అందుచేతనే మాయిద్దరికి పెళ్లి జరగలేదు. అసలు మాఅమ్మకూడా మేనరికంవల్లగాదని దెబ్బలాడిందిలే! నాపిల్లని ఆ బడుద్ధాయికిచ్చి పెళ్లిచేస్తే నాపిల్లా నేనూ నూతులో పడతామని దెబ్బలాడింది! అదంతా వేరేకథ!

వాడిప్పుడు బొంబాయిలో రైల్వేలో ఉన్నాడు. సెలవుల్లో ఇంటికి వెడుతూ పనిమీద ఇక్కడికి వచ్చి, మాయింట్లో దిగాడు. ఆయన ఇంకా ఇంటికి రాలేదు. మేము ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. ఆయన వచ్చేసరికి గా రాత్రి ఎనిమిది అయిందేమో! అదేమోకాని వస్తూనే నన్ను చూసి రుసరుసలాడుతూ లోపలికి వెళ్లిపోయారు. ఆతరవాత అంటీ అంటనట్టు మాబావని పలకరించారు. భోజనాలయ్యాకకూడా వాడితో అట్టే మాట్లాడలేదు; ఆతరవాత వాడు వెళ్లి పడుకున్నాడు.

మొదట నాకు ఆ రుసరుసలకు కారణం తెలిసిందికాదు; కారణం అడిగేసరికి "ఎంతబంధువులయినా! అలాగ రాసుకు తిరుగుతే చూసినవాళ్ళేమనుకుంటారు? కాస్త మంచీ చెడ్డా ఉండక్కరలేదూ?" అన్నారు. నే నేమీ మాట్లాడలేదు సుమా! ఆమాటలకి నాకు కళ్లమ్మట నీళ్లపర్యంతము వచ్చింది. ఇదీ మగవాళ్ల వరస!

ఆపైన రెండురోజులదాకా ఆయన నాతో మాట్లాడలేదు!......ఏమిటి దేనికి! ఇల్లాగ ఎంతరాసినా ఇంకా రాయవలసే ఉంటుంది. అప్పుడే ఆయనకు ఆఫీసుకి వేళ కావస్తూంది. ఇంకా కొన్ని రాయవలసిఉందిగాని, ఆతని వాత రాస్తాులే! ఇంకా పిల్లలకి, తలంటి నీళ్లు కూడా పొయ్యాలి! వంటిది పాలకోసం ఏడుస్తూంది; అసలే వంట ఆలస్యం అయితే కేకలు వేస్తారు. తమరు ఇంటికి రావడం ఆలస్యం చెయ్యవచ్చునుగాని, ఆఫీసుకి వెళ్లడం ఆలస్యం కాకూడదుగా! వెంటనే ఉత్తరం రాస్తావు కదూ! నీ ఉత్తరంకోసం ఎదురుచూస్తూ ఉంటాను.

వింత మొక్కలు

(16-వ పేజీ తరవాయి)

తన బిడ్డతో నిల్లు చేరుకొనెను. అప్పటినుండి యా మంత్రగత్తె ధనవంతురాలయ్యెను.

పాపము! వేటకానికి కొంతసేపటికి స్మృతికలిగి, చూడగా, తన చుట్టు రాక్షసు లుండిరి. వారు వీడెవడో చిన్న కీటకమని యనుకొనుచుండిరి. "ఇట్టే పీ పర్వత మెక్కి పైకి చేరిన, మేఘములు తీసికొనిపోగల" వని చెప్పి, వారు వెడలిపోయిరి. పిదప, వేటకాడు వారి మాటలను వినియుండెను. కనుక త్వరగా పర్వతముపైకి ఎక్కెను. అచ్చటికి ఒక మేఘము రాగా, దానిని పట్టుకొని వేరొకచోటికి పోయి, క్రిందికి దిగెను. అచ్చట చుట్టును, కాయగూరల చెట్లు కొన్ని చిన్న మొక్కలు అగుపడెను. వా డాకలిబాధకు తాళజాలక ఆ మొక్కలను తినెను. వెంటనే వాడొక గాడిద యయిపోయెను. మరల ఆ కాయగూరలలో నొక కాయను తినెను. మరల వాడు మనుష్యుడయ్యెను. ఇవి వింతగా నున్నవి. దీనితో నా శత్రువులమొడ కసి తీర్చుకొందునని, వానిలో కొన్ని మొక్కలను, కాయలను, పీకి, మూటగట్టుకొని పయనమయ్యెను.

అతడట్లు వెడలి, తుదకు మంత్రకత్తెయింటికి చేరెను. అతడిపుడు మునుపటివలె లేడు. వేషము మార్చుకొని, రాజుయొక్క భటుడనని చెప్పుకొని లోనికేగెను. ఆ మంత్రకత్తె వీని నాదరించెను. వాడు తాను అపూర్వమైన మొక్కలను సంపాదించినాననియు, వానిని పక్వముచేయుడని వారికిచ్చెను. ఆమె మిక్కిలి సంతోషించి కాయలను, మొక్కలను దీసికొని వంటచేయసాగెను. వంట పూర్తిఅయిన తోడనే తాను ఆ వంటక మెట్లున్నదో యని, యువ్వెళ్లూరి, గరిటతో తీసికొని కొంచెము మ్రింగెను. వెంటనే మంత్రగత్తె గాడిదగా మారి, దొడ్డిలో మేయసాగెను. పిదప, మంత్రగత్తెకూతురు, ఆ నూతనవంటక మెట్లున్నదో యని ఆశచెంది, తానును కొంచెము రుచిచూచెను. ఆమెకూడ వెంటనే మరియొక గాడిదగా మారి బయట మేయసాగెను. ఇచ్చట వేటకాడు "వంట వడ్డించుట కెకను రాలేదే" యని తానే స్వయముగా బయలుదేరి చూడగా, రెండు గాడిదలు బయట కనపడెను. "ఒహో! తగిన శాస్తి యయిన" దని యనుకొనుచు, ఆ గాడిదలను, దోలుకొనిపోయి, యొక మిల్లుయజమానికప్పగించి రోజునకు పెద్దగాడిద (మంత్రగత్తె)కు ఒకపూట భోజనము, రెండు సార్లు బాగుగా దెబ్బలుకొట్టడము; చిన్న గాడిదకు మూడుపూటలు భోజనము, దెబ్బలు కొట్టకూడ దనియుచెప్పెను.

వా డట్లే చేయుచు కొన్నిరోజుల పిదప ఆ గాడిదలను వేటకాని కిచ్చుటకు వచ్చుచుండగా దారిలో నాపెద్దగాడిద చనిపోయెను. చిన్నగాడిదనుమాత్రము వేటకాని కిచ్చివేసెను. వాడు దానిపై జాలిగొని, దానికి మరియొక కాయను దినిపించగా, ఆ గాడిద యథాప్రకారము, సుందరమైన స్త్రీగా మారెను. ఆమె వాని కాళ్ళపై బడి క్షమాపణ కోరి, "తాను నిజముగా నాతని ప్రేమించియుంటి" ననియు, తన నీచతల్లి బలవంతముపైన నట్లు చేసితినని వానితో చెప్పెను. వాడామెను క్షమించి, ఆమెను వివాహమాడెను. ఆమె, ఆయింటిలో దాచియుంచిన, వల, మరియు గుండెకాయ, నాతని కిచ్చివేసి, ఆ దినమునుండియు, సుఖముగా, విశేష ధనముతో కాలముగడుపుచుండిరి.

తెలంగాణంలో కమ్యూనిస్టుసమస్య

(7 వ-పేజీ తరువాయి)

స్థితి సంస్థానంలో నేటికికూడా, కొనసాగుతూనే వున్నది.

కమ్యూనిస్టుకల్లోలాలను అణచడంలో ప్రభుత్వం, రెండు ముఖ్యమైన మార్గాల్ని అవలంబించింది. మొదటిది సైనికబందోబస్తు. ఇక రెండవది, కమ్యూనిస్టు సమస్యకు ఆస్కారం కల్పిస్తున్నాయని భావించబడుతున్న రాజకీయ ఆర్థిక, సాంఘిక అకతవకలను తొలగించడం. ఈ రెండు మార్గాలద్వారా ప్రభుత్వం కొంత వరకు కృషిచేసినప్పటికీ, కమ్యూనిస్టుసమస్య పరిష్కారం కాలేదు. అయితే యెక్కడో లోపం వుండితీరుతుంది.

ఈ సందర్భంలో మనం, ప్రధానంగా, కమ్యూనిస్టుపోరాటవిధానాన్ని సమగ్రంగా పరిశీలించాలి. సైన్యాలవలె, కమ్యూనిస్టులు, నేరుగా ఎదురుబడి పోరాటంచేయరు. అడవుల్లోను, గుట్టల్లోను వుండి, గెరిల్లాపోరాటం సాగిస్తారు. సమయం చూసుకుని గ్రామాలపై బడి హత్యలు చేస్తారు. ప్రభుత్వబలాలు వస్తున్నాయనగానే, ఎక్కడివారక్కడ చేతి కందకుండా మాయమవుతారు. పరిణామం ఏమిటయ్యాఅంటే కమ్యూనిస్టులు మాత్రం దొరకరు; అమాయకులైన ఆ గ్రామస్థులుమాత్రం, కమ్యూనిస్టులకు బదులు విపరీతమైన శిక్షలకు గురిఅవుతారు. ఇదీ వరస! కమ్యూనిస్టుల నిర్బంధంపేరిట, అమాయకులైన ప్రజలకు జరుగుతూవున్న ఈ అన్యాయాలు, నేటికీ కొనసాగుతూనే వున్నవి.

కీ తెరిగి వాత పెట్టడంవల్లనే, జబ్బు త్వరగా నయం అవుతుంది. అట్లా గాక, జబ్బొకటైమందు ఇంకొకటైతే, జబ్బు నయం గాకపోగా, ఇంకా ప్రమాదదశకు చేరుకునే అవకాశంవుంది. తెలంగాణాకమ్యూనిస్టుసమస్యపట్లకూడా ఇదే జరుగుతున్నదేమోనని అనుమానించవలసి వస్తుంది.

కమ్యూనిస్టుసమస్య కేవలం సైనికబలంతో మాత్రమే పరిష్కారమయ్యేది కాదు. ఈసమస్య కేవలం కొందరువ్యక్తులకు సంబంధించిందికాదు. కొందరు బందిపోటుదొంగలను నిర్బంధించడంలో, ప్రభుత్వ సైనికబలమే ఎక్కువగా ఉపకరించవచ్చు; కాని, జాతీయ, అంతర్జాతీయ సమస్యలపట్ల కొన్ని ప్రత్యేకమైన రాజకీయ దృక్పథాలు కలిగి, నయానో, భయానో, ప్రజలను తమ స్వాధీనంలోనికి తెచ్చుకుని, ప్రభుత్వాన్ని స్వాధీనపరుచుకో చూస్తున్న కమ్యూనిస్టులను, అందుకుతగిన సాధనోపాయాల ద్వారానే సాధించవలసి వుంటుంది.

న్యాయంగా ఆలోచిస్తే ప్రభుత్వనిర్బంధాల కన్న, ప్రజాప్రతిఘటనే, కమ్యూనిస్టు సమస్యను త్వరగా అంతంచేయగలదు. అంటే, ప్రభుత్వం, ప్రజలకు తనపై సరియైన విశ్వాసం కలిగింపజేసుకుని, వారి ప్రతిఘటనాశక్తితో, కమ్యూనిస్టు సమస్యను త్వరగా అంతం జేయగలిగివుండేది. అయితే, హైదరాబాదు మిలిటరీప్రభుత్వం, ఈవిషయాన్ని ఉద్ఘాటిస్తూ ప్రజాసహకారం కోరుతూ వచ్చినప్పటికీ ఆచరణలో అంతగా కనుపించలేదు.

పోలీసుచర్యానంతరం, ఇండియన్ యూనియన్ ఉద్యోగులు పరిపాలనాబాధ్యత తీసుకోవడంతో, ఆరోగ్యకరమైన మార్పులు సంభవిస్తాయని ప్రజలంతా ఆశించారు. అయితే ఈ విషయంలో చాలావరకు నిరాశే కలిగింది, పైగా పరిపాలనావ్యవస్థ పూర్తిగా లంచగొండి విధానంతో నిండిపోయింది. ఈ పరిస్థితి కమ్యూనిస్టుసమస్యకు ఇంకా ప్రాణంపోసింది.

కమ్యూనిస్టుల సమస్యవిషయంలో, ప్రభుత్వానికి అన్ని విధాలా సహకారం ఇవ్వగలగడంలో, సంస్థానకాంగ్రెస్ తన లక్ష్యంగా భావించుకుంటుంది. ఈవిధంగా చేయడంలో సంస్థానకాంగ్రెస్‌కు స్వప్రయోజనమే వుందని చెప్పాలి. కమ్యూనిస్టుల దౌర్జన్యచర్యలన్నీ, యొక్కవభాగం, కాంగ్రెస్‌సంస్థను నామరూపాల్లేకుండా చేయడానికిని, కాంగ్రెస్‌వాదులను హత్యచేయడానికిని ఉద్దేశింపబడినవి. కాబట్టి కాంగ్రెస్‌వాది, సహజంగా, కమ్యూనిస్టుసమస్యను అంతంచేయడం తన ప్రధానవిధిగా భావిస్తాడు. అటువంటప్పుడు, కాంగ్రెస్‌వాదుల సహకారాన్ని ప్రభుత్వం విధిగా తీసుకోవలసి వుండెను. కాని దురదృష్టవశాత్తు, హైదరాబాదు మిలిటరీప్రభుత్వానికి, సంస్థాన కాంగ్రెస్‌కు మధ్య, నానాటికీ విభేదాలు పెరిగిపోతూ వచ్చినవి. ముఖ్యంగా కొన్ని ప్రదేశాలందు, ప్రభుత్వవర్గము, కాంగ్రెస్‌సంస్థ, ప్రతిపక్షాలుగా మారిపోయినవి. వరంగల్లుజిల్లాలో మానుకోటతాలూకావంటి కొన్ని ప్రదేశాలందు ఈ పరిస్థితి విపరీతదశకు చేరుకుంది. కొన్ని ప్రదేశాలందు, పోలీసుఉద్యోగులు కాంగ్రెస్‌వాదుల సహకారం కోరినప్పటికీ, సివిల్ అధికారుల అయిష్టతమూలంగా, అది సాధ్యం కాకపోయేది. ఈ కక్షలు అంతటితోనే ఆగలేదు. ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకోవడం, సహజంగా ప్రభుత్వవర్గానికి అధికారాలున్నాయి కాబట్టి, తమకు గిట్టని కొందరు కాంగ్రెస్‌వాదులను, కమ్యూనిస్టులనే సాకుతో నిర్బంధించడం, బహిష్కరించడం వరకు కూడా పోయింది. మరి కొన్ని సందర్భాలలో, కాంగ్రెస్‌వాదులలో వున్న వర్గాలతో సంబంధం పెట్టుకుని, తమకక్షలు సాధించడానికి కూడా వెనుదీయలేదు. ఈ పరిస్థితులమూలంగా, కాస్తో, కూస్తో త్యాగంచేసి, ప్రజల్లో పలుకుబడి కలిగి వున్న కాంగ్రెస్‌వాదులు కూడా, ప్రభుత్వవర్గాల నుండి దూరంగా వుంటూ వచ్చారు. పైగా, జమీందార్లు, దేశముఖులు, కమ్యూనిస్టుల నిర్బంధం విషయంలో, ప్రభుత్వయంత్రానికి సలహాదారులుగా మారిపోయారు. ఈ ప్రబుద్ధులు, చేతచిక్కిన అవకాశాన్ని జారవిడచుకోకుండా, పాతకాలాలలో తమకు వ్యక్తిగతంగా వున్న కక్షలన్నిటినీ, కమ్యూనిస్టుసమస్యపేరిట, వరసగా తీర్చుకోవడం మొదలుపెట్టారు. ఒకవంక ప్రభుత్వోద్యోగుల వెంటవున్న ప్రజావ్యతిరేకశక్తులను ఆధారంచేసుకుని, మరొకవంక, ప్రభుత్వయంత్రంలో, ప్రబలుతూవున్న అవినీతిని ఎత్తి చూపిస్తూ, కమ్యూనిస్టులు ప్రజల్లో తమ వునికిని, భద్రం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. వారి ఈ ప్రయత్నాలకు, నేటికీ ఫలితం కానుపిస్తూనే వున్నది.

ఇకపోతే, కమ్యూనిస్టులకు చెందిన రహస్యాలను, సకాలంలో సెకరించడంలోకూడా ప్రభుత్వయంత్రం, అంతగా విజయవంతం కాలేకపోయింది. పైగా, ప్రభుత్వరహస్యాలు, కమ్యూనిస్టులకు ఘడియాలలో తెలిసిన నిదర్శనలు, చాలా కనుపిస్తున్నవి. పోలీసుక్యాంపులున్న ప్రదేశాలకు మైలుదూరంలోగా కమ్యూనిస్టులచే హత్యలు జరగడం, పోలీసుల దాడులను గురించి, మొదటే తెలుసుకుని, కమ్యూనిస్టులు పోలీసులకు చిక్కకుండా తప్పుకోవడం, సాధారణంగా జరుగుతుండే విషయాలు. ఈ విధంగా జరుగుతూఉండడంవల్ల, కమ్యూనిస్టుల ఏజంట్లు కొందరు, ప్రభుత్వ యంత్రంలో ఏదోరూపంలో వున్నారని శంకించవలసివస్తుంది. ఇది కొంతవరకు యదార్థం కూడా. ముఖ్యంగా, రజాకార్ హయాంనాటి ఉద్యోగులు, వేరే గత్యంతరం లేక ప్రభుత్వయంత్రంలో ఇంకా ఇమిడివున్న వారిలో చాలామంది, కమ్యూనిస్టుల వంటి వాళ్లకు ఏజంట్లుగాకూడా పనిచేస్తున్నట్లు చెప్పకోబడుతుంది. ఈ నిందకు గురియైనవారిలో నైజాంమిలటరీ, మరియు పోలీసులు ముఖ్యులు. ప్రభుత్వయంత్రంలో ఇట్టి దేశద్రోహకరశక్తులను సమూలంగా తొలగించినప్పుడే, ప్రభుత్వానికి, దాని పరిపాలనకు భద్రత ఉంటుంది.

ఇకపోతే, కమ్యూనిస్టుసమస్యను ఎదుర్కోవడంలో, కాంగ్రెస్‌వాదులు చేస్తున్నలోపాల్ని కూడా పరిశీలించడం అవసరం. తెలంగాణంలోని ప్రధానమైన రెండుజిల్లాలలో వందలాది ప్రాణాలను బలిగొంటున్న కమ్యూనిస్టుసమస్య యొక్క తీవ్రతను, హైదరాబాదు సంస్థాన కాంగ్రెస్‌నాయకులు గుర్తించారా? లేదా? అన్న అనుమానం నేటికీ కలుగుతూనే వుంది. నాయకుల అశ్రద్ధకు ప్రధానమైన కారణం; ఇటీవలి వరకు వారు, ముఠారాజకీయాలలో చిక్కుకుని, బొత్తుగా తీరిక లేకుండా వుండడమేనని, సర్వత్రా భావించబడుతూవుంది. సంస్థాన కాంగ్రెస్‌కు ఇంతవరకు అధ్యక్షులుగా వున్న స్వామి రామానందతీర్థ, మరియు ఆయన అనుచరులు కొందరు, కొత్తకమ్యూనిస్టు అభిమానులు కావడం, ఈ పరిస్థితికి కారణమంటారు, చాలామంది. ఇందులో కొంతవరకు యథార్థం వుండవచ్చు; కాని ఇదే ముఖ్యకారణంగా మాత్రం భావించరాదు. ఎందుకంటే, ఇట్టి కారణాలను చూపే ప్రధానవ్యక్తులు శ్రీ బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డిగార్లవంటి అచ్చమైన కమ్యూనిస్టువ్యతిరేకులు కూడా ఈ జిల్లాలందలి కమ్యూనిస్టు సమస్యను పరిష్కరించడానికై చేసింది, వీసమెత్తైనా కనుపించదు. కమ్యూనిస్టుల ఘోర కృత్యాలు సాగి, సంవత్సరం దాటిపోయినప్పటికీ, యే కాంగ్రెస్‌నాయకుడు కూడా, పట్టుమని పదిరోజులపాటు, ఈ ప్రాంతాలందలి గ్రామాలు తిరిగి పనిచేసిన పాపాన పోలేదు.

ఇక స్థానికంగావున్న కాంగ్రెస్‌కమిటీలు, సభ్యులు, ఈ సమస్యను ఎదుర్కోవడంవిషయంలో తీసుకున్న చర్యలు కూడా, అంత సంతృప్తికరంగా లేవు. నాయకుల్లో వున్న గ్రూపులు, కార్యకర్తలవరకూ ప్రాకి, తత్ఫలితంగా, కాంగ్రెస్‌వాదులు తమ విద్యుక్తకర్తవ్యాలను మరచిపోవడం జరిగింది. వీటికన్న ముఖ్యంగా, కమ్యూనిస్టుసమస్యను ఎదుర్కోవడంవిషయంలో, నేరుగా అమలుచేయగల ఒక నిర్ణీతమైన కార్యక్రమం ఈనాటివరకు కాంగ్రెస్‌వాదులు సిద్ధంచేసుకోలేకపోయారు. కమ్యూనిస్టులు విపరీతంగా హత్యలు సాగిస్తూ, బూటకప్రచారాలద్వారా, ప్రజలను మోసగిస్తూ వుంటే- కాంగ్రెస్‌వాదులు కళ్లప్పగించి చూస్తూ కూచున్నారు. తమ కున్న కడహీనపు అవకాశాలను కూడా జారవిడవకుండా, సైక్లోస్టాయల్‌పై గూడా, కరపత్రాలు తీసి, రహస్యంగా ప్రజల్లో పంచుతూ, కమ్యూనిస్టులు తమ ప్రచారాలు సాగించుకుంటున్నారు. కాని కాంగ్రెస్‌కు, అన్ని విధాలా అవకాశాలు వుండి కూడా, కాంగ్రెస్‌ఆశయా లేమిటో, కమ్యూనిస్టులు ప్రజల పచ్చినెత్తురులను ఏవిధంగా త్రాగేస్తున్నారో చెప్పకోలేకపోతున్నారంటే, నిజంగా విచారపడాలి. కమ్యూనిస్టుల దౌర్జన్యవిధానాలను అరికట్టవలసిన అవసరాన్నిగురించిగాని, శాంతిని కాపాడడంలో ప్రజలకు కలిగే లాభాలను గురించిగాని, నేటివరకు, ఏ కాంగ్రెస్‌కమిటీకూడా, కనీసం ఒక్క కరపత్రమైనా ప్రకటించినట్లు మనకు కనుపించదు!

క్రమశిక్షణకు కట్టుబడి, పట్టుదలతో పని చేయడం విషయంలో, కమ్యూనిస్టులనే మొదలు పేర్కోవాలి. అట్టి కమ్యూనిస్టులను ఎదుర్కోవాలంటే, తత్తుల్యమైన క్రమశిక్షణ, పట్టుదల, కాంగ్రెస్‌వాదుల్లోకూడా వున్నప్పుడే సాధ్యమవుతుంది. అయితే కాంగ్రెస్‌వాదుల్లో ఇది బొత్తుగా కనుపించదు. ఇటీవల కమ్యూనిస్టు 'భయాల'వల్ల కాంగ్రెస్‌వాదులంతా తమ స్వగ్రామాలను వీడి పట్టణాలకు చేరుకున్నారు. దాంతో కమ్యూనిస్టులకు ఇంకా స్వేచ్ఛ దొరికింది.

రానురాను, కమ్యూనిస్టుసమస్యపట్ల, కాంగ్రెస్‌వాదులకు, అధికారులకుకూడా శ్రద్ధ సన్నగిలుతూవుంది. కమ్యూనిస్టుల నిర్బంధంవిషయంలో, కాంగ్రెస్‌వాదులు, ప్రభుత్వానికి సహకారం చేస్తున్నట్లుగాని, అసలు ప్రభుత్వాధికారులు అట్టి సహకారాన్ని కోరుతూవున్నట్లుగాని కనుపించదు. కమ్యూనిస్టుల హత్యలు విపరీతంగా సాగుతూనేవున్నవి. ప్రతిరోజు పట్టణాలకు శవాలు చేరుతూనే వున్నవి. ఈ ఉదంతాలన్నీ, ఇక్కడ దైనందినవ్యవహారాలుగా మారిపోయినవి. హత్యలు జరిగాయని తెలియగానే, కాంగ్రెస్‌వాదులు ఒక్క నిట్టూర్పుతో విషయాన్ని ముగిస్తారు. పోలీసులు సివిల్ అధికారులు, హత్య జరిగిన గ్రామంపై దాడిచేసి, అసలు హంతకులను పట్టుకోకపోవడం అటుంచి, నిరపరాధులైన గ్రామస్థులకు విపరీతమైన శిక్షలు విధిస్తారు.

ఇది; తెలంగాణంలో కమ్యూనిస్టుసమస్య యొక్క నిజస్వరూపం. ఇండియన్ డొమినియన్ పార్లమెంటులో, తెలంగాణంలో కమ్యూనిస్టుసమస్య అదుపులోకి తీసుకరాబడిందనే చెప్పబడుతూవుంది. ఇటు హైదరాబాదు ప్రభుత్వం వారు, అంతా శాంతియుతంగానే వుందంటారు. కాని, యథార్థం తెలుసుకోవాలంటే, ఈప్రాంతాల్లో నివసిస్తున్న సామాన్యపౌరుని జీవితాన్ని దగ్గరగా వుండి చూస్తే బోధపడుతుంది.

గత రెండుసంవత్సరాలకు పైగా, ఈప్రాంతాలందలి గ్రామాలలో, ప్రజలు, ఒక్కరాత్రికూడా ప్రశాంతంగా నిద్రపోయి యెరగరంటే, ఆశ్చర్యపడనవసరంలేదు. సంవత్సరానికి పైగా రజాకార్ల దురంతాలకు గురి అవుతే, ఇప్పుడు కమ్యూనిస్టుహత్యలకు అణగారిపోతున్నారు. ప్రశాంతమైన జీవనంకోసం, ప్రజలు తహతహలాడిపోతున్నారు. ఏఘడియలో ఏం జరుగుతుందోనన్న భయమే వారికి జీవితంలో మిగిలిపోయింది. తమనీడలను చూచుకుని తామే భయపడే దుర్దినాలు దాపురించినవి. చచ్చిన చావు కాకుండా, బ్రతికిన బ్రతుకు కాకుండా, దినగండంగా కాలాన్ని గడుపుతున్నారు. రోజులు ఎంతికఠినంగా పరిణమించాయంటే, ఈ కల్లోలాలు అణిగిపోయి, మంచిరోజులు వస్తాయన్న విశ్వాసంకూడా ప్రజల్లో అంతరించిపోతూ వున్నది.

అట్లా అని, నిరుత్సాహపడడం, పురుషలక్షణం కాదు. పైయధార్థాలను దృష్టియందుంచుకున్నప్పుడే, సమస్యాపరిష్కారంలో సరియైన మార్గాల్ని అవలంబించడానికి వీలుంటుంది. ఈసమస్యను పరిష్కరించవలసిన బాధ్యత ఏనాటికైనా, హైదరాబాదుప్రభుత్వముపైనను, సంస్థానకాంగ్రెస్ పైనను వుంటుంది. పైగా, ఒకవంక హైదరాబాదు ప్రభుత్వములోనూ, సంస్థానకాంగ్రెస్‌లోను, నూతనంగా మార్పులు జరిగినవి. మిలిటరీగవర్నరును జే. యన్. చౌధురీస్థానే, వెల్లోడీ, ప్రధానమంత్రిగా వచ్చారు. అదేవిధంగా, శ్రీదిగంబరరావుబిందూ, స్టేటుకాంగ్రెస్‌కు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా వచ్చారు. వెల్లోడీ ప్రభుత్వం, వెనుకటి అనుభవాలనుండి పాఠాలు నేర్చుకుని, నూతనసౌమ్యమైన విధానాల ద్వారా సమస్యను పరిష్కరించడానికి పూనుకోవాలి. సంస్థానకాంగ్రెస్, అన్ని విభేదాలను మరచి, ఈవిషయంలో, ప్రభుత్వానికి అండగా నిలవాలి. అంతేగాదు; నడుం బిగించి, రంగంలోనికి దిగి, కమ్యూనిస్టుసమస్య నామరూపాల్లేకుండా చేయాలి. అప్పుడే నిజమైనశాంతిని ప్రజలు అనుభవించగలుగుతారు.

రుద్రమదేవి

౧౨

సరిగా మూడుజాముల కింకను ఒక గడియ వ్యవధి యుండగనే ఆ విశాలసభామంటపము నిండిపోయెను. వేదికామధ్యమున రెండు భద్రాసనములును వానివెనుక నొక యున్నతాసనము నుండెను.

సభాప్రారంభమునకు అరగడియ ముందుగా ఆంధ్రోర్వీశుమోసాలపై గడియారమున ఖంగుఖంగున ఇరువదిరెండు గంటలు మారుమ్రోగెను. ఆ ఘంటానినాదము ప్రణవనాదమువలె నా మండపమంతట ప్రసరించి మ్రోగెను. ఆ శ్రుతి ఉపశమించుచుండె తడవుగా రాజమందిరాంతరములనుండి మంగళతూర్యపంచకము శ్రవణపర్వముగా నొక్కసారి మ్రోగెను. ఆ మంగళవాద్యములలోనుండి జంటసన్నాయిస్వరము, జంటడోళ్ల ధ్వనియు వెలువడి మనోజ్ఞమై దిశాంతముల వ్యాపించెను.

వందిమాగధుల కైవారములు వినవయ్యెను. చోపుదారులు బహుపరాకులు చెప్పిరి. ముందు పగటిదివ్వెలు కనవయ్యెను.

శ్రీసాంబసదాశివు ననుగమించు కేశవస్వయంభూమూర్తుల ననుకరించుచు శ్వేతాతపత్రములనీడల శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల వెంట గణపతిదేవులును రుద్రదేవమహారాజులును చామరగ్రాహిణులు వింజామరలు వీవ ఆ సభామండపము ప్రవేశించిరి. ఒక్కసారిగా సభాసదు లందరు జయజయనినాదములు చేయుచు లేచి నిలుచుండి నమస్కరించిరి.

చక్రవర్తియు యువరాజును శ్రీవిశ్వేశ్వరశంభువులను వేదికవెనుకభాగమున నున్న యున్నతాసనమున సగౌరవముగా నాసీను జేసి వారికి నమస్కరించిరి. అంతట గణపతిదేవులు మహాసభకు చేతులుజోడించి నిలిచెను. అంతలో రాజపురోహితుడు చక్రవర్తుల భద్రాసనమును సంస్కరించి పూజింపగా శ్రీగణపతిదేవులు దానికి నమస్కరించి పరిషదనుజ్ఞ నంది యం దధివసించెను. అట్లే శ్రీరుద్రదేవమహారాజును పరిషద్వందన మాచరించి సంస్కృతపూజిత భద్రాసనమునకు నమస్కరించి యం దుపవిష్ట యయ్యెను.

కార్యభరణు డగు దామనామాత్యు డిట్లు ప్రకటించెను:

"స్వస్తి, శ్రీమదపారపారావారపరివృతమహీతలంబున సకలవిద్వజ్జనవినుతంబగు నంధ్రదేశంబునకు విభూషణం బగు నేకశిలాపురవరంబు నిజరాజధానిగా నొప్పుచున్న శ్రీకాకతిభూపాలక్రమంబున జనవినుతయశోవిలాసుండును విజయలక్ష్మీవిలాసుండును శ్రీమన్మహాదేవరాయపుత్రుండును సదారాధితత్రినేత్రుండును విబుధజనవనవసంతుండును రమణీయసీమంతినీజయంతుండును సకలజనమనోరంజనుండును అరాతిరాజమదభంజనుండును శరణాగతరాజన్యశరణ్యుండును సత్యహరిశ్చంద్రుండును విభవామరేంద్రుండును వరాహలాంఛనుండును సర్వలోకాశ్రయ శ్రీకాకతివంశపారావారసుధాకరుండును నగు శ్రీగణపతిదేవచక్రవర్తులు శ్రీరుద్రదేవమహారాజులుంగారి కీనాడు యౌవరాజ్యాభిషేకము రాజగురుప్రధానమంత్రిదండనాథప్రకృతిసామంతసర్వజనసమక్షంబున జేసి యీ శుభముహూర్తమున పేరోలగము దీరియున్నారు. సమస్తమంత్రి సామంతమండలేశ్వరదండనాథప్రధానాదులును శ్రీరుద్రదేవమహారాజులయెదుట తత్సేవాప్రతిజ్ఞలు పరిషత్సమక్షమున జేయ చక్రవర్తులాజ్ఞాపించుచున్నారు."

రాజాజ్ఞ ననుసరించి యందరును ప్రభుభక్తిప్రమాణములు చేసిరి. ముఖ్యులందరు నొకరి తరువాత నొకరు వచ్చి శ్రీరుద్రదేవమహారాజులకు వందన మాచరించి ఖడ్గము చేత బుచ్చుకొని వారికి తమ సేవకజీవిత మంకిత మొనర్చుచున్నా మని కఠినప్రతిజ్ఞలు చేసిరి. ముఖ్యు లందరు నైనపిమ్మట సమస్తప్రకృతులును ఒక్కసారిగా నట్లే ప్రతినలు చేసిరి.

ఆ మహాసభకు శ్రీవీరభద్రేశ్వరుడు కాని యాతని పుత్రులు గాని రాలేదు. గణపతిదేవులును మహామాత్యులును నది ప్రథమముననే గమనించిరి. వారు మువ్వురను వా రొకకంట గనిపెట్టుచునే యుండిరి. పట్టాభిషేకమహోత్సవమునకే వారు వత్తురో రారో యని వారు ముందు సంశయించిరి. వా రా సమయమునకు వచ్చినందున నీ సాయంకాలమునకు వత్తు రను నూహ వారలకు బలపడెను. అందుచే వారు సకాలమునకు రాకుంట ప్రమాదజనితమైన యాలస్య మగు నేమో యని కొంతతడవు చింతించిరి.

అంతలో దౌవారికులు పరిజనముచే చక్రవర్తికి మూడు పత్రములు పంపించెను. అవి కార్యభరణు డగు దామనామాత్యుడు చదువుకొని చక్రవర్తుల శ్రీహస్తముల కందింపజేసెను.

అవి వీరభద్రేశ్వరుడును అతని కుమారు లిద్దరును పంపుకొనిన పత్రములు! వానిలో వారు మువ్వురను శ్రీ గణపతిదేవుల యనుగ్రహముచే వారికి సంప్రాప్తమైన సమస్తగౌరవములును బిరుదములును ఉద్యోగములును వినయవిధేయతలతో వదలుకొని ప్రభువులకు తిరిగి సమర్పించుకొనిన ట్లుండెను. వీరభద్రేశ్వరుని పత్రములో నొక విశేషముకూడ కలదు. అందు దాను విరక్తుడై సన్యసించు నుద్దేశముతో నున్నందున పేరోలగమునకు వచ్చుట సమంజసము కా దని మానివేసినట్లు కూడ తెలిపెను.

గణపతిదేవుడు స్వయముగా నా పత్రములు చదువుకొని వారల మువ్వురను వెంటనే చెరసాలలో పెట్టవలె నను నాజ్ఞ లిఖించి మేచయనాయకున కందించెను. ఆ విజయసభ జరుగుచుండగనే మేచయనాయకు డందుండి వెడలిపోయెను.

అంతట గణపతిదేవులు రాజసభలోనుండి పర్వతనాయకుని బిలిపించిరి. అతడు నాలుగుమూరల ప్రమాణమును మించిన యత్యున్నతశరీరుడు. అంత పొడవు మీద నాతడు లావున్నను సన్నగా కనబడును. పూర్వము అగస్త్యుని దర్శనము కాక ముందు వింధ్యపర్వత మిట్లే యుండెనా యనిపించును. వెంటనే యాతడు మహారాజులఎదుట నిలిచి వంగి నమస్కరించి నిలుచుండెను. అతని నిలుచున్న తీరులోని ఠీవి రాజసభ నెల్ల యాకర్షించెను.

ఇతని నెందులకు మహారాజులు పిలిపించిరి? మహారాజుకు అకారణముగా నిగ్రహానుగ్రహములు కలుగుట వారి కెల్లరకు గొంత యనుభవ మున్నది. పర్వతనాయకుని ముఖములో నా క్షణమున నెట్టి భయమును కలుగలేదు. లోతైన కన్నులలోనుండి గణపతిదేవు డా నిలిచియున్న వ్యక్తిని కొన్ని క్షణములపాటు తదేకదృష్టితో తిలకించెను. ఆ దృష్టి యాపాదమస్తకము నాతనిలోనుండి చొచ్చుకొని యంతరాంతరములు తిలకించుచున్న ట్లుండెను. ఆ చూపుకు నిలువగలుగుట సామాన్యులకు కష్టతరము. పర్వతనాయకుడు నిశ్చలుడై పాలుగారుచు వినయగౌరవగాంభీర్యములు ప్రకటించు ముఖభంగితో రాజాజ్ఞ కెదురుచూచుచుండెను.

"పర్వతనాయకా, యువరాజుల కంగరక్షకుని నియమింపవలసి యున్నది. నిన్నా పదవికి నియోగింప నెన్నితిమి!"

"మహాప్రసాదము!" అనుచు పర్వతనాయకుడు గణపతిదేవులయెదుట మోకరించి పాదాభివందన మొనర్చెను.

వెంటనే కార్యభరణు డగు దామనామాత్యు డాజ్ఞాపత్రము లిఖించి రాజముద్రాంకితము చేయించి మహారాజుల కందిచ్చెను. అది స్వహస్తముతో మహారాజు పర్వతనాయకున కీయ నాత డది రెండుచేతుల నందుకొని కన్నుల కద్దుకొని లేచి శ్రీరుద్రదేవమహారాజులకు నమస్కరించి తన ఖడ్గము నంటి సేవాప్రతిజ్ఞ చేసెను.

అంతట గణపతిదేవుల యాజ్ఞ దామనామాత్యుడు వినిపించెను. జన్నిగదేవుని త్రిపురాంతకుని అంబదేవుని వారి ఖడ్గములను తిక్కచమూపతికి వెంటనే యర్పించి మహారాజుల సన్నిధికి రావలసిన దని యాయాజ్ఞ తెలిపెను.

ఆ యాజ్ఞ సభ నంతటిని సమ్మోహితుల జేసెను. ఈ మహాసేనానులపై మహారాజు కాగ్రహము కలిగినదా? కాకతిసామ్రాజ్యమహాసౌధమునకు మూలస్తంభుల వంటివారే వీరు! వీరిని గణపతిదేవు లేమి చేయదలచినారు? ఇంతవారి కింత యవమానము చేసిన వారు సహింతురా? మహాప్రధాను లగు శ్రీమన్ గోవిందనాయకుడును బయ్యననాయకుడునే అంతరంగములలో నలజడి నొందిరి. సభ నిస్తబ్ధమయ్యెను. ఇది యంతయు త్రుటికాలములో జరిగిపోయెను.

అట్లు నిర్దేశింపబడిన మువ్వురు సేనానులును నిలువున నిలుచుండిరి. వరుసగా వారు తిక్కచమూపతిని సమీపించిరి. ముందు జన్నిగదేవుడు తన యొరలోనుండి రత్నత్సరువిరాజిత మగు ఖడ్గము తీసి కన్నుల కద్దుకొని నిస్తంద్రుడై తిక్కచమూపతి కర్పించెను. అతని కన్నులార్ద్రము లగుట యొక విశేషమా? అతనివెంట త్రిపురాంతకుడును అంబదేవుడును అట్లే యొనర్చిరి. వారు మువ్వురను ఖడ్గహీనులై శక్తిహీను లగు శివులవలెను నికృత్తశిఖు లగు శ్రోత్రియగృహస్థులవలెను నిస్తేజులై యా సభాస్థానమున గనబడిరి. ఆ మహావీరుల నా యవస్థలో చూచుటకుగూడ సభాసదులకు కష్ట మనిపించెను.

మరల దామనామాత్యుడు రాజశాసనము వినిపించెను.

"మీరు మువ్వురును శ్రీగణపతిదేవులకు ప్రియతమసేవకులలోనివారు. మహాలయామావాస్యనాటి సభకు రాజధానీనగరమునకు విధిగా రావలసిన దని మీ కాజ్ఞలు పంపబడినవి. అయినను మీరు రాకుంటిరి. మీవంటి ప్రధానపురుషులు రాకుండుటచే నా సభలో లోటుగా కనిపించెను. మీరు మువ్వురును ఈ సభకు మూడు కత్తులవంటివారు. మీరు లేని సభ మీ యిప్పటి మూర్తులవలెనే యుండెను. మీరు రాకుండుటకు కారణమైన ముందుగా నివేదించుకొని యుండలేదు. ఈ మహాసభాసమక్షమున మీరు అందువిషయము చెప్పికొనునది విన్నవించుకొందురుగాక!"

జన్నిగదేవుడు మహాసభకును చక్రవర్తికిని నమస్కరించి వినీతుడై యిట్లు నివేదించెను.

"మా మండలము దక్షిణపు సరిహద్దులు దాటి జటావర్మసుందరపాండ్యునియు కొప్పెరుంజింగనియు సేనలు అలజడిచేయుచున్నవి. అట్టి ప్రమాదస్థితి నెదుర్కొనుచు దూరమున నుండుటచే రాజశాసనము ఆలస్యముగా నాకు జేరినది. అందుచే సకాలమున జేరికొనలేకపోతిని. వచ్చు ప్రయత్నములో నుండుటచే ముందుగా వార్త పంపలేదు."

త్రిపురాంతకు డిట్లు నివేదించెను.

"మా అన్నగారు జన్నిగదేవుల శాసనముచే సిద్ధయదేవచోడుని సేనలతో బోరుచు సకాలమున రాలేకపోతిని. నాకును రాజశాసన మాలస్యముగా చేరినది. ఎప్పటికప్పుడు రాజధానికి బయలుదేరుచు నాగుచు నున్నందున ముందు వార్త పంపుట పడలేదు."

అంబదేవు డిట్లు పల్కెను.

"మహారాజా, అన్నగారి శాసనమున నేను రాజశత్రువులు పలువురతో పోరుచుంటిని. ఎఱువమల్లిచోడుని పారదోలిన కేశవదేవసోమదేవుల నెదుర్కొనవలసి వచ్చినది. వారల నిర్జించిన అల్లుగంగును, మల్లికార్జునుని, దామోదరుని సేనలు తాకినవి. మహారాజసేవావ్యగ్రుడనై సమయమునకు రాలేకపోతిని. క్షంతవ్యుడను."

వారల మాటలచే సామ్రాజ్యమున కెట్టి యుపద్రవములు దాపురించినవో సభకు విస్పష్ట మయ్యెను. ఇట్లు దీక్షతో రాజసేవ చేయుచున్నవారి కీ యగౌరవ మేమి?

వెంటనే గణపతిదేవుల శాసనము దామనామాత్యుడు వినిపించెను.

"మహావీరు లగు మిమ్ముల నెట్టి యగౌరవమును జేయుట మహారాజులకు సమ్మతము కాదు. మహారాజులు వృద్ధులై విరక్తులై రాజ్యభారము శ్రీరుద్రదేవమహారాజులయందు ప్రతిష్ఠించుచున్నారు. ప్రకృతిసిద్ధముగా వాడిగల మీ ఖడ్గములకు వేడిమికూడ చేర్చవలసిన సమయ మాసన్నమైనది. మీరు పేర్కొనిన రాజశత్రువుల నెల్లర శీఘ్రముగా లోగొందు మని శ్రీరుద్రదేవమహారాజులకు ప్రతిజ్ఞాపూర్వకముగా విన్నవించుకొని మీ ఖడ్గములును సమస్తగౌరవములును మీరు పొందవచ్చును."

సభ కొక్కసారిగా భారము తీరిన ట్లయ్యెను. ఈ వృద్ధరాజు కెట్టి నైపుణ్య మున్నది!

వెంటనే ఆ వీరసోదరులు మువ్వురును శ్రీరుద్రదేవమహారాజుల కెరగి మరల విజయదశమి రాకమున్న, పాండ్యపల్లవచోళాదిశత్రువుల నెల్లర బేర్కొని, వారి నిర్జింతు మని కఠోరప్రతిజ్ఞలు చేసిరి. శ్రీరుద్రదేవమహారాజులు వారల నెర్రమద్దియల రసముతో నలంకరింపజేసి మూడు బంగారుపళ్లెరములలో వీరతాంబూలము లుంచి అందులో నా ఖడ్గములు మూడును వేర్వేర నునిచి వరుసగా మువ్వురకు బహూకరించెను. వా రవి మహాప్రసాద మని స్వీకరించి మరల పూర్వప్రతిజ్ఞలు చేసిరి. ఒక్కసారిగా సభ్యులు జయజయనినాదములు చేసిరి. ఆ కాయస్థసేనానుల కది నూతనగౌరవముగనే భాసించెను.

పిమ్మట మరియొక రాజశాసనము కార్యభరణు డిట్లు చదివెను.

"ఇందులూరి అన్నమంత్రులును కొలని రుద్రదేవులును మహాలయామావాస్యసభకు రాకున్నందుకు కారణము మహాసభకు నివేదించుకొందురుగాక!"


ఇది యేమి? వీరిని ఖడ్గములు వదలు మనలేదు. ఇం దేదో రహస్య మున్నది!

ఇందులూరి అన్నమంత్రి లేచి మహాసభకు నమస్కరించి చెప్పుకొనెను,

"గోదావరీనదియు శబరియు విపరీతముగా వరదలు వచ్చి పొంగి మండలములపై

(22-వ పేజీ చూడుడు)

సినిమాపుటః



వాహినీవారి 'గుణసుందరి కథ'లో గుణసుందరి శ్రీరంజని



కమలకన్య జూనియర్ లక్ష్మీరాజ్యం.

★ 'గుణసుందరి కథ' ★

వాహినీవారి 'గుణసుందరికథ' చిత్రం ఆదివారం 25-వ తారీఖున న్యూగ్లోబ్ థియేటరులో ప్రీవ్యూ చూపించారు. చిత్రం జానపదచిత్రమని ప్రదర్శకులు ప్రకటించారు.

ఉగ్రసేనుడనేరాజు, ముగ్గురుకూతుళ్లనీ అమితంగా ప్రేమిస్తూ, రాజ్యభారం అంతా మంత్రులమీద వదలి, కూతుళ్లే తన సర్వస్వంగా భావిస్తూ వాళ్లను గారాబంగా పెంచుతూ కాలం గడుపుతుంటాడు. తను కూతుళ్లకు సర్వస్వము అయినట్టుగా కూతుళ్లకూ తనేజీవితాంతమూ సర్వస్వమూ కావాలనీ, తనయందున్నంతగా మరెవ్వరిమీదా వాళ్లకు గౌరవాపేక్షలుండకూడదనీ అవ్యక్తంగా ఆశిస్తూంటాండు. అందుకనే ఇల్లరికపు అల్లుళ్లుగా తనఇంట్లోనే ఉంచుకోనేందుకు వీలైన మేనల్లుళ్ళిద్దరినీ, వాళ్ళు వాజెమ్మలనే సంగతికూడా గ్రహించని స్థితిలో, పెద్దకూతుళ్ళిద్దరికీ పెళ్ళిచేయాలని తలపెట్టాడు.

తనకూతుళ్లు తననే సర్వస్వంగా చూసుకోవాలనే అతని అవ్యక్తపు కోరికకు, షష్టిపూర్తి ఉత్సవంలో ప్రత్యక్షంగా పరీక్ష వస్తుంది. గారాబంపేరిట తను చేతిలో కీలుబొమ్మగా ఉండే తండ్రి, తమ చెప్పుచేతలలో ఉండే భర్తలు, కలిగి రాజ్యభోగాలన్నీ తమ ఇచ్ఛానుసారం, అనుభవించకోరున్న జాణలు, పెద్దకూతుళ్ళు ఇద్దరూ! "తండ్రే తమ సర్వస్వమని" ఏ బాధా లేకుండా తేలికగా తియ్యగా అనేస్తారు. మూడవకూతురుమాత్రం "వివాహితఅయిన స్త్రీకి, పతి తర్వాతే తండ్రి" అని చెపుతుంది. ఆ పతి ఎల్లాంటివాడైనా, నిర్ణయం దైవానిది తప్ప తండ్రిది కాదంటుంది. అందరికంటె గారాబంగా చూచుకొన్న మూడవకూతురే, తనకు ప్రేమలో అగ్రస్థానంకాక ద్వితీయస్థానం ఇయ్యటం, వరనిర్ణయంలో తన వ్యక్తిత్వాన్ని తృణీకరించటం, తండ్రి సహించడు. అతని హృదయంలోని కోరికలో అంతర్లీనమైన అవ్యక్త అహంకారం, స్వార్థం, అతనిమనస్సులో భీషణకల్లోలం రేకెత్తించి, రాక్షసప్రవృత్తిని ప్రకోపింపచేస్తుంది. సర్వవికృతలక్షణాలు ఉన్నాయనుకొన్న, ఒక పేదవానికి మూడవ కూతుర్నిచ్చి పెళ్ళిచేస్తాడు. పెద్దకూతుళ్ళిద్దరినీ మేనల్లుళ్ళకిచ్చి పెళ్ళిచేస్తాడు. మూడవకూతురు "గుణసుందరి" దైవవిలాసం అనుకుంటూ స్వీకరించి, "దైవాధీనం" అన్న ఆ కురూపినే భర్తగా ప్రేమించి గౌరవిస్తూంటుంది. గుణ అంటే ఉన్న ద్వేషంలో, దరిద్రుడైన మూడవఅల్లుడి వికృతచేష్టలలో, మరింత కోపంతో, ఉగ్రసేనుడు అల్లుణ్ణి కొట్టబోయి, కాలుజారి, కాలికి తలకి అపాయమైన గాయాలు తగిలి మంచం పట్టాడు. ఆ ద్వేషంలో మూడవ కూతుర్ని, అల్లుణ్ణి అంతఃపురంనుంచి వెళ్ళగొట్టాడు. ఆ అల్లుడు కోరున్నదీ అదేకాబట్టి పెళ్ళాన్ని తీసికెళ్ళి, ఊరిబయట పల్లీయుల గుడిసెల మధ్య ఉన్న తన చింకిగుడిసెలో కాపురం పెట్టాడు. ఎక్కడికక్కడ తన భార్యలో రాచవాసపుగర్వాలూ, అహంకారాలూ లేవుకదా అని పరీక్ష చేసుకుంటూ, ప్రతి పరీక్షలోనూ ఆమె జయిస్తుంటే ముగ్ధుడౌతూ తన, శిల్ప, నాట్య, కళావైదగ్ధ్యాలను, సాహస ఔదార్యస్వభావాలను, ఒక్కొక్కటే భార్యకు వెలువరిస్తూంటాడు. ఆమెకుకూడా, తనభర్త ప్రచ్ఛన్నరూపంలో ఉన్న ఒక మహాపురుషుడని అనుమానం కలుగుతుంది. ఒక ఘట్టంలో మారురూపంతో భార్యపాతివ్రత్యాన్ని పరీక్ష చేసి, తన నిజగాథ అంతా ఆమెకు చెప్తాడు. తానొక మహారాజకుమారుడు. తల్లితండ్రులు, రాజ్యము, పోయాక, ఒక ఋషి తనను పోషించాడు. కామరూపవిద్య తప్ప తక్కిన అన్నివిద్యలు నేర్పాడు. గురువును మోసంచేసి కామరూపవిద్య గ్రహించబోయాడు. గురుశాపం తగిలింది. భార్యకు తప్ప ఎవరికైనా తన కామరూపవిద్యారహస్యం తెలిస్తే భల్లూకమయిపోతాడు. ఇదీ తన గాథ. గుణసుందరి, తను దైవాన్ని నమ్మినందుకు తగిన ఫలితం కల్గిందని సంతోషిస్తుంది.

ఉగ్రసేనరాజుకు వ్యాధి ముదిరి, మంచంలోనుంచి లేవలేనిస్థితిలో ఉంటాడు. వైద్యులూ కూతుళ్లూ అల్లుళ్లూ, అంతా కాలుకోసెయ్యాలంటారు. ఆజబ్బుస్థితిలో, పెద్దకూతుళ్లకు తండ్రిప్రాణంమీద ఆప్యాయత ఎంతో, ఇన్నాళ్లూ వాళ్లు చూపిన నటన ఎల్లాంటిదో, రాజుకు బోధపడుతుంది. కాలు తీయకుండా రక్షించేమార్గం చూడమని వైద్యుల నడుగుతాడు. మహేంద్రమణిని తెచ్చి, మంత్రయుక్తంగా రాజుదేహాన్ని స్పృశిస్తే, వ్యాధినివారణ ఔతుందని మాంత్రికులు చెప్తారు. మణి తెచ్చిన వారికి రాజ్యం ఇస్తానని దేశంలో ప్రకటింపచేస్తాడు. పెద్దకూతుళ్లిద్దరూ, రాజ్యకాంక్షతో, భర్తల ప్రాణాలనుకూడా లెక్కచేయకుండా, మణి తెమ్మని తరిమి పంపుతారు.


విద్యాప్రభావంవల్ల మణిని తెచ్చి, తనతండ్రి ప్రాణం రక్షించవలసిందని, రాజ్యకాంక్షతో కాకుండా, తండ్రిమీద ప్రేమవల్ల, గుణసుందరితన భర్తను బ్రతిమాలుతుంది. తులసి మొక్క వాడనంతవరకూ తనకు ఆపద లేదని గ్రహించుమని భార్యకు సంకేతం చెప్పి, దైవాధీనం కూడా మణికోసం బయలుదేరుతాడు. తోడల్లుళ్ళని కలుసుకొని, వాళ్ళిద్దరినీ వెంటబెట్టుకొని వెళ్ళి, తన సాహసోపాయాలవల్ల, యక్షిణిల అడ్డంకులన్నీ జయించి, దైవాధీనం మణిని చేజిక్కించుకొంటాడు. మణి దొరికాక వాళ్ళిద్దరూ ఇతన్ని పాడునూతిలో పారవేసి, ఇంటికి బయల్దేరతారు.

గుణసుందరి జబ్బుగా ఉన్న తండ్రిని చూద్దామని రాగా, అక్కలిద్దరూ అడ్డు నిలిచి, తిరస్కారాలూ, వెటకారాలు చేసి ఆమెభర్తను అపహాస్యపు మాటలంటారు. ఆ ఉద్రేకంలో ఆమె భర్తరహస్యం వెల్లడిస్తుంది. అడవిలో పాడునూతిలో భర్తకు ఎలుగొడ్డురూపం వస్తుంది. గుణ చేసిన తప్పిదానికి నాలుక కరుచుకొని, ఇంటికి వచ్చి, వాడిపోయిన తులసిని చూచి దుఃఖిస్తుంది. భర్త ఎలుగొడ్డురూపంలో రాగా ఇంట నుంచుకొని సాకుతూ, దైవాన్ని ప్రార్థించుకొంటూంటుంది. పార్వతీపరమేశ్వరులు ఆమెను కరుణించి, ఎరుకల ఆటగాళ్ళ రూపంలో వచ్చి, ఆమె నడిగి ఆ ఎలుగొడ్డును తెప్పిస్తూ రాజప్రాసాదం చేరుకుంటారు.

పెద్దకూతుళ్లూ, అల్లుళ్లూ, ఏమి చేసినా మణి వెలుగదు. ఎరుకచెప్పే కిరాతులు ఎలుగొడ్డుభాషనాసరాచేసుకొని, రాజుయందు ప్రేమ ఉన్న కూతురూ అల్లుడూ మణిచుట్టూ ప్రదక్షిణం చేస్తే మణి వెలిగి మంత్రమహిమ కలదౌతుందని చెప్తారు. గుణసుందరి భల్లూకంతో కలిసి ప్రదక్షిణం చెయ్యగా మణి వెలుగుతుంది. రాజువ్యాధి నివారణ అవుతుంది. పెద్దఅల్లుళ్ల మోసం, పెద్దకూతుళ్ల స్వార్థపరత్వం బయలుపడతాయి. పార్వతీపరమేశ్వరుల అనుగ్రహంవల్ల, గుణసుందరిభర్తకు జనిరూపం ఏర్పడుతుంది.

చిత్రంలో కథ ఇది. ఈ కథ అవాంతరాలు లేకుండా, స్పష్టంగా తెలిసేటట్టే సంభాషణలూ, ఘట్టాలూ, ఘట్టాల పొందికలూ నడిచాయి. జానపదచిత్రం అంటే, కేవలం అద్భుతకల్పనలతో అద్భుతరసమాత్రం సృష్టించ ప్రయత్నించే చిత్రం కాదు. జనపదంలో, మానవసమస్యల స్వరూపం, ఏ భావనలలో ప్రత్యక్షమయిందో, మానవస్వభావంలోని మంచిచెడ్డల, గుణదోషాల, ధర్మాధర్మాల, నిరూపణతత్వం, నాగరికవాసనలదోషం తగలనిస్థితిలో ఎల్లా ఉందో, ఆ రసచిత్రాన్ని నిరూపించటం జానపదచిత్రాల ధర్మం. స్త్రీ జీవితంలో తండ్రి, భర్త, దైవం, వీరి వీరికి ఏయేస్థానాలు, హైందవసాంప్రదాయంలోని, సామాన్యజనులు ఇస్తున్నారో, జానపదసాహిత్యంలో తప్ప మనకు యథార్థంగా గోచరించదు. అది ఆధారంగా తీయవలసిన జానపదచిత్రాలు, కేవలం అద్భుతరసం, కెమెరా ట్రిక్కులు, భ్రమలుగొల్పే నాట్యసంగీతాలతో కలిసి, ఏ కొంటబీసనైనా పరవాలేదనుకొన్న చిత్రాలుగా తయారౌతూవచ్చాయి. అల్లా కాకుండా, జనపదంలో వరవడిగా ఉన్న నెర్మప్రాథమికమైన కథతో, మానవసహజాలను ధల్లడించే, పాత్రశీలాలతో, ప్రబలమానసిక సంఘర్షణలను వెల్లడించే ఘట్టాలతో, చిత్రం రసవత్తరంగా నడిచింది. చిత్రానికి దర్శకత్వం ఉంటుంది అన్నవిషయాన్ని ప్రేక్షకునికి వెల్లడి చేయనక్కరలేనంత సునిశితంగా దర్శకత్వం నడిచింది. రాజకుమార్తెల పాత్రపోషణలు, సునిశితంగా హృదయంగమంగా ఉన్నాయి. యథార్థ జీవితంలో, మాట, యాస, వింతచేత, ఒక అనాగరకపు అమాయకత్వము, మాటతీరూ, ఇవే సర్వసామాన్యంగా, హాస్యానికి నిలయంగా ఉంటాయి. ఈ ఒద్దికలలోనే, అతివ్యాప్తి దోషం లేకుండా, దైవాధీనం, హాస్యమతికళామతుల హాస్యపుతీరులు, వైవిధ్యం చూపుకొంటూ చిత్రానికి రంజకత్వం ఆపాదించాయి. సామాన్యంగా ఉండే స్త్రీల పాతపాటల తీరుతో, గుణసుందరి పాడిన పాటలన్నీ, సాహిత్యమూ సంగీతమూకూడా, ఇంటింట ఆడపిల్లలు పాడుకోవాలని అపేక్షించే విధంలో చక్కగా ఉన్నాయి. తెరపైని నృత్యాలూ, సంగీతమూ, కథలో భాగంగా నడచిన సుగుణముకల్గి కథకు రక్తికట్టించాయి.

అద్భుత రసానికిపోయి భ్రమ కొల్పించలేని ట్రిక్కుసీనులు కల్పించుకోకపోయినా, కథను ప్రేక్షకులకు రంజకంగా తయారుచేయవచ్చునని అనుభవైక్యంగా వాహినీవారు గ్రహించగల్గితే వచ్చే చిత్రాలలో ఆ వెతదలనుకూడా తప్పించుకొని నిర్మాతలు జానపదచిత్రాలుకూడా లౌకిక సంఘటనలతో రసవత్తరంగా తీయ ప్రయత్నిస్తారని ఆశించవచ్చును.



అల్లుళ్ళు—జి. వి. సుబ్బారావు, శివరావు, రేలంగి వెంకట్రామయ్యగార్లు.

మనరాష్ట్రం: మనదేశం

(5-వ పేజీ తరువాయి)

నంగా ఎంచకుండా, రాజధాని కార్యాలయాన్ని విజయవాడలో స్థాపించడానికి రాయలసీమవాసులే ప్రతిపాదిస్తే, కోస్తాజిల్లాల వారిమైత్రి సుహృద్భావాలను సులువుగా వారు గెల్చి; తమ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి సదవకాశం కల్పించుకోవచ్చును. ఉత్తరోత్తరా రాజధానీ నిర్మాణపు ఖర్చులికి తట్టుకోలేని భారత ప్రభుత్వంచేత హైదరాబాదును విశాలాంధ్రరాష్ట్రానికి రాజధానీ నగరంగా నిర్ణయించడానికి అంగీకరింప చేయవచ్చును.

[సీతారాం]

కులాసాకబుర్లు:

"గార్దభోపాఖ్యానం"

[శ్రీ జి. యన్. సూరి]

అమెరికన్ రహస్యపరిశోధక పోలీసుశాఖను ఇటీవల ఒక్క గాడిద కలవరపెట్టింది. గాడిద అంటే నిజమైన చతుష్పాదపు గాడిద; నరగార్దభుడు కాదు. ప్రెసిడెంటు ట్రూమన్ గారికి ఫ్లోరిడాసముద్రతీరాన జలక్రీడలకోసం ప్రత్యేకంగా ఒక స్నానఘట్టం ఏర్పాటు చేశారు. శ్రీవారుతప్ప ఆ ప్రాంతాన ఎవ్వరూ కాలు పెట్టేందుకు వీలులేదు. పైగా సమీపంలో సబ్మరైను యుద్ధపరిశోధనలు జరుగుతున్నందువల్ల అహర్నిశలు పహరా ఇస్తూఉంటారు. ఇటువంటి మహాప్రదేశంలో ఒకనాడు తెల్లవారేసరికి మేకుకు కట్టిన గాడిద కనిపించింది. ఇంతమంది కళ్లలో దుమ్ముకొట్టి అంత అఘాయిత్యం చేసినవాడు ఎవడా అని అధికారవర్గంవారు ఖంగారు పడుతున్నారు.

తాజావార్తలనుపట్టిచూస్తే ఈ కొంటెచేష్టకు కర్త నావికాదళంలోనివాడేమోనని తోస్తున్నది. అమెరికన్ ప్రభుత్వం వైమానికశాఖకు పక్షపాతం కనబరుస్తున్నదనీ, నావికశాఖకు నిరాదరణ చూపుతున్నదనీ, భావన ప్రచారంలో ఉన్నది. ఈమధ్య ప్రెసిడెంటుగారు ఒక నావికుణ్ణి హలో అని పరామర్శ చేయగా బదులు చెప్పకుండా గైరుహాజరు అయినాడుట. దానిమీదట నావికులు ప్రెసిడెంటుగారికి ఉచితమైన గౌరవం చూపవలసిందని ఒక ఫర్మానా జారీ అయింది. దీని పర్యవసానమే ఈ గాడిద.

అదేమి దురదృష్టమోగాని అగౌరవానికి ముఖ్యచిహ్నంగా గాడిదను పరిగణించటం పరిపాటి అయింది. ఏకారణంవల్ల గాడిదకు ఈ స్థానం ఇచ్చారో బోధపడకుండా ఉన్నది. వట్టి అమాయికపు జంతువ. తిండివిషయంలో ఎటువంటి నూకిరాలూ పోదు. గడ్డిపరకలుమొదలుకొని కాగితాలవరకూ తింటుంది. సుగ్గిళ్లకోసం గోలపెట్టదు. మాలీసుకోసం మారం చెయ్యదు. ఎన్ని బరువులు వేసినా ఏమీ అనదు. బట్టబయలులో బందమైనా లేకుండా వదలినా పారిపోదు. అంత చాకిరిచేసే జంతువు మరొకటి కానరాదు. ఇంత అప్రతిష్ఠకు గురియైన జంతువు మరొకటి కనబడదు. అది దాని ఖర్మ అనాలి.

ఏనుగను ఎక్కి నిక్కుతారు. గాడిదను ఎక్కి తలవంచుకుంటారు. వాహనాల జాబితాలో ఈ రెండు జంతువులూ అగ్రకనిష్ఠస్థానాలను ఆక్రమించినవి. ఏనుగను ఎక్కటానికి ఎన్నో తతంగాలు చేస్తారు. ఆపాదమస్తకం అలంకరించుకుంటారు. తల దువ్వుకుంటారు. గంధం పూసుకుంటారు. తిలకం ధరిస్తారు. చీనచీనాంబరాలను ధరిస్తారు. అంబారిలో కూర్చుని మంగళవాద్యాలతో ఊరేగుతారు. జనమంతా నోరు తెరుచుకుని భళీభళీ అని అచ్చెరువొందుతారు.

ఇక గాడిద ఊరేగింపు గమనించండి. కౌపీనం మినహా వస్త్రసన్యాసం చేయిస్తారు. తలకాయ నున్నగా ముండనంచేస్తారు. వంటినిండా మసిపట్టిస్తారు. సున్నపుబొట్టు తీర్చి దిద్దుతారు పెడరెక్కలు విరగకట్టుతారు. గాడిదను ఎక్కిస్తారు. డప్పులుకొడుతూ ఊరేగిస్తారు. జనమంతా ఇకిలిస్తూ గేలిచేస్తారు. అసలువాడు అవమానంతో కుంగిపోతాడు.

ఈ జంతువు ఇంత హేయానికి ఎందుకు గురి అయిందో ఊహించటం కష్టంగా ఉంటుంది. గాడిదపిల్ల ఉన్నంత అందంగా గుర్రపుపిల్ల ఉండదు. చెవులు ఆడిస్తూ, తోక విదిలిస్తూ వెనుక రెండుకాళ్లూ అమాంతం రెత్తిగంతులు వేస్తూ ఎంతో గోముగా పెరుగుతుంది. బాల్యం వదలినప్పటినుంచీ దాని బాధలు ప్రారంభమవుతవి. చాకిరేవునుండి ఇంటికీ, ఇంటినుంచి చాకిరేవుకూ మూటలు మొయ్యాలేక సతమతమవుతుంది. ఇటువంటి చిన్నచూపుకు దాని అరుపే కారణమని తోస్తుంది: ఏమిపాపం చేసుకుందోగాని భగవంతుడు దానికి కర్ణకఠోరమైన అరుపును ప్రసాదించాడు. వెన్నెలరాత్రులలో నాలుగు గాడిదలు ఒకచోట చేరినవా అంటే పరిసరాలలో ఉన్న గృహస్థులు కన్నుమూయటానికి వీలు గాకుండా పోతుంది. ఆ అరుపులే దాని పతనానికి దారి తీసినవి. వసుదేవుడు ఒకసారి ఈ గాడిదదెబ్బకు తట్టుకోవలసి వచ్చింది. శ్రీకృష్ణుడు పుట్టినప్పుడు ఆ శిశువు కంసుడి కంట పడకుండా వ్రేపల్లె వాడకు జారవెయ్యాలనుకున్నాడు. అర్ధరాత్రిన చలీచప్పుడు గాకుండా పిల్లవాడిని ఎత్తుకుని బయలుదేరాడు. జైలువార్డర్లను తప్పించుకున్నాడు. గోడ్డు ఎక్కాడు. అమ్మయ్యా అనుకున్నాడు. ఇంతలో ఒక గాడిదకంఠం పూరించి గమకాలు ప్రారంభించింది. కొంప మునిగింది అనుకున్నాడు వసుదేవుడు. అమాంతం గాడిద కాళ్లు పట్టుకుని కాసేపు తమాయించమని ప్రాధేయపడ్డాడు. ఎంతో కష్టంమీద పాపమని గొంతులో అరుపును దిగమింగింది ఆ జంతువు. బ్రతుకు జీవుడా అని బయలుదేరాడు వసుదేవుడు. శ్రీకృష్ణుడు సురక్షితంగా పెరిగి పెద్దవాడై భగవద్గీతను చెప్పటానికి వీలయింది. ఆ గాడిద పెద్దమనిషితనంగా వ్యవహరించకపోతే ఏమయేది? శ్రీ కృష్ణుడు ఏమయేవాడు? భారతయుద్ధం ఏవిధంగా పరిణమించేది? ఈవిషయాన్ని ఎవ్వరూ గమనించరు. అమితమైన విశ్వాసం చూపటానికి బదులు అంతులేని అవమానం చూపుతున్నారు ఈ మహత్తర జంతువుకు. ఇంతకంటె కృతఘ్నత మరొకటి ఉండదు.

గాడిద ఏమిచేసినా అపసవ్యంగానే పరిణమిస్తుంది. పంచతంత్రం చదివిచూడండి. బహుశా చాకలివాడే కాబోలు; ఒక గాడిదను, ఒక కుక్కను పెంచుతూఉంటాడు. అమావాస్యనాడు అర్ధరాత్రిన వాడి ఇంటికి ఒక దొంగ వేంచేస్తాడు. కాపలా కాయవలసిన కుక్క గుర్రుపెట్టి నిద్రపోతుంది. అది దాని డ్యూటీ కాకపోయినా గాడిద దొంగరాకను గమనిస్తుంది. శునకాన్ని నిద్రలేపి సంగతిసందర్భాలు తెలియచేస్తుంది. మొరగమని మొత్తుకుంటుంది. కుక్క చలించదు. అరచేందుకు ఓపికలేదని మళ్లీ కన్నుమూస్తుంది. ఈలోపుగ దొంగవాడు కార్యక్రమానికి ఉపక్రమిస్తాడు. గాడిద చూసి సహించలేకపోతుంది. ఏమైనాసరేనని పెద్దదమ్ము తీసుకుని ఊరంతా మారుమ్రోగేట్లు ఓండ్రపెడుతుంది. దొంగవాడు పారిపోతాడు. ఇంటియజమానికి నిద్ర భంగమై కోపంతో లేచివస్తాడు. గాడిదకు కృతజ్ఞత చూపి కుక్కకు పెట్టవలసిన శేషన్నకూడ మేపటానికి బదులు దుడ్డుకర్రను తీసికొని గోల చేస్తావా అని గాడిదను చావమోదుతాడు. ఇంతకంటె అన్యాయం మరొకటి ఉంటుందా? అంతి జాగ్రత్తకు ఇదా బహుమానం.

గాడిద వట్టి తెలివితక్కువ జంతువంటారు. ఇది అక్షరాలా అబద్ధం. ఒక ఉప్పువ్యాపారస్తుడికి ఒక మంచిగాడిద ఉండేదట. ప్రతిరోజూ ఉప్పుమూటలన్నీ దానిమీద వేసి సంతకు తీసికొని వెళ్లేవాడుట. ఒకనాడు బరువుతో కుంగిపోతూ చిన్న తాటికాలువంతెనమీదినుంచి గాడిద నడుస్తున్నదిట. ప్రమాదవశాత్తూ కాలుజారి నీళ్లలో పడుతుంది. ఉప్పు నీటికి తగలగానే కరిగిపోతుంది. బయటికి వచ్చినతరువాత బరువు తగ్గటం గాడిద గమనిస్తుంది. ఇది మనసులో పెట్టుకుని ప్రతితడవా ఆ వంతెనదగ్గరకు రాగానే నీళ్లలో పడేదిట. ఇంతకంటే తెలివితేటలు ఏజంతువుకు ఉండగలవు? ఇది కనిపెట్టి ఆసామి ఒకరోజున గడ్డిమూటలనుపెట్టి తోలుకుని వెళ్లతాడు. మామూలుచొప్పున నీళ్లలో దూకుతుంది. నీళ్లలో తడిసి గడ్డిబరువెక్కుతుంది. మోయలేక నడుములు విరుగుతవి. అంత తెలివితేటలు చూపిన జంతువును ఈ విధంగా శిక్షించవచ్చునా? ఇప్పటికైనా మనం గాడిదకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి. బుద్ధిహీనుడైన మనిషిని గాడిదా అని పిలవకుండావుంటే అంతే చాలు.

నేటి ప్రపంచం

(9-వ పేజీ తరువాయి)

గురించి ఎటువంటి ముఖ్యసూచనా చెయ్యబడలేదు. ఈ విషయమై కమిషన్ అభిప్రాయాన్ని స్పష్టపరచాలని భారతప్రభుత్వం కోరినప్పుడు, భారతప్రభుత్వానికి అనుకూలంగానూ, పాకిస్థాన్ అడిగినప్పుడు, పాకిస్థాన్‌కు అనుకూలంగనూ అభిప్రాయాలు ప్రకటించారు. కాని, ఆజాద్ కాశ్మీర్ సైన్యాల బలాలనుగురించి భద్రతా మండలికి తిరిగి నివేదించవలసిన అవసరాన్ని కమిషన్ గుర్తించలేదు.

కమిషన్‌సభ్యులలో జెకోస్లావాక్ ప్రతినిధి డా॥ చైల్ ప్రత్యేకనివేదిక నిస్తూ ఈ లోపాలన్నిటినీ వివరించి, ఇవే కమిషన్ వైఫల్యానికి హేతువులని నిరూపించాడు. కమిషన్ వివరించిన మూడుసమస్యలూ భద్రతామండలి చర్చించనివి. పాకిస్థాన్‌దురాక్రమణను అరికట్టాలని కోరుతూ భారతప్రభుత్వం చేసిన ఫిర్యాదును సక్రమంగా చర్చించక రాజకీయ సమస్యల్ని ముందుపెట్టి, దురాక్రమణను అరికట్టకుండా విడిచినందుకు ఇదే ఫలితం ప్రాప్తించింది. పఠాన్ల దోపిడీలనీ, పాకిస్థాన్ సైనికుల జోక్యాన్నీ అప్పుడు భద్రతామండలి పరిశీలించలేదు. పాకిస్థాన్ తన సైన్యాలనక్కడకు పంపలేదని అసత్యవాదం చేసినప్పుడు ఆ విషయాన్ని పరిశీలించలేదు. పాకిస్థాన్‌వాదాన్ని ఆమోదించి ఊరుకున్నారు. ఆపైన కమిషన్ కాశ్మీరం వెళ్లి పరిశీలించినప్పుడు, భారత ప్రభుత్వం చేసిన ఫిర్యాదు సత్యమని గ్రహించికూడా ఈ సత్యందృష్ట్యా పరిస్థితి మారిందనిగాని, అందువల్ల భద్రతామండలి తిరిగి సమస్యను చర్చించవలసిన అవసరం కలిగిందనిగాని భద్రతామండలికి కమిషన్ నివేదించలేదు.

1949 జనవరి 1 వ తేదీని యుద్ధవిరామం జరిగినదిమొదలు పాకిస్థాన్ "ఆజాద్‌కాశ్మీర్" ప్రాంతంలో పఠాన్లను, పాకిస్థానీలను, ఆప్రాంతంలోని కొంతమంది మహమ్మదీయుల్ని చేర్చి బలమైన "ఆజాద్ కాశ్మీర్" సైన్యాలను నిర్మిస్తూఉన్నప్పటికీ, ఈ పరిస్థితిదృష్ట్యా శాశ్వత సంధికి భద్రతామండలి చేసిన సూచనల్ని మార్చుకోవలసిఉన్న అవసరాన్ని కూడా కమిషన్ భద్రతామండలికి నివేదించలేదు. ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యాలున్నాయని పాకిస్థాన్ అంగీకరించినప్పుడు, ఆజాద్‌కాశ్మీర్‌సైన్యాలను బలపరిచినట్లు గ్రహించినప్పుడు, భద్రతామండలి తిరిగి సమస్యను పరిశీలించిఉండవలసినది. ఇప్పుడైనా వీనిదృష్ట్యా భద్రతామండలి కొత్తగా చర్చించి కొత్తసూచనలు చెయ్యవలసిన అవసరం ఉందని భారతప్రభుత్వం భద్రతామండలిని కోరవలసిన అగత్యం ఉంది.

ఈ సందర్భంలో అమెరికన్ ప్రతినిధిచర్యలనుగురించి జెకోస్లావాక్ ప్రతినిధి చేసిన విమర్శలు కొన్ని ఉన్నాయి. పాకిస్థాన్ భారతసైన్యాలు యుద్ధవిరమణఅనంతరం ఏసరిహద్దులకు లోబడి నిలవరించబడాలో కరాచీ సమావేశంలో నిర్ణయమయింది. అప్పుడే ఆజాద్ కాశ్మీర్ సైన్యాల భవిష్యత్తునుగురించీ, సైనికోపసంహరణనుగురించీ ఉత్తర ప్రాంతాల పరిపాలననుగురించీ చర్చించాలని ఒకసూచన చెయ్యబడింది. అయితే ఈ విషయాలచర్చను కరాచీ మిలిటరీచర్చలతో జోడించకూడదని డా॥ చైల్ అభ్యంతరపెట్టాడు. ఆ విధంగా జోడిస్తే రాజకీయవిషయాలచర్చ సైనికవిషయాలపై సమాధానాన్ని భగ్నపరచవచ్చును. ఆ తరువాత వేరే సమావేశానికి నిర్ణయమయింది. కాని కమిషన్ ఈ రెండోసమావేశాన్ని ఒక వంక ప్రతిపాదించి, మరొకవంక ఈ సమావేశం సఫలం కాదని ముందే నిర్ణయించుకొని అడ్మిరల్ నిమిట్జ్‌ను పరిష్కర్తగా నియమించాలని ఒక ప్రతిపాదన చేశారు. ఎలాగైనా కాశ్మీర్‌సమస్యను నిమిట్జ్ పరిష్కారం కిందికి తేవాలని కమిషన్‌సభ్యులలో ఒకడైన అమెరికన్ ప్రతినిధి అనుచితంగా యత్నించాడని డా॥ చైల్ ఆరోపిస్తున్నాడు. ఇప్పటికీ అమెరికన్ ప్రతినిధిగాని కమిషన్‌గాని ఈ ప్రయత్నాలు మానలేదు.

పరిష్కర్తనియామకంవల్ల ఒకనష్టం ఉంది. ఇంతవరకూ ఒకవిధంగా నిర్ణయమైన విషయాలను తిరిగి మొదటికి తెస్తేగాని, అనగా మొదట భద్రతామండలి చేసిన కొన్ని నిర్ణయాలను, కమిషన్‌చేసిన కొన్ని నిర్ణయాలనూ రద్దుపరిస్తేగాని పరిష్కర్త చెయ్యదగిన పరిష్కారం ఏమీ ఉండదు. ఈపరిస్థితివల్ల పరిష్కారం అసాధ్యం అవుతోంది. ఈసందర్భంలో డా॥ చైల్ సూచనలు ఆచరణయోగ్యంగా ఉన్నాయి.


భద్రతామండలిలో ఈమాసం కాశ్మీర్ కమిషన్ నివేదిక చర్చకు వచ్చినప్పుడు పాకిస్థాన్, భారత ప్రభుత్వ ప్రతినిధులమధ్య సమాధానం కుదర్చడానికి భద్రతామండలిఅధ్యక్షుడైన కనేడియన్ ప్రతినిధి జనరల్ మెక్‌నాటన్ మధ్యవర్తిత్వం వహించి కృషిచేస్తున్నాడు.

ఇండోనీషియాకు స్వాతంత్ర్యసిద్ధి:

ఇండోనీషియాకు డిసెంబరు 27-వ తేదీని స్వాతంత్ర్యం లభించనున్నది. ఇండోనీషియా పార్లమెంటు, ప్రాంతీయశాసనసభలు, డచ్చి పార్లమెంటు హేగ్ ఒడంబడికను ఆమోదించాయి. ఇండోనీషియన్ పార్లమెంటు డా॥ సోకర్నోను రిపబ్లిక్ అధ్యక్షునిగా ఎన్నుకుంది. డా॥ సోకర్నో నలుగురు నాయకుల్ని ఎంచి మంత్రివర్గం నిర్మించే బాధ్యత వారిపైనపెట్టాడు. వారిలో డా॥ హట్టా, జోగ్జకర్తా సుల్తాన్ కూడా ఉన్నారు. నలుగురూ డా॥ హట్టాను రిపబ్లిక్ ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారు. నలుగురూ కలిసి మంత్రివర్గాన్ని నిర్మించారు.

క్రమక్రమంగా ఇండోనీషియా లోని (న్యూగినీ మినహా) సర్వకేంద్రాలనూ డచ్చి సైన్యాలు ఇండోనీషియన్ రిపబ్లికన్ సైన్యాలకూ పోలీసుదళాలకూ ఒప్పగిస్తున్నాయి. డచ్చిసైన్యాలు ఆయాకేంద్రాలలో బారక్సులోనే ఉంటున్నాయి. ఆరుమాసాలమొదలు, సంవత్సరంలోగా డచ్చిసైన్యాలు ఇండోనీషియాను విడిచిపోగలవని ప్రకటించారు. అంతవరకూ అక్కడేఉండి రిపబ్లికన్ ప్రభుత్వం శాంతిభద్రతలనిమిత్తం సహాయంకోరినప్పుడు సహాయమివ్వడానికి అంగీకరించబడింది.

[సూర్యనారాయణ]



మంగళగిరి పంచాయితీబోర్డువారు నిర్మింపదలచిన కూరగాయల మార్కెట్‌కు టి. ప్రభాకరరావు నాయుడుగారు శంకుస్థాపన చేసినసందర్భమున తీసిన ఫోటో.

రుద్రమ దేవి

(19-వ పేజీ తరువాయి)

బడినవి. గ్రామము లెన్నో మునిగినవి. వేనకువేలుగా ప్రజలు నిరాధారులై ప్రాణాపాయస్థితిలో నుండిరి. అల్లాడిపోవుచున్న జనుల బాధ చూచుచు ప్రతిక్రియలు స్వయముగా దగ్గర నుండి చేయింపకుండ కదలి రాలేకపోతిని. ఖనకులకు స్థపతులకు తక్షకులకు ఆజ్ఞలిచ్చుచు ఆర్తులకు అన్నవస్త్రనివాససౌకర్యములు కలిగించుచు మహారాజులకు క్షమాపణపత్రము ముందుగనే పంపుకొంటిని. స్థితిగతులు కొంత దారిలోనికి వచ్చినతరువాత మిగిలిన కార్యములు రుద్రదేవుల కప్పగించి ముందు రాజదర్శనమునకు వచ్చితిని. కొలని రుద్రుల యాలస్యమునకు గూడ నేనే కారణుడను!"

కొలని రుద్రుడు అన్నమంత్రివాక్యములే ధ్రువపరచెను.

గణపతిదేవుల యాజ్ఞ మరల కార్యభరణుడు వినిపించెను.

"ఇందులూరి అన్నమంత్రీశ్వరులను కొలని రుద్రులును వారియందు మహారాజులు మోపిన కార్యభారము విధిపూర్వకముగా నెరవేర్చిరి. అన్నమంత్రీశ్వరులు ప్రజాక్షేమమునకై కోరుకొను వర మేదే నున్న శ్రీరుద్రదేవమహారాజులు తీర్పగలరు. మే మింతటితో ప్రత్యక్షముగా శాసనములు చేయుట విరమించి శ్రీరుద్రదేవమహారాజుల కా భార మిప్పుడే అప్పగించుచున్నాము!"

అంతట గణపతిదేవులు శ్రీ రుద్రదేవమహారాజులకు రత్నఖచితసువర్ణముద్రాంగుళీయము సమర్పింప నది వినయపూర్వకముగా వా రందుకొని కన్నుల కద్దుకొని స్వీకరించిరి.

అన్నమంత్రీశ్వరు డిట్లర్థించెను.

"మహారాజులు నవరాత్రదీక్షలో నిమగ్నులై యుండ నొక్కసారిగా మా కరణములు పనులకు రాక చికాకుపరచిరి. వా రెక్కువభాగము జైనులు. వారి నింతవరకు మే మెట్టి చిక్కులు పెట్టక అధికాదరముతో జూచుచుంటిమి. వారి కీ బుద్ధి యొక్కసారిగా ఏల పుట్టినదో ఎరుగము. అందుచే ఈ వ్రాయసవృత్తి యొకేసంఘమున పారంపర్యముగా నుండుట పరిపాలనకు ప్రమాదకర మని స్పష్టమైనది. విచారించగా పలువురు బ్రాహ్మణులు వ్రాయసవృత్తి ఆమూలాగ్ర మభ్యసింప కుతూహలముతో నున్నట్లు మాకు తెలిసినది. అదృష్టవశమున పాకనాటినుండి తద్వ్యవహారరహస్యము లెరిగిన విప్రులు నూరుగు రీమధ్య ఓరుగంటికి వచ్చియున్నారు. వారు దక్షులు. వారిచే బ్రాహ్మణులకు కరణపాఠశాల ప్రారంభింపజేయుట ప్రజాక్షేమకర మని మాకు తోచినది. శ్రీ రుద్రదేవమహారాజుల సమక్షమున ఈ గోధూళికాపవిత్రలగ్నమున అందు మంగళపాఠ ముపక్రమింప ననుజ్ఞ యిచ్చుటే నేను అర్థించువరము!"

శ్రీ రుద్రదేవమహారాజు ప్రీతివిలోకనములు అన్నమంత్రిపై పరపెను. ఆ మధ్యాహ్నమే వారికి కరణముల యలజడి నివేదింపబడియుండెను. దానికి ప్రతిక్రియగా అన్నమంత్రి యిది తన కుపదేశించుచున్నట్లే ఆమె భావించెను. వెంటనే యామె యిట్లు శాసించెను.

"శ్రీగణపతిదేవులు రాజ్యభారము మాపై మోపిన దిప్పుడే! మా ప్రథమశాసనము మా కెంతేయు నానందదాయకముగా నున్నది. ఈ పాఠశాల వెంటనే ప్రారంభింప ననుజ్ఞ యిచ్చుచున్నాము!"

ఇందులూరి యన్నమంత్రిచే ననుజ్ఞాతులై ఆ మహామండపమునకు ఆ నూరుగురు బ్రాహ్మణులును గురునాథునివెంట వచ్చి వారి కొయితిమొనరించిన యాసనముల నుపవిష్టులైరి. ఆ పాఠశాలలో నభ్యసింపవలచిన బ్రాహ్మణులను రమ్మన నొక్కసారిగా ఆరువేలమంది శ్రోత్రియబ్రాహ్మణులు వచ్చిరి. ఉత్తరక్షణములో గురునాథుడు పరిషదనుజ్ఞ పొంది శ్రీమహాగణాధిపతిపూజ కావించి మంగళపాఠము ధీరగంభీరవాక్కులతో ప్రారంభించెను. ఆనాడు ద్రవ్యసంజ్ఞ, తులామానము, ఘనమానము, ధాన్యసంజ్ఞ, సంఖ్యాస్థాననిరూపణమును లీలావతీగణితములోని మొదటి పదిశ్లోకములతో అధ్యాపన మొనర్చి మంగళము చెప్పెను.

అంతలో కార్యభరణుడు శ్రీ రుద్రదేవమహారాజుల హస్తములలో కొన్ని పత్రము లుంచెను. అవి చూచి యామె యుత్తరక్షణమున నిట్లు శాసనము చేసెను.

"మా మంత్రులును సామంతులును దండనాథులును తమ ప్రధానకరణములను శిరశ్ఛేదము చేయింప మా యనుమతి వేడుచు పంపిన పత్రము లివి! మా మహామాత్యుల యభ్యర్థనము ధర్మబద్ధమే. అయినను ఈ యానందసమయమున ఈ కరణముల నందరను మేము క్షమించుచున్నాము. అందుచే ఈ యపరాధమునకు బంధింపబడినవారినిగూడ నందర విడిపింపవలె నని ఇందుమూలముగా నాజ్ఞాపించుచున్నాము. వారల మరల ఘనోద్యోగములలో చేర్చుకొనుటో మానుటో మా మహామాత్యుల నిర్ణయమునకే వదలిపెట్టుచున్నాము. ఐనను వారల నందర దయాదృష్టితో వారు చూడగల రని మా విశ్వాసము! మా ప్రజలయం దందరియెడ మా కెట్టి సమానవాత్సల్య మున్నదో సమస్తజనమును దీనితోనైన దెలిసికొందురుగాక!"

ఈ యాజ్ఞ విని యా మహాసభలోని యార్యజనములు సాధువాదము లొనర్చిరి.

అంతలో మేచయనాయకు డచ్చటికి తిరిగి వచ్చెను. అతడు తాను వెడలిన వ్యవహారఫలితము శ్రీ గణపతిదేవులకు నివేదింపబోయెను. గణపతిదేవులు వినిపించుకొనలేదు. కార్యభరణుడు రాజ్యభారము వారు శ్రీ రుద్రదేవమహారాజుల కప్పగించి రని చెప్పగా నాతడు దిగ్గుకొని శ్రీ రుద్రదేవమహారాజులకు మ్రొక్కి జనాంతికముగా నిట్లు నివేదించెను.

"శ్రీ చాళుక్యవీరభద్రేశ్వరులను హరిహరదేవమురారిదేవులను మహారాజునాజ్ఞచే బంధించుటకు వెళ్లితిని. వారు దొరకలేదు. కాని వారికై యాశ్వికు లన్నిదిశల వెదకుచున్నారు. కారాగారమున బంధితులు కొందరు తప్పించుకొని రని తెలియవచ్చినది."

ఇట్లు నివేదించి యాతడు సెలవుతీసికొని వెళ్లిపోయెను.

పంచతూర్యారవము లొక్కసారి చెలంగెను. బ్రాహ్మణులు స్వస్తివాచనము ప్రారంభించిరి. సభ్యులు జయజయనినాదము లొనర్చిరి. సువర్ణదండధరులు బహుపరాకులతో దారితీసిరి. ముందు దివిటీలు కదలెను. వందిమాగధులు కైవారము లొనర్చిరి. శ్రీ రుద్రదేవమహారాజులు విజయయాత్రోత్సవమునకు బయలుదేరిరి. వారివెంట అన్నమంత్రీశ్వరాదులు వెడలిరి.

ఆ సభామండపమునకు సమీపముననే యొక విశాలప్రదేశమున నొక జమ్మిచెట్టు కలదు. దానిపైనుండి వివిధశత్రునామము లున్న చిత్రపత్రములు వ్రేలాడగట్టియుండెను. పర్వతనాయకుడు శ్రీ రుద్రదేవమహారాజులకు విల్లు నంబులు నందించెను. వా రం దర్ధచంద్రబాణము సంధించి ఆ వ్రేలాడు పత్రములలో ప్రధానమై ఆకర్షించుచున్న దానిని రెమ్మతోకూడ పడునట్లు ఛేదించిరి. జయజయనినాదములు పిక్కటిల్లెను.

అన్నమంత్రీశ్వరాదివీరులు తమ ఖడ్గములు తీసి యట్లే జమ్మిపై నున్న పత్రములు రెమ్మలతో ఛేదించిరి. వారి వీరతావిజృంభణము ఒక్కొక్కరిది ఒక్కొక్క విధముగా భాసించెను. వా రట్లు ఛేదించిన పత్రములు రాజభటులు శ్రీరుద్రదేవమహారాజుల కందీయ వారి వలననుండి యట్లని ఛేదించిన వీరులు బహుమానముగా పడసిరి.

జన్నిగదేవుశకి ప్రసాదించిన పత్రములపై జటావర్మసుందరపాండ్యకొప్పెరుంజింగల నామము లున్నవి; త్రిపురాంతకునకు సిద్ధముదేవచోడపత్రము వచ్చినది; అంబదేవునకు అనేకపత్రము లబ్బినవి—ఎలువమల్లిచోడ, కేశవదేవ, సోమిదేవ, అల్లుగంగ, మల్లికార్జున, దామోదర నామము లందున్నవి.

ఇట్లు పవిత్ర మగు జమ్మిపత్రములు సాక్షులుగా నంధ్రోర్వీశసామంతులు కాకతిరాజ్యశత్రువుల దునుమాడగల మను ప్రతిజ్ఞ ఖడ్గధారచే గైకొనిరి.

ఇందులూరి అన్నమంత్రికిని, కొలని రుద్రునికిని లభించిన పత్రము లెవ్వి? శ్రీ రుద్రదేవమహారాజులు ఛేదించిన ప్రధానశత్రు వెవ్వరు?

అంతలో కరదీపికలతో నా విశాలప్రదేశమున క్రమ్ముచున్న చీకటులు విరిసెను.

పారువేట వినోదముగా సాగెను. మందలుమందలుగా మూగిన శత్రుసైన్యములు గొఱ్ఱెలవలె పలాయనమయ్యెను. నానావేషధారులు చేతుల గాజులు ధరించి వచ్చి మహారాజులకు మ్రొక్కిరి.

పండితులకు కవులకు గాయకులకు నటులకు వినోదకులకు మల్లురకు నానాయుద్ధకుశలురకు సగౌరవముగా సాదరముగా పాత్రోచితముగా శ్రీరుద్రదేవమహారాజు లారాత్రి ప్రొద్దుపోవువరకు భూరిసంభావనలు పంచిపెట్టుచునే యుండిరి.

స్త్రీ జనాభ్యుదయ వార్షికోత్సవం



క్రిందటివారం విజయవాడలో గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో అయ్యదేవర కాళేశ్వరరావుఅధ్యక్షతక్రింద జరిగెను. కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్ శ్రీ శ్రీనివాసన్ ప్రదర్శనమునకు ప్రారంభోత్సవం జరిపిరి. సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ జి. ఎ. నరసింహారావు, స్త్రీ జనాభ్యుదయ సలహా సంఘాధ్యక్షురాలు శ్రీమతి మద్దిం శెట్టి, మున్నగు ప్రముఖులనేకమంది కార్యక్రమములో పాల్గొనినప్పటిదృశ్యం.

★ వార్తాచిత్రాలు ★



రాజగోపాలాచారిగారు తమిళనాడు కాంగ్రెసుసంఘం ఏర్పాటుచేసిన ఖాదీ స్వదేశీ ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరుపబోతున్న దృశ్యం.



అ. భా. ఖాదీ స్వదేశీప్రదర్శనలోని విద్యానగరంలో అంధపాఠశాల బాలుర పాటకచేరీ.



రాజమహేంద్రవరం. శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘంవారు తుపానుబాధితుల సహాయార్థమై పురవీధులలో ప్రచారంచేసి పాతబట్టలు వసూలుచేయుచున్న దృశ్యం.




గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారిగారు, గవర్నర్ భావనగర్ మహారాజా సమేతులై విశాఖపట్నంలోని ప్రేమసమాజాశ్రమం సందర్శించినప్పటి దృశ్యం.

భారతరిపబ్లిక్ అవతరణ మహోత్సవతరుణంలో (జనవరి 26) ప్రత్యేకంగా విడుదలచేయబడనున్న తపాలా బిళ్లలు



విద్యాభివృద్ధి సూచకంగా



పారిశ్రామికాభివృద్ధి సూచకంగా



వ్యవసాయికాభివృద్ధి సూచకంగా




ఉత్సవానంద సూచకంగా



గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారిగారు క్రిందటివారం చెన్నపట్నంలో నౌకాదినోత్సవంలో పాల్గొన్నారు. ఆ సందర్భంలో స్థానిక నావికాధికారి ఏర్పాటుచేసిన విందులో ఆయన ఉపన్యసిస్తున్న దృశ్యమిది.

Red. No. M. 4479



Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras